# ప్రజాశక్తి

Vol. 1, no. 313

(Oct. 20, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 313

(Oct. 20, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

ప్రజాశక్తి
కమ్యూనిస్టు దిన పత్రిక
సంపుటి 1 ] బెజవాడ 20-10-46 ఆదివారం [ సంచిక 313



# హైద్రాబాద్ హైకోర్టు రహస్యసర్క్యులరు

## రాజకీయ ప్రచారకులపై వెంటనే చర్యతీసుకోవాలట

### రహస్య సర్క్యులరు

పేగే ఇస్తైదరాకు
తేదీ 10 అబాన్ 55 ఫ
మసలు నిషాన్ 59-55 ఫ
హిదాయతి ఖురానిలా
హైకోర్టు సర్కారు ఆలీ
ఇన్తైజామి శాఖ
నెం. 13 (రహస్యం)
హైకోర్టుముద్ర


హైకోర్టు సర్కార్ ఆలీ ఆజ్ఞానుసారము హైకోర్టు కార్యదర్శినుండి—

రాష్ట్రములోని నాజీం అదాలతులందరికి—

విషయం: రాజకీయపునేరాలపై తీర్పులు.

పైన వుదహరించిన విషయమై వ్రాయునది ఏమనగా, రాష్ట్రములోని కొన్ని రాజకీయ ప్రదేశాలలో రాజకీయ వుద్యమం చట్టవిరుద్ధ రూపం ధరిస్తోంది. అటువంటి దుండగీడుల న్యాయవిరుద్ధ చర్యలపై వెంటనే చర్య తీసుకోవడం అవసరము. యుక్తము. అందుచే న్యాయస్థానములలో విచారింపబడుతూన్న అన్ని రాజకీయపు కేసులన్నూ బహిరంగసభల నిబంధనలకు సంబంధించిన వానితోసహా, అన్ని కేసులను సాధ్యమైనంత త్వరలో తీర్పు చెప్పాలని తెలుపుతున్నాము.

(సంతకము)
హైకోర్టు కార్యదర్శి.




### రావి నారాయణరెడ్డి గారి ప్రకటన

హైద్రాబాదు, అక్టోబరు 17

ఆంధ్రమహాసభ కార్యదర్శి రావి నారాయణరెడ్డిగారు క్రింది ప్రకటన చేస్తున్నారు:

"హైద్రాబాదు హైకోర్టు దిగువ కోర్టు లన్నింటికీ పంపిన రహస్య సర్క్యులరును ఈ దిగువ ప్రకటిస్తున్నాను.

"హైద్రాబాదు సంస్థానంలో స్వతంత్రం, నిష్పక్షపాతం అయిన న్యాయవిధానం అమలులో వుందని ప్రచారం చేస్తున్నారు. ఎవరి మనస్సులలోనైనా అటువంటి దుర్భ్రమలు వుంటే, ఈ పత్రంతో అవన్నీ పోతాయి.

"ఎవ్వడో ఒక పెద్ద పోలీసు అఫీసరు తన క్రిందివారికి పంపిన సర్క్యులరు కాదు ఇది. అతడుకూడా ఈ విధమైన సర్క్యులర్లు పంపడం తప్పే. ఇక్కడ ఉన్నత న్యాయస్థానమే దిగువ కోర్టులకు దీనిని పంపుతూంది. రాజకీయ విషయాలలో హైకోర్టు ముందే కొన్ని నిర్ణయాలకు వచ్చి దిగువ కోర్టులకు వాటిని పంపుతోంది.

"కొన్ని ప్రదేశాలలో రాజకీయోద్యమం నిషేధించతగిన విధంగా నడుస్తున్నదట. అందుచేత అరాజకం కలిగిస్తూన్న రాజకీయ ప్రచారకులమీద దిగువ కోర్టులు వెంటవెంటనే చర్యలు తీసుకోవాలట. అంటే రాజకీయ ప్రచారకుల విషయంలో కోర్టులు వ్యతిరేకాభిప్రాయం కలిగివుండాలి. వారిని సాధ్యమైనంత త్వరలో శిక్షించాలి.

"హైకోర్టుతీసుకున్న ఈదృక్పథం అసలు న్యాయసూత్రాలకే విరుద్ధం.

"ప్రజావుద్యమాలను అణచివేయడానికై ప్రభుత్వం నాలుగువేపులనుంచీ నిర్బంధాలు సాగిస్తూంది. ఇదికూడా వానిలో ఒకభాగమే.

"నేడు తెలంగాణాలో ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుపార్టీలకు చెందిన 7 వందలమంది మీద కేసులు నడుపుతున్నారు.

"ఈమధ్యనే స్టేట్ కాంగ్రెస్ ప్రచారకుల మీదా, నాయకులమీదా కూడ కేసులు పెట్టారు.

"వీరందరినీ శిక్షించడానికిదిగువకోర్టులకు హైకోర్టు హుషారు యిస్తూంది. హైద్రాబాదు న్యాయశాఖ స్వతంత్రంగా వ్యవహరిస్తూందనే భ్రమను ఇది తొలగిస్తూంది.

"ఈ సర్క్యులరుయొక్క అర్థాన్ని గుర్తించి, ప్రజలు, ప్రజాసంస్థలు ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని ఐకమత్యంతో ఎదుర్కోవలసిందని విజ్ఞప్తి చేస్తున్నాను."

# లీగ్‌లో అభివృద్ధినిరోధకుల పని, నౌఖలీ దురంతాలు

## బాధితులకు సాయం పంపమని జోషి విజ్ఞప్తి

బొంబాయి, అక్టోబరు 18

భారతకమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కామ్రేడ్ జోషి క్రిందిప్రకటన చేస్తున్నారు.

"నౌఖాలీ ప్రాంత గ్రామాలు రెండో వల కిత్తాగా పరిణమించాయి. పరిస్థితులు అంత భయంకరంగానూ, విషాదకరంగానూ వున్నాయి. కొద్దికాలం క్రితంనుంచి లీగు లోని అభివృద్ధి నిరోధకులు స్థానిక అధికారు లతో ప్రత్యక్షసంబంధాలు పెట్టుకుని తూర్పు బెంగాలులో గూండా పద్ధతులను దిగారు. చిటగాంగ్‌లో మా పార్టీఆఫీ సుపై దాడిచేశారు. జిల్లామాజిస్ట్రేటు కళ్ళ ముందర కొందరు కామ్రేడ్సును కత్తులతో పొడిచారు. లీగులోవున్న అభివృద్ధి కాము కులు వెంటనే కదలాలి. తమ మధ్యవున్న అభివృద్ధి నిరోధకుల్ని తీవ్రంగా ప్రతిఘ టించాలి. వారికి నావిజ్ఞప్తి యిదే. వారిమీద నేడు పెద్దబాధ్యతవుంది. లీగు నాయకులు ఎంత త్వరగా ముందుకు వచ్చి, నౌఖలీలో హిందువులపై జరుగుతూన్న అత్యాచారా లను ఆపితే అంతమంచిది. లీగు పేరు ఇప్పుడు కళంకితం కాకూడదు. సోదరుల మధ్య శాంతినెలకొంటుంది.

"హిందూ సోదరులు ఈఘటనలకు ఆవేశపూరితులు కావడం సహజం. కాని, ఉద్రేకపడవద్దని వారికి నేను విజ్ఞప్తి చేస్తు న్నాను. ప్రతీకారదృష్టివల్ల, ఒకరి నొకరు చంపుకోవడం ఇంకా హెచ్చుతుంది. దాని వల్ల బ్రిటిష్ సామ్రాజ్యవాదులకే ఆనందం. ఇతరప్రాంతాలలో అల్పసంఖ్యాకులుగావున్న ముస్లిములకు పూర్తిరక్షణ ఇవ్వడంద్వారానే తూర్పుబెంగాల్‌లోని హిందువులకు సహాయ పడగలుగుతాం. అంతేగాని ప్రతీకారంగా పొడిచి సాయపడలేము. నేను ప్రత్యేకంగా బెంగాల్ హిందువులకు శాంతంగా వుండండని విజ్ఞప్తి చేస్తున్నా. వారు భారత విప్లవోద్యమానికి ఎప్పుడూ ముందంజ వడిపారు. ఆ విప్లవో ద్యమాన్ని మతకలహాలు యాపుమాపుతాయి. ఈదశలో పుద్దేశం పొందడం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు తోడ్పడడం మాత్రమే అవుతుంది.

"బెంగాల్ మంత్రివర్గం వెంటనే ఈదిగువ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

1. నౌఖలీలో సాహార్దత నెలకొల్పటం కుకై అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన ఒక సంఘాన్ని పంపాలి.

2. తమ కర్తవ్యం తప్పిన ఆఫీసర్లందరినీ తొలగించి, శిక్షించాలి.

3. బాధితులకు వెంటనే అన్నివిధాలా సాయంపంపాలి.

4. మిగిలిన బెంగాలు అంతటా శాంతి రక్షణకై అన్ని పార్టీల తోడ్పాటు తీసుకో వాలి.

"సోదరులమధ్య శాంతి స్థాపించి, ప్రజల్ని రక్షించడానికై పూనుకోగల సంయుక్త మంత్రివర్గాన్ని నెలకొల్పటంకై సర్వవిధాలా ప్రయత్నించ వలసిందని బెంగాల్‌లోని అన్ని పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నాను. రాజకీయంగా వచ్చిన విభేదాలను రాజకీయ పద్ధతులద్వారానే తొలగించుకోవాలి. నాయకులు పరస్పర ద్వేషం ప్రచారంలో దిగితే, ప్రజలు ఉద్రేక పడి ఒకరి నొకరు నరుకుకొంటారు. ఒకరికి వ్యతిరేకంగా మరొకరు రెండు పార్టీలవారూ బ్రిటన్ సహాయంకోసం చేతులు చాచడం అవుతుంది.

"నేడు బెంగాలులో ఒక్క బ్రిటిష్‌వారికితప్ప ఇతరులు ఎవ్వరికి క్షేమంలేదు. ఈఅవమానకర పరిస్థితులలోనైనా బెంగాల్ నాయకులలో బెంగాలును రక్షించాలనే వేడి పుట్టిస్తాయని ఆశపడుతున్నాను."

# కార్మికులపై లాఠీచార్జి 100 మందికిపైగా దెబ్బలు

## హైద్రాబాద్‌లో 2 వేలమంది అసమ్మతి సమ్మె

(మా విలేకరి)

హైదరాబాద్, అక్టోబరు 18

హైదరాబాదు సంస్థానంలో పోలీసుల నిరంకుశ విధానం రోజురోజుకు మితిమీరి పోతూవుంది.

నిరంకుశ విధానాన్ని ఖండించడానికి గాను ఈనెల 15వ తేదీనుంచి 17వ తేదీ వరకు సంస్థానమంతటా నిర్బంధవిధాన వ్యతిరేకదినం జరుపవలసిందిగా, అఖిల హైదరాబాద్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, నిజాంరాష్ట్ర ఆంధ్రమహాసభ, హైదరాబాద్ కమ్యూనిస్టుపార్టీ కలిసి ఒక పిలుపు ఇచ్చాయి.

### హైదరాబాద్‌లో 145 (మన144)

ఈ పిలుపు ననుసరించి హైదరాబాద్, సికింద్రాబాద్ పట్టణాలలో వివిధపరిశ్రమలలో పనిచేసే వేలకొలది కార్మికులు 17వ తేదీని బ్రహ్మాండమైన ప్రదర్శనాలు, బహిరంగ సభలు జరపాలని నిశ్చయించారు. ఇదివర కెన్నడూ లేనంత పెద్దఎత్తున సన్నాహాలు చేయసాగారు.

కాని, నిర్బంధవిధానంతోనే రాజ్యమేల దలచుకొన్న నైజాం ప్రభుత్వం 15 తేదీ సాయంకాలం ఈ ప్రదర్శనాలను నిషేధిస్తూ ఒక ప్రకటన చేసింది. వారం రోజులవరకూ ఏవిధమైన ఊరేగింపులు సభలు జరపరాదని 145 (బ్రిటిష్ ఇండియాలో 144) సెక్షనుజారీ చేసింది.

### పెక్కుచోట్ల సోదాలు

ఈ ప్రభుత్వం అంతటితో ఆగలేదు. ఆరాత్రే 12 గంటలకు పోలీసు నిర్బంధికి హుకుం వచ్చింది. తెల్లవారేసరికల్లా పట్టణంలో అను మానమున్న ఇండ్లన్నీ సోదాచేసి ప్రముఖ కమ్యూనిస్టు, కార్మిక, విద్యార్థి నాయకుల నందరినీ సుమారు 20 మందిని అరెస్టు చేయండని ఆ హుకుం. దాని ప్రకారం పోలీసుకింకరులు కొత్తగా సప్లయిచేయబడిన కార్లలో బయలుదేరారు. ఇంకా ఎవరూ నిద్రనుండి మేల్కొనకపూర్వం, తెలతెలవారే సమయంలో ఒకేసారి పట్టణంలో పెక్కు చోట్ల సోదాలుచేశారు. వారికి కావలసిన వారిలో ఇద్దరుతప్ప ఎవరూ దొరకలేదు. ఆ ఇద్దరు (1) వి. డి. శంకర్ (టెక్స్‌టైల్ లేబరు యూనియన్ కార్యదర్శి) (2) కె. సి. గుప్త (ఆంధ్రమహాసభ, హైదరాబాదు జిల్లా కమిటీ కార్యదర్శి) పోలీసులు ఆంధ్రమహా సభ, ట్రేడ్‌యూనియన్ ఆఫీసులచుట్టూ కావలా కాస్తున్నారు.

### కార్మికులపై లాఠీఛార్జీ 2 వేల కార్మికుల సమ్మె

మీర్జా యిస్మాయిల్‌గారి పోలీసులు కార్మి కులమీద ఎక్కువగా కేంద్రీకరించారు. ఈ వేళ ఉదయాన్నే ముఖ్యమైన మిల్లుగేటు లన్నిటివద్దకు పోలీసుదళాలు పంపబడ్డాయి.

హైదరాబాద్ టెక్స్‌టైల్ మిల్లుగేటువద్ద కార్మికులతో, ఈ నిర్బంధ వ్యతిరేక దినాన్ని గురించి మాట్లాడుతున్న వి. డి. శంకర్‌ను ఒక పోలీసుదళం అరెస్టు చేయబోయింది. కార్మికులు అడ్డగించారు. తమ నాయకుని అరెస్టు చేయడానికి వీలులేదని ఆయన రక్షణకు నిలిచారు. పోలీసులకు ఏమీ తోచ లేదు. వెంటనే కబురుపంపి నిమిషాలమీద మరో సాయుధ పోలీసుదళాన్ని తెప్పించారు. ఆ దళం వచ్చీరాగానే కార్మికులపైబడి తీవ్రంగా లాఠీఛార్జీ చేశారు. 7, 8 మందికి తీవ్రంగా గాయాలు తగిలాయి. వారిలో ఇద్దరు స్త్రీలు. మరో వందమందికిపైగా దెబ్బలు తగిలాయి. పోలీసులు శంకర్‌పై బడి, మాట్లాడనీయకుండా దవడలు గట్టిగా నొక్కి, హింసించారు. శంకర్ నోటినుంచి రక్తంకూడా కారింది. ఆయనను అరెస్టుచేసి లారీలో తీసుకొనిపోయారు.

కార్మికులు — భయపడలేదు. "శంకర్‌ను విడుదలచేయాలి" "పోలీసు నిర్బంధాలు నశించాలి" "కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్" అనే నినాదాలు మిన్నుముట్టేలా చేశారు. పనిలోకి వెళ్ళకుండా 2 మిల్లులలో సమ్మె చేసి మధ్యాహ్నం వరకూ మిల్లు గేటువద్దనే కూర్చుండి మధ్యాహ్నం తమ ఇండ్లకు వెళ్ళి పోయారు. మధ్యాహ్నం వీరికి సానుభూతిగా రోట్ బిస్కట్ ఫ్యాక్టరీ కార్మికులు 2 వందల మంది సమ్మెచేశారు. ఈరోజున సమ్మెచేసిన కార్మికుల సంఖ్య మొత్తం 2 వేలకుపైగా వుంటుంది.

ఈదినమంతా మిల్లు గేట్లవద్ద కావలా వుంచబడిన పోలీసులేకాకుండా, ఇంకా అద నపు దళాలు కార్లలో ప్రదర్శనాలు చేస్తూ, కార్మిక ప్రాంతాలన్నీ తిరుగుతున్నాయి. సికింద్రాబాద్ ముఖ్యవీధులనిండా ఎక్కడ చూచినా పోలీసులే. 2 పట్టణాలు చాలా అం జదిగావున్నాయి. కార్మికులలోను, విద్యార్థుల లోను నిరంకుశ చర్యలను ఎదుర్కొని అరి కట్టాలనే పట్టుదల, సంచలనం ఎక్కువ అవుతోంది.

( 3వ పేజీ తరువాయి)

నడుపుతున్నాడు. 1938 నైజాం బూటకపు సంస్కరణలకు కాంగ్రెస్ సహకారం సంపా దించాలని కుయుక్తులు పన్నుతున్నాడు. అతని పోలీసులేమో తెలంగాణాలో బలపడు తేరిన కిసాన్ వుద్యమాన్ని అణచివేసేందుకు ఏ ఘాతుకకృత్యమైనా చేస్తున్నారు. తెలం గాణా ప్రజల మహోద్యమాన్నిగూర్చి జాతీయ పత్రికల్లో ఒక్కమాట కూడ పడ్డంలేదు.

కాశ్మీరంలో జైళ్ళలో నిర్బంధింపబడిన ప్రజా నాయకుడు వెనుకంజవేయక మరో పోరాటం లేవలసిందని ప్రజలను ఉద్బో దిస్తున్నాడు. కాశ్మీర సంస్థానాధిపతిమాత్ర, ఒకవేపు ప్రజలను వేధిస్తూ, మరొకవైపు సంస్కరణలు పెడతామంటూ రాజీమాటలు మాట్లాడుతున్నాడు.

ఇప్పుడు ముస్లిం లీగు తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించింది. గనుక ఇక రాజ్యాంగచట్ట నిర్మాణ కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుంది. ఇందుతోపాటు సంస్థా నాధిపతులందరు పైనాటకం మొదలు పెడతారు.

నిజమైన అధికారాన్ని వ్యకుంఠానే ఏదో ఒక బూటక సంస్కరణలనిచ్చి ప్రజామండలి లోని ఉన్నతవర్గాల నాయకులతో రాజీ పడేందుకు సంస్థానాధిపతులు ప్రయత్నిస్తారు. అందుతోపాటు ప్రజల పోరాటశక్తిని అణచ డానికి మాత్రం వెనుదీయరు.

ఇలాంటి ద్రోహకరమైన రాజీ కుట్రలను తప్పకుండా మనం విచ్ఛిన్నం చెయ్యాలి. తిండికోసం, పొలం కోసం, స్వతంత్రం కోసం పోరాటం సాగించేందుకు ముందుకు వస్తున్న సంస్థాన ప్రజాఉద్యమాలను బలపర చాలి. వారి వెనక వివిధ ప్రజల బలాన్ని సమీకరించాలి.

# నాయుడుగూడెం భూస్వామి గారపాటి కనకయ్య దుండగాలు

## ప్రజా సేవకులపై బల్లెముల ప్రయోగం

ఏలూరు, అక్టోబరు 18

ఏలూరు తాలూకా నాయుడుగూడెం గ్రామంలో గారపాటి చిన కనకయ్య నిరంకుశత్వానికి, దౌర్జన్యానికి పేరు గాం చాడు. ఈయన క్రింద షుమారు 800 యక రములు భూమి వుండుటవల్ల, ధనికుడగుట వల్లను. గ్రామములోని దీన బిక్కలని పీడించుకుతింటూ, మిగిలిన రైతు లకు నీటి పంపకంలో అన్యాయం చేయడం పరిపాటి అయింది. ఈతని దుర్మార్గాలను కమ్యూనిస్టులు ఎదిరించడంవల్ల, తన పెత్త నం నిరాఘాటంగా సాగనందుకై కమ్యూ నిస్టులమీద దాడి సాగించాడు.


ఈ దినము (18-10-46) ఉదయం షుమారు 8 గంటలకు మాలపల్లెలో మాలలు తగవులాడుకున్నారు. అక్కడ దెబ్బలాట కూడా జరిగింది. గ్రామస్థులు, కమ్యూనిస్టులు కలసి సర్దారు. దెబ్బలు తగిలినవారిని పెద పాడు హాస్పిటలుకు గారపాటి రాజా రామ మోహనరావు, రామశాస్త్రి, కృష్ణమూర్తి మొదలయినవారు తీసుకవస్తున్నారు. దారిలో కనకయ్య, ఆయన తమ్ముడు పెద ఈశ్వరరావు చాలమంది రౌడీలను వెంటబెట్టుకువచ్చి వారిపై [illegible] కొట్టారు. కామ్రేడ్ రాజా రామమోహన రావును బల్లెముతో పొడిచారు. అంతట మిగి లినవారు ఆత్మరక్షణకై తిరుగబడ్డారు. కన కయ్యగారు ఆయన బృందమూ పిక్కబలము ప్రదర్శించారు. పారిపోయి మాలపల్లెలోని స్త్రీలను క్రూరంగా హింసించారు.

గారపాటి రాజా రామమోహనరావు గార్ని ఏలూరు జనరల్ హాస్పిటలులో చేర్చారు. చాలా ప్రమాదకరంగా వున్నది. మేజిస్ట్రేటు గారు మరణ వాఙ్మూలం తీసుకున్నారు కాని యింతవరకు ఈ దుర్మార్గానికి కారకులైన కనకయ్యగారినిగాని, వారిరౌడీలనుగాని అరెస్టు చేయలేదు. పైగా కమ్యూనిస్టులే కొట్టినా రంటూ కమ్యూనిస్టులపై కేసు బనాయించడా నికి కనకయ్యగారు ప్రయత్నిస్తున్నారు.



# సామ్రాజ్యవాదులకు సంస్థానాధిపతులకు విజయం

## కాంగ్రెసుతో రాజీపడకుండా లీగు ప్రభుత్వంలో చేరింది



జి. అధికారి

గడచిన వారాగువారాలుగా ఢిల్లీలో నడు స్తున్న సంప్రదింపులు, అనుకోనిరీతిగా ముగి శాయి. కాంగ్రెస్ లీగు రాజీ రాయబారాలు భగ్నమయ్యాయి. కేవలం వైస్రాయి, భోపాలు నవాబు జిన్నాకిచ్చిన వాగ్దానాల మీదనే, లీగు తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించాలని నిశ్చయించింది. ఇందువల్ల ఒక నూతన పరిస్థితి ఏర్పడుతున్నది.

ఈ పరిస్థితుల్లో, లీగు ప్రభుత్వంలో ప్రవే శించడంతో వైస్రాయికి, సంస్థానాధిపతులకు విజయం చేకూరింది. లీగు పూర్వం సహాయ నిరాకరణం చేయడంవల్ల బ్రిటిష్ ప్రణాళిక అమలు పరిచేందుకు ఆటంకం ఏర్పడింది. కాని, ఇప్పుడు బ్రిటిష్ ప్రణాళికను పూర్తిగా అమలు జరిపేందుకు వీలుఏర్పడింది.

### లీగుప్రవేశంలో అంతరార్థం

బ్రిటిష్ ప్రణాళిక రెండు భాగాలుగావుంది. తాత్కాలిక ప్రభుత్వంలోనికి ప్రజాసంస్థలను లాక్కొచ్చి, దేశఆర్థికదుస్థితిని వారిపై త్రోసి, ప్రజాపోరాటాలను అణచేందుకు ఆ ప్రభు త్వాన్ని సాధనంగా చేయాలన్నదే బ్రిటన్ ప్రణాళికలోని మొదటి భాగం. అంతేకాని ఆ ప్రభుత్వానికి, ప్రధాన విషయాల్లో పెద్ద మార్పులు తెచ్చేందుకు అధికారం ఇవ్వడం సామ్రాజ్యవాదుల ఉద్దేశంకాదు. నేటి కాంగ్రెస్ తాత్కాలిక ప్రభుత్వపరిస్థితి ఇప్పటికే ఈస్థితిలోఉంది. ఇప్పుడు, ముందుగా సామ్రాజ్యవాదుల ప్రణాళికను వ్యతిరేకించి, వైస్రాయి వీటోను త్రోసిపుచ్చేందుకు కాంగ్రెస్‌తో ఏ సమాధా నానికిరాకనే, లీగు ప్రభుత్వంలో అయిదు స్థానాలు స్వీకరించింది. కేవలం వైస్రాయి అగస్టు 24 చేసిన రేడియో ప్రసంగంలోని వాగ్దానాలమీదనే లీగు ఆధారపడింది.

వైస్రాయి ఇచ్చిన వాగ్దానాలివి. "ఏ ప్రధాన సమస్యపైగాని, అధికసంఖ్యాకపక్షం ఓట్లతోతెమ్మోడిస్తారని లీగు భయపడవలసిన అవసరంలేదు. రెండు ప్రధానపక్షాలు సంతృప్తి పడడమనే షరతుమీదనే సంయుక్తప్రభుత్వం నిలవగలదు. ముఖ్యమైన శాఖలు న్యాయంగా పంచేట్టు నేను జాగ్రత్త తీసుకుంటాను"

కాంగ్రెస్‌తో లీగు తగాదాపడినప్పుడల్లా సహజంగా వైస్రాయిదే పైచెయ్యి అవుతుంది. అప్పుడు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఇప్పటి కన్న మరింత అధికారవిహీనంగా చెయ్య వీలవుతుంది.

### వైస్రాయి చేతిలోనే అధికారమంతా

ముస్లింలీగు, సంస్థానాధిపతుల ప్రతినిధు లతో బ్రిటిష్ ప్రణాళిక రెండో భాగమైన రాజ్యాంగ నిర్మాణసభను కూడ నడపడాని కిప్పుడు సామ్రాజ్యవాదులకు వీలుకలిగింది. లీగు లేనిదే సంస్థానాధిపతులు రాజ్యాంగ సభలో పాల్గొనము అన్నారు. అందువల్ల బ్రిటిష్ ప్రణాళిక అమలుజరగడం కష్ట మయ్యేది. సామ్రాజ్యవాదులు, సంస్థానాధి పతులు ఇద్దరున్నూ లీగు రానిది రాజ్యాంగ సభను సమావేశపరచడానికి విముఖులే. కాంగ్రెస్ — లీగు తగాదాలే ఈ బ్రిటిష్ రాజ్యాంగసభలో ప్రధానాంశం. ఆ తగాదాయే సంస్థానాధిపతుల నిరంకుశపాలన, బ్రిటిష్ ఆధిపత్యం చిరస్థాయిగా దేశంలో నిలవడానికి అవకాశమిస్తుందని బ్రిటన్ ఆశ. అందుకనే లీగు తాత్కాలిక ప్రభుత్వంలో చేరడానికి నిశ్చయించిందనేటప్పటికి సామ్రాజ్యవాదులు సంతోషాన్ని వెలిబుచ్చారు.

లండన్ టైమ్సు ఇలా అంది: "లీగు ప్రతినిధులను పంపకపోతే, రాజ్యాంగ నిర్మాణసభ ప్రాతిపదికే తలక్రిందు అయ్యేది..........అలాంటిస్థితి ఏర్పడిఉంటే బ్రిటన్ చాల ఆలోచించవలసి వచ్చేది .... ముస్లిముల హక్కులను త్రోసిపుచ్చకుండా ఉండేందుకై, మన విధానాన్ని కొంత మార్చు కోవలసి వచ్చేది. మొదట మనం ఉద్దేశించి నట్టుగా బ్రిటిష్ ప్రణాళికను అమలు జరిపేం దుకు అదృష్టవశాత్తు ఇప్పుడు ఆటంకం తొలిగింది" (14-10)

కాంగ్రెసుకు లీగుకు సమాధానము కుదర కుండానే, లీగు తాత్కాలిక ప్రభుత్వంలోనికి, రాజ్యాంగ నిర్మాణసభలోనికి ప్రవేశించడ మంటే సామ్రాజ్యవాదుల ఎత్తులు ఫలించడ మన్నమాట. అప్పుడు బ్రిటిష్‌వారి ఉద్దేశ ప్రకారం హిందూ-ముస్లిం విభజన, సంస్థా నాధిపతుల నిరంకుశ రాజ్యం శాశ్వతంగా నిల్వడమన్నమాట.

### భోపాలునవాబు ఎత్తులు

సంస్థాన నిరంకుశప్రభువుల కావలి సిక్కు భోపాలునవాబు. లీగుకోర్కెలను కాంగ్రెస్‌తో ఒప్పించడానికి విపరీతంగా ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం విఫలమయ్యేటప్పటికి, బేషరతుగా ఒప్పుకొమ్మని జిన్నాను భోపాలునవాబు బలవంత పెట్టాడు. లీగునాయకులు, తమ నిరంకుశ పాలనను సంపూర్ణంగా బలపరచే రకమని సంస్థానాధి పతులకు స్పష్టంగా తెలుసు. ఏసంస్థానంలో గాని, ప్రజాస్వామ్య హక్కులకోసం, బాధ్య తాయుత ప్రభుత్వంకోసం లీగు ఏపోరా టాన్ని నడుపలేదు. అసలు వచ్చిన పోరా టాలను బలపర్చనూలేదు. సంస్థానాధిపతుల 'సర్వస్వతంత్రహక్కు'ను అంటే నిరంకుశ పాలన చిరకాలం కొనసాగింపే హక్కును, కొత్త సంస్కరణలద్వారా [illegible] మార కూడదని లీగు నాయకులు [illegible] చెబు తున్నారు.

లీగు దినపత్రిక 'డాన్' ఇలా వ్రాసింది.

"ఈ తాత్కాలిక దశ ముగిసిపోతూనే, సంస్థానాలు సర్వస్వతంత్ర రాజ్యాలౌతాయి. ఇప్పుడు బ్రిటిష్‌ప్రభుత్వానికున్న సార్వభౌ మాధికారాలు, భావిభారత ప్రభుత్వానికి అప్ప గించబడవు. ఈ సంగతిని బ్రిటిష్‌రాయ బారులు స్పష్టంగా నొక్కిచెప్పారు. ఈవిష యంలో కొందరు రాజ్యాంగ చట్టంలో పండి తులనుకొనేవారు ఎంత ప్రయత్నించినా, ఎన్ని వ్యాఖ్యానాలుచేసినా, పై బ్రిటిష్‌రాయ బారుల ప్రకటనే, సంస్థానాల భారతదేశానికి ప్రాతిపదిక కాగలదు." (6-10-46)

కాంగ్రెసు వారు కూడా సంస్థానాధి పతులతో రాజీ పడాలని కోరుతున్నప్పటికి, బ్రహ్మాండంగా విజృంభిస్తున్న సంస్థాన ప్రజా పోరాటాలను నైతికంగా కొంతకు కొంతైనా బలపరుస్తున్నారు. మరి లీగు నాయకులు మాత్రం సంస్థానాధిపతులకు సర్వస్వతంత్రాన్ని వాగ్దానం చేస్తున్నారు. తమ నిరంకుశతను నిల్పుకొనేందుకు చేసే ప్రయత్నంలో రాజ్యాంగ నిర్మాణసభలో కాంగ్రెసుకు పోటీగా లీగు సహాయం సంస్థానాధిపతులకు కావాలి.

ఇవన్నీ చూస్తే, లీగు ప్రభుత్వంలోకి రావడానికి భోపాలునవాబు తీవ్రప్రయత్నా లెందుకు చేశాడో బోధపడుతుంది. కాంగ్రెస్‌తో రాజీపడకుండానే లీగు రాజ్యాంగసభలోకి రావడం సంస్థానాధిపతులకు మరింత అను కూలం.

### సంస్థానాధిపతుల రక్షణచట్టం

ఈలోగా తమ నిరంకుశతను నిలబెట్టు కోవడంకోసం సంస్థానాధిపతులు తమ ప్రజ లతో పోరాడవలసి ఉంటుంది. తిరువాన్ కూరు, కాశ్మీరం, రాజపుటానా, ఒరిస్సా సంస్థానాల ఒక చేమిటి యావద్భారత సంస్థాన ప్రజాకోటి ఒక్కమాటు హుంకరించి నిలిచింది; మధ్యయుగపు పాలనల ప్రయో గాన్ని ఎదిరిస్తున్నది; ప్రజాసామ్య హక్కుల కోసం, బాధ్యతాయుత ప్రభుత్వం కోసం సంస్థాన ప్రజాపోరాటం సాగిస్తున్నది. ఇన్నాళ్ళనుండో, ఈ బ్రిటిష్ తొత్తుల రాక్షస పాలనకు గురియై బాధపడుతున్న సంస్థానాలలోని ప్రజాజీవులందరు, మిగతా భారతదేశ ప్రజల్లో విజృంభిస్తున్న చైతన్యాన్ని వారిఉద్య మాలనుచూచి ఉత్సాహవంతు లవుతున్నారు. పోరాటాల్లో అనుభవంగడించిన సోదర స్వతంత్రోద్యమాల సానుభూతిని వారపే క్షిస్తున్నారు. అదిన్యాయమే. అలాంటి సాను భూతి సహకారాలు, సంస్థాన ప్రజలకు వస్తున్నాయా?

ఒక చిన్నసంగతి చూదాం. సంస్థాన ప్రజల పోరాటాన్ని గూర్చి, ప్రజల కోరికలను గూర్చి ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా అధికారులు చేస్తున్న రాక్షస చట్టాన్నిగూర్చి మిగతాభారత ప్రజలకు తెలిసేటట్టు మన పత్రికలు ప్రచురిస్తున్నాయా?

చాల అభివృద్ధి చెందినవని చెప్పుకొనే సంస్థానాలలోకూడ, పత్రికలకు స్వతంత్రం లేదు. వేనకువేల నిర్బంధ చట్టాలకు లోనై ఆ పత్రికలు నడవాలి. అందువల్ల, తమ ప్రజాపోరాటాలనుగూర్చి సంస్థానాలలోని పత్రి కలు ప్రకటించలేకపోతున్నవి. అధికారుల జులుమును, పైశాచిక కృత్యాలను బయలు పెట్టలేకపోతున్నవి. కాబట్టి సంస్థాన ప్రజ లకు, మిగత భారతదేశంలోని జాతీయపత్రిక లన్నీ సాయం చెయ్యాలి. వెంట వెంటనే సంస్థానాల్లో జరిగే పోరాటాలకు తగిన ప్రచు రణ యివ్వాలి.

నిజానికి పూర్వం ఇలా జాతీయపత్రికలు సంస్థానాధిపతుల గుట్టు బయట పెడుతూ ఆందోళన చేయడం, సంస్థాన ప్రజాపోరా టాలకు అండగా పనిచేయడం, వారికి ఉత్సా హాన్ని కలిగించింది.

కాబట్టే సామ్రాజ్యవాదులు 'సంస్థానాధి పతుల రక్షణ చట్టం' తయారుచేశారు. దాని ద్వారా సంస్థానాలలోని చీకటికోనల్లో నడు స్తున్న పరిపాలకుల ఘోరదారుణ దురంతా లను బయటపెట్ట సాహసించిన పత్రికా సంపాదకులను శిక్షలపాలు చేసేందుకు వీలు కల్పించుకున్నారు.

అఖిలభారత పత్రికా సంపాదక మహాసభ అధ్యక్షుడు తుషారకాంతిఘోషు, ఈ సంస్థా నాధిపతుల రక్షణచట్టాన్ని వెంటనే తాత్కా లిక ప్రభుత్వం రద్దుచేయాలనిసర్దార్ పటేల్‌ను కోరారు. పత్రికల విధులనుగూర్చి నొక్కి నొక్కి చెబుతూ, హింసాకృత్యాలను రెచ్చ గొట్టే వ్రాతలు వ్రాయకూడదని, అదని, ఇదని ఎన్నో అంశాలు పటేల్ చెప్పాడు.

కాని సంస్థానాధిపతులు తమ ప్రజలను వేధిస్తూ చేసే కార్యాలను, ప్రపంచానికి తెలియకుండా సామ్రాజ్యవాదులు వేసిన ఈ తెరను, ఈ పాడుచట్టాన్ని రద్దుచేయాలన్న చిన్న ప్రజాస్వామ్యవాంఛకు సర్దార్ ఏమీ బదులు చెప్పలేదు.

ఈ చట్టాన్ని రద్దుచేసేందుకు తాత్కాలిక ప్రభుత్వానికి తగిన అధికారం బహుశా లేదేమో! ఇది వైస్రాయి ప్రత్యేకాధికారాలకు చెందినవిషయం కావచ్చు. లేక, యు. పి. లో గోవిందవల్లభపంతు కొత్తగా విధిస్తున్న నిర్బంధ చట్టాలలాగే, ఈ 'సంస్థానాధి పతుల రక్షణచట్టాన్ని' సర్దార్ పటేల్ తనకు రద్దుచేసే అధికారం ఉన్నప్పటికి అలాగే ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాడన్నా అందులో ఆశ్చర్యంలేదు.

దీనికి మూలకారణం, సంస్థానాలలో ఈ సమయంలో ప్రజాపోరాటాలు రావడం కాంగ్రెస్ నాయకత్వానికి ఇష్టంలేదు. చట్ట బద్ధమైన ఆందోళన, రాజీ రాయబారాలు మట్టుకే ఇప్పుడు చాలునని ఆనాయకుల అభిప్రాయం. తమమాట వినకుండా ఎక్కడయినా పోరాటాలు రానేవస్తే, "ఇదంతా ప్రజామండలులకు సంస్థానాధిపతులకు మధ్య విద్వేషాలు కల్గించేందుకు ఎవరో చేయటములు చేస్తున్నవని" అని దూషిస్తారు.

### బూటకపు సంస్కరణలు

కాంగ్రెసునాయకులవలంబిస్తున్న ఈ రాజీ పంథా, పోరాట వ్యతిరేక పంథాచూచే చాల మంది చిన్న సంస్థానాధిపతులు దసరా దర్బారుల్లో బూటకపు సంస్కరణలు ప్రకటించారు. మరొకప్రక్కన అమాయక ప్రజానీకాన్ని రక్తప్రవాహంలో ముంచెత్తు తున్నారు.

ఈ దసరా ప్రకటనలన్నింటిలోను ఉన్న దేమిటి? 'సంస్థాన పాలనలో ప్రజాప్రతి నిధులకు సంబంధం ఏర్పరచే, ఉద్దేశంతో మహారాజుకు సలహా యిచ్చేందుకు అధికార, అనధికార సభ్యులతో ఒక కమిటీని నియ మించడం'మట్టుకే ఏ దసరా ప్రకటన చూచినా మనకు కనిపిస్తుంది.

ఇదే సంస్థానాధిపతులు అల్వార్, భరత్ పూర్, బిలాస్‌పూర్ సంస్థాన ప్రజలను నానాహింసలకు గురిచేస్తున్నారు.

ఇలాంటి పరిస్థితే, పెద్ద సంస్థానాలలో కూడ కనిపిస్తుంది. ఎందుకైనా పెంచేయుని తిత్తులమారి తిరువాన్‌కూరు దివాను రామ స్వామి అయ్యర్, సంస్థాన ప్రజల పోరా టాన్ని కార్మికవర్గ శక్తిని అణచివేయాలని చూస్తున్నారు. ఏ ఉద్యమానికైనా తగిలించ డానికి వీలయ్యే ఆర్డినెన్సును తయారు చేశాడు. కేవలం కార్మికవర్గ కార్యకలా పాలనేకాక, ఏవిధమైనపౌరస్వహక్కులను కూడ లేకుండా చేశాడు. ఇలా చేసి రాజ కీయ జీవితాన్ని యావత్తు స్తంభింపజేయా లని అతని ఆశయం.

మరొకవైపు ఈ దివానే స్టేట్ కాంగ్రెస్ నాయకులలో కొందరితోరాజీకోసం ప్రయత్ని స్తున్నాడు.

ఇక హైదరాబాదులో — దివాన్ మీర్జా ఇస్మాయిల్ స్టేట్ కాంగ్రెస్‌తో రాయబారాలు

(మిగతా 2వ పేజీలో)

# లీగ్‌నాయకులు ఎవరికొరకు పాటుబడుతున్నారు?

## జమీందార్లకొరకా? రైతులకొరకా?

సజ్జద్ జహీర్

ముస్లింలీగ్ నాయకులు క్రిందటి ఎన్నికలలో ప్రచారం చేసినప్పుడు తాము ముసల్మాను ప్రజల స్వాతంత్ర్యంకొరకు, సుఖప్రదమైన జీవితంకొరకు పాటుపడతామని వాగ్దానాలు చేశారు. హిందువులు మహమ్మదీయుల్ని దోచుకు తింటున్నట్లూ, వారి బారినుండి మహమ్మదీయుల్ని రక్షిస్తామన్నట్లు వారు ప్రచారం చేశారు.

ఈ మధ్య లీగునాయకులు మరో అడుగు ముందుకుపోయి వేశారు. "ప్రత్యక్షపోరాటా"నికి తయారుగా ఉండవలసిందని మహమ్మదీయుల్ని హెచ్చరిస్తున్నారు. నిర్భర బాధతో కృంగి కృశించే ముస్లిం ప్రజానీకానికి తాము చెప్పే "పోరాటం" రక్షణ ఇస్తుందని, సుఖముగా జీవించడానికి అవకాశం కల్పిస్తుందని లీగ్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. వారి ఉపన్యాసాలు వింటే, నిజంగా వారు పీడిత ప్రజల రక్షకులుగా కనిపిస్తారు. కాని నిజం యేమో పరిశీలిద్దాం.

భారతదేశంలో నివసించే ముసల్మానులలో 100 కి 80 మంది పేద రైతులు, లేదా వ్యవసాయ కూలీలు. వీరిలో అధిక భాగం జమీందార్ల దోపిడికి గురిఅవుతూ పడరాని బాధలు పడుతున్నారు. వారివిషయంలో లీగ్‌నాయకులుఎట్టివిధాన మెలగుచున్నారో చూదాం.

యు. పి. లో కాంగ్రెసు మంత్రివర్గం 3 నెలల క్రితం ఒక బిల్లు ప్రవేశపెట్టింది. దానిఉద్దేశ్యం, జమీందార్లకు "న్యాయమైన" నష్టపరిహారమియిస్తూ, జమీందారీ విధానాన్ని నిర్మూలించేటందుకు కొన్ని చర్యలు ఇప్పటి నుంచీ తీసుకోవడం:

ఈబిల్లు ఎంత మితవాద ధోరణిలో తయారు చేయబడిందో తెలుసుకోడానికి, రివెన్యూమంత్రి కిద్వాయి, ప్రధాని పంత్, ఇచ్చిన ఉపన్యాసాలే చాలు. జమీందార్లను రక్షించడమే ఈబిల్లుయొక్క ఉద్దేశమనివారు స్పష్టంగాచెప్పారు. లేకపోతే రైతులే స్వయముగాజమీందార్లను నేలమట్టంచేస్తారన్నారు.

### హిందూ-ముస్లిం జమీందార్లు ఒకటయ్యారు!

కాని, యు. పి. జమీందార్లు ఈ బిల్లును ఒక్కుమ్మడిగా ఎదుర్కొన్నారు. మంత్రివర్గానికి ప్రతికూలపక్షంలో హిందూ జమీందార్లు, ముస్లిం జమీందార్లు ఒకటిగానిలబడ్డారు; ఆగ్రా, అయోధ్య, జమీందారులుఅంతర్యుద్ధం తీసుకొస్తామనిబెదరించుతూ తీర్మానాలుచేశారు.

యు. పి. అసెంబ్లీలో నవాబ్ మహమ్మద్ యూసఫ్ ప్రతిపక్షనాయకులలో ప్రధానుడు. ఇతడు రాష్ట్ర ముస్లింలీగ్ కార్యవర్గంలో ఒక ప్రముఖ సభ్యుడు; లీగ్ తరఫున ఎన్నుకోబడిన శాసనసభ్యుడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నమ్మినబంట్లలో యూసఫ్ ఒకడు. అనేకవిధాల వారికి యితడు సేవ చేశాడు.

ఈ యూసఫ్ 500 మంది యు. పి. జమీందార్ల సమావేశానికి అధ్యక్షత వహించాడు. వారిలో అధిక సంఖ్యాకులు హిందువులు. మంత్రివర్గం జమీందారీ బిల్లును ప్యాసుచేస్తే, "అంతర్యుద్ధం, రక్తపాతం" తెస్తామని బెదరిస్తూ, ఆ సమావేశంలో పలువురు ఉపన్యసించారు.

ఛత్తారీ నవాబు మరొక పెద్ద జమిందారు. ఇతడు ముస్లింలీగ్ ఆదేశానుసారం ఈ మధ్య బిరుదులను విసర్జించాడు. మంత్రివర్గంపై సాగించే "పోరాట" కార్యక్రమాన్ని నడపడం కోసం నియమించబడ్డవారిలో ఇతడుకూడా ఒకడు. మిగతా వారు, సర్ జగదీశ్‌ప్రసాద్, షేర్‌కోట రాజా. వీరిద్దరూ హిందూమహాసభ సభ్యులు, ఛత్తారీ నవాబు ముస్లింలీగు సభ్యుడు.

### గాంధీజీవద్దకు రాయబారం

అంతేకాదు. జమీందారీ విధానాన్ని రద్దు చేయకుండా చూడమని కోరేటందుకు గాంధీజీ వద్దకు కూడా యు. పి. జమీందార్లు రాయబారం నమ్పనున్నారు. ఛత్తారీ నవాబు రాయబార వర్గానికి నాయకత్వం వహిస్తాడు.

ఈవిధంగా, యు. పి. లో లీగు జమీందార్లు హిందూమహాసభ జమీందార్లతో పూర్తిగా కలిసిపోయి, రక్తపాతం తీసుకొస్తామని బెదరిస్తూనే, అసెంబ్లీలో తెలివితేటలతోగూడిన వాదనలు తీసుకొచ్చారు. ముస్లిం రైతాంగానికి జమీందార్లపట్ల ఎంత ద్వేషభావం ఉందో, ఎంత ఎక్కువగా వారు జమీందారీపద్ధతి రద్దుకావాలనికోరుతున్నారో, లీగునాయకులకుతెలుసు. అందుకే, చాలతెలివిగల విధానం అసెంబ్లీలో అవలంబించారు. జమీందారీ విధానం రద్దుకావలసిందే నన్నారు,కానిదానితోబాటుపరిశ్రమలపైవ్యక్తుల పెత్తనం, బ్యాంకింగు సంస్థలు, ఇన్సూరెన్సు కంపెనీలు—అన్నీ రద్దుకావలసిందే నన్నారు ఇవన్నీ రద్దుకావాలన్నారు. ఇవన్నీ జరగనిదే జమీందారీ విధానాన్ని నిర్మూలించడం హానికరమన్నారు.

### మాటలకు, చేతలకు తేడా

ఇవన్నీ నిజంగా ఉన్నతమైన ఆశయాలే. ఎవరూ కాదనరు. అయితే, ఈ పోషలిస్టు కార్యక్రమాన్ని లీగ్ నాయకులు ఇప్పుడే ఎందుకు సూచిస్తున్నారు? కాంగ్రెసు మంత్రివర్గం జమీందారీ విధానాన్ని రద్దుచేయాలనే బిల్లును ముందే వారెందుకు పై కార్యక్రమాన్ని తెలియజేయలేదు? బెంగాల్‌లోను, సింధు రాష్ట్రంలోనూ లీగు మంత్రివర్గాలు అధికారంలో ఉన్నాయి. ఎందుకు అవి యీ విప్లవకార్యక్రమాన్ని అమలుజరపలేదు?

కాబట్టి, లీగునాయకులు ఏదో ఒక కారణము చూపెట్టి, వివిధ రాష్ట్రాలలో జమీందారీవిధానం రద్దుగాకుండా చేయడానికి తీవ్ర ప్రతిఘటన చేస్తున్నారు. అయితే, ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క కారణం చూపెడుతున్నారు:

యు. పి. లో జమీందార్లకు, 'న్యాయమైన' నష్టపరిహారం యిచ్చి జమీందారీవిధానాన్ని నిర్మూలించేందుకు కూడా లీగునాయకులు తయారుగాలేరు. నిజం చెప్పవలసివస్తే, అది జమీందారీవిధానంయొక్క నిర్మూలన కానే కాదు. ఎందువల్లనంటే, కోట్లకొద్ది రూపాయలు నష్టపరిహారం రైతులవద్దే వసూలు చేయబడుతుంది.

బీహారులో లీగు ప్రతిపక్ష నాయకులు మరో కారణం చూపెట్టారు. ముస్లిం దేవాలయాలకుకూడా జమీందారీ బిల్లు వర్తింపచేయడం అన్యాయమన్నారు. అంటే, దేవునిపేర రైతుల రక్తం పిండి ధనాన్ని వసూలుచేయడం తప్పుకాదని వారి వాదన.

### భూస్వాములకు రక్షణ కావాలట

క్రిందటినెల బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గం కౌలు బిల్లు ఒకటి ప్రవేశపెట్టింది. దానిప్రకారం, ఏ భూస్వామి తన కౌలుదారు వద్ద పంటలోనాల్గవ వంతుకు మించి పుచ్చుకోకూడదు. ఈ బిల్లుపై సవరణలు తెస్తూ మాట్లాడిన ప్రతి లీగ్‌సభ్యుడు, భూస్వామికి ఇంకా ఎక్కువ మక్తారావాలని గట్టిగా వాదించాడు. లీగ్‌పార్టీ డిప్యూటీ లీడరు ఎ.ఎ.ఖాన్ ఇలామాట్లాడాడు:

"మేము ప్రతిపాదించిన సవరణలన్నీ, భూస్వాములకు అన్యాయం జరక్కుండా చూడడానికే. భూస్వాములుకూడా రైతుల మాదిరి మానవులే. వారికికూడా ప్రభుత్వం రక్షణ ఇవ్వాలి."

బొంబాయి లీగ్ నాయకులు భూస్వాముల తరఫున కోరే న్యాయం ఏమిటి? మక్తారేటు హెచ్చించమని.

### మద్రాసు రాష్ట్రంలో

ఇక మద్రాసు రాష్ట్రం విషయం. ఇక్కడ జమీందార్లు రైతుల భూమిని విపరీతంగా ఆక్రమించుకొంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, ఒక్క మలబార్ జిల్లాలో ఇలాంటివి 5000 దావాలు విచారణలో ఉన్నాయి. రైతులలో అసంతృప్తి తీవ్రంగా వ్యాపించడంవల్ల, వాటిపై డిక్రీలు అమలు జరుపకూడదని ప్రభుత్వం తాత్కాలికంగా ఉత్తరువులు జారీ చేసింది. శాశ్వతమైన ఒక బిల్లును ప్రవేశపెడతామని తెలియజేసింది.

ఈరాష్ట్రంలోకూడా, లీగ్‌నాయకులుజమీందార్లపక్షం వహించి మాట్లాడుతున్నారు. రైతులపక్షం వహించడంలేదు. బి. పోకర్ ఇలా మాట్లాడాడు.

"ప్రభుత్వం రైతుల్ని రక్షించవలసిందే. కాని, జమీందార్లను కూడా రక్షించాలి. మలబార్ జమీందార్లపై జారీచేసిన స్టే ఆర్డర్లు దీర్ఘకాలం అమలులో ఉండకుండా చూడమని కోరుతున్నాను."

మరొకసారి, కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు జమీందారీ విధానాన్ని నిర్మూలించడం అవసరమనీ, ఏబదిగింజలకు 100 యకరాలకంటె ఎక్కువభూమి ఇవ్వకూడదనీ, ఒక కొత్త ప్రతిపాదన తీసుకొచ్చినప్పుడు, అసెంబ్లీ లీగ్ పార్టీనాయకుడు హమీద్ ఖాన్, దీన్ని వ్యతిరేకించాడు. జమీందారీ విధానాన్ని పూర్తిగా నిర్మూలించడంకంటె జమీందార్లవద్ద వసూలుఅయ్యే పేష్కస్సును హెచ్చించవలసిందని కోరాడు.

ఈవిధంగా, లీగ్ నాయకులు యు. పి. బీహార్, బొంబాయి, మద్రాసు రాష్ట్రాలలో అభివృద్ధి విరోధకులైన జమీందారీ వర్గాన్ని బలపరుస్తూ ఉపన్యాసాలిచ్చారు. రైతాంగానికి పిసమెత్తు రక్షణకూడా ఇవ్వరాదనే ధోరణిలో వాదిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో జమీందారీ రైతులకు సహాయంచేయాలంటే, కాంగ్రెసుమంత్రులు తీసుకొచ్చే బిల్లులు ఎంతమాత్రమునరిపోవు. కాని, ఆమాత్రమైనా సహాయం చేయడానికి లీగ్ నాయకులు వ్యతిరేకంగావున్నారు. యు. పి. లో మాదిరిగా. వారు తీవ్రవచనాలంతో తమ నిజస్వరూపాన్ని కప్పిపెట్టుకొంటున్నారు. కాని, ఆచరణలో, స్పష్టంగా, అనుమానాలకు తావులేకుండా, జమీందార్ల పక్షం అవలంబిస్తున్నారు. రైతుల పక్షం అవలంబించడంలేదు.

— పీపుల్స్‌ఏజ్‌నుంచి.

## తాత్కాలిక ప్రభుత్వంలో లీగ్ ప్రవేశం

'పీపుల్స్ ఏజ్' సంపాదకీయం

ముస్లింలీగ్ తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశించింది. ఇది వ్రాసే సమయానికి, రేడియో ద్వారా వచ్చిన వార్తలో ఇంతకంటె వివరం ఏమీలేదు.

మతకలహాలు ఇక ఉండవుగదా — అనే భావం జనసామాన్యంలో కనిపిస్తోంది. కాని, అలా అనుకోవడం భ్రమతప్ప మరొకటి కాదు. (నౌఖలీజిల్లాలో హత్యాకాండ ఒక ఉదాహరణ. ప్ర. శ. సం.) తాత్కాలికంగా మతకలహాలు ఆగిపోవచ్చు. కాని,మతవైషమ్యాలు మాత్రం ఆగిపోవు. మన నిత్యరాజకీయాలలో మతవైషమ్యాలు శాశ్వతంగా నిలిచిపోయే సూచనలే కనబడుతున్నాయి. మత కలహాలు యికనుంచి వీధుల్లోను, రోడ్లమీద కంటే రాజ్యాంగసభలోనే ఎక్కువ ప్రారంభమవుతాయి.

ముస్లింలీగ్ తాత్కాలిక ప్రభుత్వంలో చేరడంవల్ల, ఇంతకన్న జరిగేది ఏదీలేదు.

అంతేకాదు.ఏపరిస్థితుల్లోతాత్కాలికప్రభుత్వం సంయుక్త ప్రభుత్వంగా మారిందో గమనిస్తే మతవైషమ్యాలుఅంతరించేసూచనకనపడదు.

వైస్రాయి ఇచ్చిన హామీలమీద ఆధారపడి ముస్లింలీగ్ తాత్కాలిక ప్రభుత్వంలో ప్రవేశిస్తోంది. అందువల్ల, వైస్రాయి నియంతృత్వాన్ని పడగొట్టడానికి ఏర్పడ్డ సంయుక్త ప్రభుత్వంకాదు ఇది. వైస్రాయి మధ్యవర్తిత్వం ద్వారా నడచే సంయుక్త ప్రభుత్వం. వారం రోజుల్లో ప్రభుత్వ శాఖల విభజనపై, ఈ మధ్యవర్తిత్వం ప్రారంభమవుతుంది.

కాంగ్రెసు నాయకులు, లీగు నాయకులు తమలో తమకుగల అభిప్రాయ భేదాలను పరిష్కరించుకోలేక, తమ దివాళాకోరుతనాన్ని బయటపెట్టుకున్నారు. దేశంలో నేడు నలుమూలల మతకలహాలు, హత్యలు జరుగుతున్నాయంటే, వారి దివాళాకోరుతనం యొక్క పరిణామమే అవన్నీ. వారవారం లిస్తున్న విధానం మాటిమాటికి వైస్రాయి మధ్యవర్తిత్వంమీద ఆధారపడేటట్లు చేస్తోంది.

భారతీయుల్లో అత్యధిక సంఖ్యాక ప్రజలు కాంగ్రెసుపట్ల, ముస్లింలీగ్‌పట్ల విశ్వాసం ప్రకటిస్తున్నారు.

వారు ఇకమీదట ఎంతధైర్యంగాను, ఎంత ఎడతెగకుండాను, సంయుక్త ప్రభుత్వం మీద ఒత్తిడి తేగలుగుతారో, అంతత్వరగా పరిస్థితులు చక్కబడతాయి. ప్రజలందరి సమస్యల పరిష్కారంకోసం, ప్రజలందరికీ శత్రువైన సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించేటందుకు, ప్రజాసామాన్యం బ్రహ్మాండమైన ఆందోళన చేయవలసియుంది. తమ తమ నాయకులు అవలంబించే తప్పుడుమార్గం ఎలా అనర్థదాయకమో గొంతెత్తి చెప్పవలసియుంది.

స్వాతంత్ర్యంకోరే హిందువులు, ముస్లిములు ఇండియానుంచి బ్రిటిష్ సేనలనురక్షించంపివేయాలని ఎంతతీవ్రంగా ఆందోళన చేస్తే, అంత త్వరగా వైస్రాయికిగల వీటో అధికారం పోవలసిందేనని తిన్నగా గుర్తిస్తారు.

మన సైన్యంలో అంతా (ఆఫీసర్లతోసహా) భారతీయులుగానే వుండాలని హిందూ సైనికులు, సిక్కు సైనికులు, ముస్లిం సైనికులు కలిసి ఎంత ఒత్తిడిచేస్తే, అంత త్వరగా బలదేవ్‌సింగ్ (రక్షణశాఖసభ్యుడు)ఇండియా సర్వసేనానిని బహిరంగంగా స్తుతించడం మానుకుంటాడు.

ఆహారం కొరకు అలమటించే హిందూ ప్రజాసామాన్యం, ముస్లిం ప్రజాసామాన్యం దొంగ వ్యాపారస్తుల మీద ఎంత తీవ్రంగా దాడిచేస్తే, అంత త్వరగా రాజేంద్రబాబు రేడియో ఉపన్యాసాలలో ఆహార సమస్యపై ధర్మోపన్యాసాలు చెప్పడం మానుతాడు.

ప్రజల అవసరాలను తీర్చండి; ప్రజల్లో ఉత్తేజం కలిగించే రాజకీయాలను చేపట్టండి — అనే నినాదంతో కాంగ్రెసువాదులు, లీగ్ సభ్యులు సంయుక్త ప్రభుత్వంమీద ఒత్తిడి తేవలసివుందని కోరుతున్నాం.



# ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి కొత్తప్రమాదం

## బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని నైజాంనిరంకుశత్వాన్నీ ఎదుర్కోవాలి

— పుచ్చలపల్లి సుందరయ్య

బ్రిటిషు ప్రభుత్వం భారత దేశానికి స్వాతంత్ర్య మిస్తున్నానని, ఆరు నెలల క్రితం ఒక బూటక ప్రకటన చేసింది. భారతదేశ ప్రజలు తమ కిష్టంవచ్చిన రాజ్యాంగాన్ని నిర్ణయించుకో వచ్చునని, ఒక రాజ్యాంగ నిర్మాణసభను కూడ ఏర్పాటుచేసింది. ఆ రాజ్యాంగ నిర్మాణ సభకు వివిధరాష్ట్రాల శాసనసభలు ప్రతినిధులను కూడ ఎన్నుకున్నాయి. కాంగ్రెసు నాయకులతో కూడిన ఒక తాత్కాలిక ప్రభుత్వంకూడ ఏర్పడింది. నేడు ఆ తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింలీగు ప్రతినిధులుకూడ చేరారు. కాని ఇది స్వాతంత్ర్యం కాదు. బ్రిటిషు ప్రభుత్వం మనలను బానిసలగా ఉంచడానికిఆడే ఒక క్రొత్తనాటకంమాత్రమే.

బ్రిటిషు వైస్రాయి, గవర్నరులవీటో అధికారం అలాగే ఉంది. బ్రిటిషుసైన్యం మనదేశంలో ఇంకాఉంది. ఆసైన్యంపై అధికారం ఇంగ్లీషు ఆఫీసర్ల చేతిలోనే ఉంది. కడకు పెద్దపోలీసు ఉద్యోగస్తులనుచూచినా ఎక్కువమంది ఇంగ్లీషు వారే. మనసైన్యాలు, ఇండోనీషియా, మలయా,బర్మా, ఇరాన్, పాలస్తీనాలలో అచ్చటి ప్రజల స్వాతంత్ర్యపోరాటాలను అణచడానికి బ్రిటిషుప్రభుత్వం ఉపయోగిస్తూనే ఉంది. ఇట్టిపరిస్థితులలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం స్వతంత్ర ప్రభుత్వంగా వ్యవహరించలేదనే విషయాన్ని అందరు అంగీకరించకతప్పదు.

### ఇంగ్లీషువాడి షరతులను అంగీకరిస్తేనే రాజ్యాధికారమట

రాజ్యాంగ నిర్మాణసభ తయారుచేసిన రాజ్యాంగాన్ని కూడ రెండు షరతులకు భారతదేశ తాత్కాలిక ప్రభుత్వం అంగీకరిస్తేనే అమలులోకి తెస్తారట: మొదటిది:- మైనారిటీల హక్కులను రక్షించడానికి తగిన ఏర్పాటులు చేయబడినవని తమకు సంతృప్తికరంగా రాజ్యాంగం ఏర్పాటుచేయాలట. మైనారిటీలపేరుతో తమఇంగ్లీషు వర్తకులు, పెట్టుబడిదారులు మనభారతప్రజలను దోచుకోడానికి కావలసిన సదుపాయాలు, ఆర్థిక ఒడంబడికలు కుదుర్చుకోవాలని చూస్తున్నారు.

రెండవ షరతు: భారత దేశానికి, ఇంగ్లండుల మధ్య పరస్పర ఒడంబడిక కుదరాలట! ఆ ఒడంబడికలో, ఇంగ్లీషు సైన్యాలను మన దేశంలో ఉంచాలని కోరుతారు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదులతో సైనిక ఒడంబడిక చేసుకోవాలని పట్టు పట్టుతారు.

### ఇంగ్లీషు తాబేదారులైన, రాజాలు నవాబులు సర్వస్వతంత్రులుగా ఉంటారట

మన దేశాన్ని 200 సంవత్సరాల క్రితం ఇంగ్లీషు పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు అమ్మినది మన దేశంలోని నవాబులు, రాజులు, మహారాజులే. వీరే ఇంతకాలం బ్రిటిషు ప్రభుత్వానికి అండగానిలబడి మనస్వాతంత్ర్య ఉద్యమాలను అణచివేస్తూవచ్చారు.

నైజాం నవాబు మన తెలుగుదేశాన్ని సగభాగం ఇంగ్లీషుప్రభుత్వానికిచ్చాడు. మిగిలిన దేశంపై ప్రజలను దోచుకోడానికి, ఇంగ్లీషుసేనల సాయం తీసుకొన్నాడు. నైజాం ఇంగ్లీషు ప్రభుత్వం ఒకరికొకరు తోడ్పాటు చేసుకుంటూ తమ నిరంకుశదోపిడిని సాగిస్తు ఉన్నారు. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్యయుద్ధంలో నైజాం నవాబు సైన్యాలు ఇంగ్లీషు ప్రభుత్వంవైపు నిలబడి మన ప్రజల తిరుగుబాటును అణచివేశాయి. నేటికీ. నైజాం నిరంకుశ నవాబు, అతని పోలీసు ఉద్యోగస్థులు ప్రజలపై విచ్చలవిడిగా దౌర్జన్యాలు, దోపిడీలుసాగిస్తున్నారు.ఆకునూరు,మాచిరెడ్డిపల్లిలో స్త్రీలకు మానభంగంచేశారు. దేశముఖుల, జాగీర్దారుల తరపున పోలీసులను పంపి కొమరయ్యలాంటి ప్రజా సేవకులను తుపాకిగుండ్లకు గురిచేసి ప్రాణాలు తీశారు. 300 మంది ఆంధ్ర ప్రజా సేవకులమీద, తెలంగాణం మీద తప్పుడుకేసులు నడుపుతున్నారు. తెలుగు బిడ్డలకు తెలుగుభాష నేర్పరు. మొదటి తరగతినుండీ ఉర్దూలోనే చదువు!

ఈ సంస్థానాధీశులమీద తాత్కాలిక ప్రభుత్వానికి అధికారమేమీ ఉండదు. ఇట్టి దారుణాలనుకూడ ఆపడానికి అధికారముండదు. ఈ నవాబులు, రాజులు తమ కిష్టం వచ్చినవారిని రాజ్యాంగ నిర్మాణసభకు తమ ప్రతినిధులుగా పంపుకోవచ్చు! సంస్థానప్రజల కెట్టిహక్కులు లేవు. రాజులు, నవాబులు పెట్టిన షరతులకు అంగీకరిస్తేనే, వారు రాజ్యాంగ నిర్మాణసభకు వస్తారట! లేకపోతే సర్వస్వతంత్రులుగా వ్యవహరించడానికి హక్కు ఉందట! వారు సరాసరి ఇంగ్లీషు ప్రభుత్వంతో ఒడంబడికలు చేసుకుంటారట!

నైజాంలో లక్షసైన్యాన్ని ఇంగ్లీషు ప్రభుత్వం తరిఫీదు చేస్తూవుంది. 20 వేలమరలఫిరంగుదళాన్ని తయారుచేస్తూ ఉంది. దీనికి కావలసిన యుద్ధయంత్రాగారాలను ఏర్పాటు చేస్తూఉంది. బస్తరులోని ఇనుము, బొగ్గు తదితరఖనిజాలను నైజాం కిచ్చివేసింది. విశాఖరేవు పట్టణానికినై జాంనుండి సరాసరి రైలుమార్గాన్ని వేస్తూఉంది. తూర్పుకోస్తాలో, బందరు, కాకినాడ విశాఖ పట్టణాలలో ఏదోఒకటి నైజాం కోరుతున్నాడని, పడమటి కోస్తాలో, మార్మగోవాను కోరుతున్నాడని వార్తలు వస్తూనే ఉన్నాయి. ఒకరేవు పట్టణం కూడ నైజాంకు ఇచ్చి "సర్వస్వతంత్రుడైన" నైజాంద్వారా, ఆంధ్ర కన్నడ,మహారాష్ట్ర ప్రజలపైన మనభారతదేశప్రజలపైనా తనఅధికారం చెలాయించాలని ఇంగ్లీషు ప్రభుత్వం చూస్తూవుంది.

అదేరీతిగా ఇతర రాజులను నవాబులను తన పెత్తనం సాగించడానికి సాధనాలుగా ఇంగ్లీషుప్రభుత్వం ఉపయోగిస్తూ ఉంది. అందుచేతనే కాశ్మీరు, హైద్రాబాదు, తిరువాంకూరు, ఇంకా అనేక సంస్థానాలలో చెలరేగుతూఉన్న ప్రజా ఉద్యమాలను క్రూరంగా అణచివేయుడానికి తీవ్ర నిర్బంధ విధానాన్ని అవలంబిస్తూ ఉంది.

### సామ్రాజ్యవాదులు-మన ప్రజలలో చీలికలు కల్గించే కలగూరగంప రాష్ట్రాలను ఏర్పాటు చేశారు

సామ్రాజ్యవాదులు, మన ప్రజలను విడదీసి, ఒకరిపై నొకరికి ద్వేషాలు రెచ్చగొట్టి, తమ పెత్తనాన్ని, దోపిడిని నిరాటంకంగాసాగించుకోవడానికి, ఒకే భాష మాట్లాడే ప్రజలను కొంతమందిని స్వదేశ సంస్థానాధీశుల క్రింద పెట్టారు. మిగిలినవారిని సైతం భాషా ప్రయుక్త రాష్ట్రాలుగ విభజించలేదు.వివిధ భాషలు మాట్లాడే ప్రజలతో కూడిన రాష్ట్రములేర్పాటు చేశారు. పరిపాలన, విద్య పరాయి భాషయైన ఇంగ్లీషులో సాగిస్తూ వచ్చారు. ఒకే భాష మాట్లాడే వారిని ఒకే రాష్ట్రంలో ఉంచితే వారికి మాతృభాషలోనే చదువులు చెప్పితే, త్వరలో స్వాతంత్ర్య కాంక్ష పెరుగుతుంది. జాతీయాభిమానం, చైతన్యం కల్గుతుంది. ఇంగ్లీషువారి పాలనకు త్వరలోనే ముప్పు వచ్చేది. ఈ భయంతోనే కలగూరగంపగా కృత్రిమరాష్ట్రాలను ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు ఏర్పాటుచేశారు.

మద్రాసులో రెండు కోట్ల మంది తమిళులు. రెండు కోట్ల మంది ఆంధ్రులు, దక్షిణ కనడా, బళ్ళారి జిల్లాలలోని కర్నాటకులు, మలబారులోని మళయాళప్రజలు కలిసి ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేశారు.

### ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యను ఆంధ్ర-తమిళ తగాదాగా మార్చారు

1913 నుండి ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రం ఉండాలని మన మేధావులు, జాతీయచైతన్యం అభివృద్ధి చెందేకొద్ది ఆందోళనసాగిస్తూ వచ్చారు. బ్రిటిషు సామ్రాజ్యవాదుల పాలనక్రింద మద్రాసు కలగూరగంప రాష్ట్రం. అన్నిప్రాంతాలలోను పరిశ్రమలు, వ్యవసాయం విద్య ఒకే రీతిగ అభివృద్ధి చెందలేదు. ఈ హెచ్చుతక్కువలు చూచి తమిళులకే ఎక్కువ పరిశ్రమలున్నాయి, తమిళులకే ఎక్కువ ఆనకట్టలున్నాయి, తమిళులకేఎక్కువ విద్యాలయాలున్నాయి, తమిళులకే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలిస్తున్నారు, తమిళులకే ఆంధ్రదేశంలోని కంపెనీలలోకూడ ఎక్కువ స్థానముంది, ప్రత్యేకరాష్ట్రం సంపాదించి ఈతమిళ ప్రాబల్యంపోగొట్టుకోవాలనే ధోరణి ఆంధ్రోద్యమనాయకులలో హెచ్చింది. ప్రతి చిన్న సమస్యలో కూడ తమిళులకు ఆంధ్రులకన్న ఎక్కువసౌకర్యాలను కలుగజేస్తున్నారని ఆవేశాలు కల్గుతున్నాయి. బ్రిటిషు సామ్రాజ్య వాదులు, ఇట్టి ద్వేషాలను రెచ్చగొట్టడానికే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం లేకుండాచేశారు. తమిళనాడుతో కలిసిమద్రాసురాష్ట్రాన్ని ఏర్పరచారు.వారు వేసినఎత్తులు జయప్రదమవుతున్నాయి.

తమిళనాడులో మనకన్న కొంత ఎక్కువ పరిశ్రమాభివృద్ధి, విద్యాభివృద్ధి ఉంది. కాని ఇంగ్లీషు ప్రభుత్వ పెత్తనం పడగొట్టినంత కాలం, ప్రస్తుత ఆర్థిక విధానాన్ని పూర్తిగ మార్పు చేయనంత కాలం, తమిళ ప్రజకు కూడ కావలసినన్ని పరిశ్రమలు, విద్యాలయాలు రావు. తమిళ ప్రజలందరికీ ఉద్యోగాలుకావి, పనులుగాని దొరకవు.

ఆంధ్రదేశంలో పరిశ్రమలు, విద్య అభివృద్ధి చెందకపోవడానికి కారణం బ్రిటిషు పెత్తనమూ, నైజాం నవాబు మనదేశంలో సగభాగంపై అధికారం చెలాయించడమే. ఈ సత్యాన్ని మనం మరచిపోకూడదు. తమిళనాడులోని పెట్టుబడిదారులు కొందరూ, పెద్ద ప్రభుత్వ ఉద్యోగస్థులు కొంతమంది, ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఇదివరకు వ్యతిరేకించారు. దీనిని తమిళ ప్రజలకు అంటగట్టి ఆంధ్రరాష్ట్రానికి తమిళులంతా వ్యతిరేకమని, ఆంధ్రతమిళతగాయిదాగామార్చడం ఇంగ్లీషువారి కుట్రను, మరచిపోవడమవుతుంది.

మన రాష్ట్ర నిర్మాణానికి మొదటి నుండీ వ్యతిరేకిస్తూ వచ్చింది బ్రిటిషు ప్రభుత్వం, దాని తాబేదారులు మాత్రమే.

ఒరిస్సా, సింధు రాష్ట్రాలను 1935లో విడదీసినప్పుడు అవివెనుకబడిఉన్నాయి. జమీందారుల ప్రాబల్యాన ఉన్నాయి. రాజకీయంగా అభివృద్ధిచెందిన బెంగాలు బీహారు బొంబాయి రాష్ట్రాలనుండి విడదీసి, తమ చేతులలో కీలుబొమ్మగా పెట్టుకోవచ్చునని సామ్రాజ్యవాదులు ఆశించారు. ఆంధ్రులు 1920, 1930 సత్యాగ్రహ ఉద్యమాలలో ముందంజ వేశారు. వారికి ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తమకు ప్రమాదమని ఆంధ్రరాష్ట్రాన్ని వెనక్కి నెట్టారు.

1938 లో మద్రాసు శాసన సభ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలని తీర్మానం చేస్తే, దానివలన రక్తపాతం కల్గుతుందని ఆరోజుల లోని ఇంగ్లీషు గవర్నరు ఎర్స్కిన్ ఇండియా మంత్రికి వ్రాశాడు. ఇండియా మంత్రి రాష్ట్ర తీర్మానాన్ని బుట్టదాఖలు చేశాడు.

(మిగతా 6 వ పేజీలో)

5 వ పేజీ తరువాయి

ఇంగ్లీషు వారి క్రొత్త రాజ్యాంగ ప్రణాళికలో స్వాతంత్ర్యమూ లేదు, స్వదేశ సంస్థానాధీశుల పెత్తనం పోయే మార్గమూ లేదు, భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణము కూడ లేదు. మన దేశాన్ని ఎ బి సి. గ్రూపులుగా విభజించడంలోనే వారికుటిలనీతి బయల్పడుతూంది.

బి. గ్రూపులో ప్రస్తుతపు పంజాబు, సరిహద్దురాష్ట్రం, బెలూచిస్థాన్, సింధు ఉంటాయి అని నిర్ణయించారు. దీనిలో హిందీ భాషను మాట్లాడే అంబాలా ప్రజలను శాశ్వతంగా తమ 'ఎ గ్రూపులోని' జాతి నుండి విడదీశారు. అంతేగాక వివిధ భాషలు మాట్లాడుతూ, వివిధ విజ్ఞాన సంస్కృతులతో అభివృద్ధి చెందుతున్న ఈవివిధ రాష్ట్రాలు తమరాష్ట్ర రాజ్యాంగాన్ని, తమకూ, కేంద్రానికీ గల సంబంధాన్ని, తాము నిర్ణయించుకునే హక్కులేదట! గ్రూపు మెజారిటీ నిర్ణయాన్ననుసరించి పోవాలట! దానితో రాష్ట్ర స్వపరిపాలన, భాషా ప్రయుక్త రాష్ట్ర స్వరూపం మటుమాయం చేస్తున్నారు.

అదేరీతిగా, సి. గ్రూపులో బెంగాలు అస్సాములు కలిసి ఉండాలని ఇంగ్లీషు ప్రభుత్వం నిర్ణయించింది. బీహారులోని బెంగాలు ప్రజలను 'ఎ' గ్రూపులోపెట్టి శాశ్వతంగా, సి. గ్రూపులోనున్న తమ బెంగాలీ జాతినుండి విడదీసింది.

భారత దేశంలోని వివిధ భాషలు, వివిధ విజ్ఞాన సంస్కృతులుగల వివిధ జాతులను ఈరీతిగా ఎ. బి. సి. గ్రూపులలోను వివిధసంస్థానాధీశులక్రిందం విభజించివేస్తే, వారిలోవారు కీచులాడుకుంటూ ఉండి పోతారు; తాముతెరవెనకాల నుండి పెత్తనం సాగించవచ్చునని బ్రిటిషు ప్రభుత్వం ఈ బానిస రాజ్యాంగ ప్రణాళిక కుట్రను తయారుచేసింది.

రాజ్యాంగ నిర్మాణసభకు సర్వస్వాతంత్ర్యాలుంటాయి అని ఇంగ్లీషు ప్రభుత్వం ప్రకటిస్తూవచ్చింది. సర్వస్వతంత్రాలు లేకపోయినా కడకు 'ఎ' గ్రూపులో ప్రాబల్యం వహించే కాంగ్రెసు, బి. సి. గ్రూపులలో మెజారిటీగ ఉన్న లీగు కలిసితే, భాషాప్రయుక్త రాష్ట్ర విభజనకైనా చేసుకోవచ్చునని చాలమంది ఊహించారు ఎ. బి. సి. గ్రూపుల మధ్య ఒడంబడిక కుదరక పోయినా, 'ఎ' గ్రూపులో కాంగ్రెసు ప్రాబల్యముంది కాబట్టి, 'ఎ' గ్రూపులోని ప్రస్తుతమున్న కలగూరగంప రాష్ట్రాలను తీసివేసి భాషాప్రయుక్త రాష్ట్రాలుగ విభజించు కోడానికి ఎట్టి ఆటంకమూ ఉండదని అనుకొన్నారు. ఆంధ్ర, తమిళ, మళయాళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాతు రాష్ట్రాలు, హిందీ ప్రాంతాలలో కోసల, బీహారు, ఢిల్లీ, సంయుక్తరాష్ట్రాలు, ఏర్పడుకోవచ్చునని ఊహించారు.

బి. యస్. రావు వితండవాదన

కాని బ్రిటిషుప్రభుత్వ "సర్" బిరుదాంకితుడు, రాజ్యాంగ నిర్మాణసభకు న్యాయశాఖ సలహాదారుడయిన బి.ఎన్. రావు భాషాప్రయుక్తరాష్ట్రాలను ఏర్పాటు చేయడానికి రాజ్యాంగ నిర్మాణ సభకు హక్కులేదని, ప్రస్తుతమున్న రాష్ట్రాలే

# బ్రిటీషుకుట్రకు బి. యస్. రావు తాళం

## ఆంధ్ర ప్రజల కర్తవ్యం

క్రొత్తరాజ్యాంగం అమలులోకి వచ్చే వరకు ఉండాలంటూ వ్యాఖ్యానంచేశాడు. అలా ఒక నివేదికను తయారుచేసి రాజ్యాంగపరిషత్తు సభ్యులకూ, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపినాడని కొన్ని వివరాలను ఆంధ్రపత్రిక అక్టోబరు 8 వ తేదీన ప్రకటించింది. దానిలో ఈ క్రింది రీతిగా ఉంది.

" నూతన రాష్ట్రముల నిర్మాణం మే 16 న బ్రిటిషు మంత్రుల ప్రకటనకు విరుద్ధమని మొదటనే వాదించ వచ్చును. ఎందువల్లనంటే, 19 వ పేరాలో 5, 8 సబ్ క్లాజు బి.లో క్రొత్త రాజ్యాంగంలో మొదటి ఎన్నిక అయినతర్వాత గ్రూపుల నుండి విడిపోవడానికి ఒక రాష్ట్ర శాసనసభ తీర్మానంచేసి విడిపోవచ్చునని ఉంది. అందుచేత కొత్త రాజ్యాంగం క్రింద మొదటి యెన్నికలయ్యేవరకు యిప్పుడున్న ఈ సమిష్టి రాష్ట్రములుండాలి అని అర్థం చెప్పవచ్చును. లేకపోతే, కొత్త శాసనసభ ఆ రాష్ట్రానిది కాక విడిపోవుట కిచ్చిన హక్కు వ్యర్థమయిపోతుంది. కాబట్టి ఇప్పుడున్న రాష్ట్ర సరిహద్దులు కొత్త రాజ్యాంగం వచ్చే వరకు చెదరకూడదన వచ్చును"

సామ్రాజ్యవాదుల ఎత్తు దీనిలో స్పష్టంగా బయట బడుతూఉంది. పాత రాష్ట్రాలను ఇప్పటిలాగే ఉంచి, గ్రూపులనుండి విడి పోవడమా లేదా అనే సమస్యపై ప్రజలలో చీలికలు కల్గించాలని వారు పాచికలు వేస్తున్నారు.

ఉదాహరణకు అస్సాం తీసుకోండి. అస్సాంలో సిల్హెటు, కచార్, జిల్లాలు బెంగాలీ జిల్లాలు. ప్రజలు అత్యధిక సంఖ్యాకులు బెంగాలీ భాష మాట్లాడుతారు. ఈ ప్రాంతాలన్నీ న్యాయంగా బెంగాలు రాష్ట్రంలో ఉండవలసినవి. సి. గ్రూపులో భాషను బట్టి రాష్ట్ర విభజన జరుగకపోతే, క్రొత్తగా ఏర్పడిన అస్సాం శాసనసభలో బెంగాలుతో కలిసి ఉండాలని, బెంగాలీ ప్రజలు వాదిస్తుంటారు. చేరకూడదని అస్సామీ ప్రజలు వాదిస్తారు. మెజారిటీతో బెంగాలుతో చేరాలని నిర్ణయిస్తే, వేరుగా ఉండాలనుకుంటున్న అస్సామీ ప్రజలకన్యాయం జరుగుతుంది. వారెప్పుడూ ఆనిర్ణయాన్ని వ్యతిరేకిస్తూనే వుంటారు. మెజారిటీ ఓటు బెంగాలుతో చేరకూడదని నిర్ణయిస్తే, అస్సాంలోని బెంగాలీ ప్రజలు వ్యతిరేకిస్తూ ఉంటారు. ఈ రీతిగా అస్సాం, బెంగాలీ ప్రజల ఘర్షణ శాశ్వతంగా పెంచడానికి బ్రిటిషు సామ్రాజ్యవాదుల ఎత్తుఇది.

ఆంధ్రరాష్ట్రానికికూడ స్వస్తివాచకం చదివాడు:

పేచీ తగాదాలలో కూడుకొన్న అస్సాం, పంజాబులాంటి రాష్ట్రాల సరిహద్దుల విషయం పై సామ్రాజ్యవాదులు పైరకంగా ప్రజలలో చీలికలు కల్పించడానికి చూస్తున్నారు. అంతటితో ఆగలేదు. 'ఏ' గ్రూపులో ఎట్టిపేచీలకు భాషాప్రయుక్తరాష్ట్ర విభజనకు అందరూ అంగీకరించడం సామ్రాజ్యవాదులకు, వారి బంట్లు బి. యస్. రావు గార్లకు రుచించలేదు. "క్రొత్త రాష్ట్రాలు నిర్మించడం ఖర్చును జాస్తిచేసి ఆర్థిక సదుపాయాలు మరీ సన్నగిలిపోతాయి" అని ప్రచారం ఆరంభించారు.

100 సంవత్సరాల క్రితం, ఆస్ట్రియా హంగరీ, హెర్జీగోవినా, బోస్నియాలపై సామ్రాజ్యాధికారాన్ని చెలాయించడానికి ఆస్ట్రియా చక్రవర్తులు, ఏర్పాటు చేసిన రాజ్యాంగాన్ని, మనకు ఆదర్శంగా చూపుతున్నాడు. 1920 లో బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వం, ఐర్లండును విభజించి తమ క్రింద బానిస దేశంగా పెట్టుకోడానికి ఏర్పాటుచేసిన రాజ్యాంగం కూడ, ఈ సర్, రామారావు మన యెదుట ఆదర్శనీయమైనదని చిత్రిస్తున్నాడు. డివెలరా నాయకత్వం క్రింద ఐరిషుప్రజలు సాయుధ తిరుగుబాటుతో ఆ రాజ్యాంగాన్ని తుత్తునియలు గావించారనే విషయం మరిచిపోయాడు.

ఆస్ట్రియా - హంగరీ, ఐర్లండు దేశాల బానిసత్వ రాజ్యాంగాన్ని ఆధారం చేసుకొని మద్రాసుకు ఒక బానిసరాజ్యాంగాన్నికూడ సూచించారు.

1. మద్రాసు రాష్ట్రం యిప్పుడున్న సరిహద్దులతోనే ఒకేరాష్ట్రంగా ఉంటుందట. దానిని ఉత్తరమద్రాసు, దక్షిణ మద్రాసు అనే రెండు ఉపరాష్ట్రాలుగ చేస్తారట. మధ్యనున్న మద్రాసుజిల్లా ఉమ్మడి ప్రాంతంగాఉంటుందట. అంతే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రముండదు. ప్రత్యేక తమిళరాష్ట్రముండదు. ప్రత్యేక కర్నాటక రాష్ట్రముండదు. ప్రత్యేక మళయాళ రాష్ట్రముండదు ఇప్పటిలాగానే కలగూరగంప రాష్ట్రముంటుంది. మన నల్గురుప్రజలలో పేచీలు పెట్టడానికి సామ్రాజ్యవాదులకు వీలవుతుంది.

2. మద్రాసు రాష్ట్రానికంతా ఒక శాయింటు శాసనసభ ఉంటుందట. దానిలో ఉత్తర దక్షిణ మద్రాసులనుండి సరిసమాన సంఖ్యగా ప్రతినిధులు వస్తారట! మద్రాసునుండి కూడ కొంతమంది వస్తారట! ఉత్తర మద్రాసు వ్యవహారాలను చర్చించేటప్పుడు, ఉత్తర మద్రాసు నుండి వచ్చిన శాసనసభ్యులు వేరుగా కూర్చుంటారట! సమిష్టి వ్యవహారాలకు జాయింటు శాసనసభ, కూర్చుంటుందట.

చీల్చి పాలించే విధానం

మద్రాసు రాష్ట్రానికంతా ఒకే మంత్రివర్గం ఉంటుంది. ఉత్తర దక్షిణప్రాంతాలనుండి సమానంగా మంత్రులుంటారట. మద్రాసుపట్టణంనుండి ఒక మంత్రి ఉంటాడు. ఉత్తర మద్రాసుకు సంబంధించిన వ్యవహారాల్లో ఉత్తరానమండి వచ్చిన మంత్రులే. గవర్నరుకు సలహా ఇస్తారట. సమిష్టివ్యవహారాల్లో మాత్రం సమిష్టిగా మంత్రివర్గమంతా సలహా ఇస్తుందట! ప్రభుత్వ పరిపాలన అంతా గవర్నరు పేరిటనే జరుగుతుందట. ఏదైనా వ్యవహారంలో గవర్నరుకు ఏమంత్రులు ఏరీతిగా సలహా ఇచ్చారు. అన్నవిషయం అంతరంగికమైనది. దీనితో ప్రజలకు నిమిత్తం లేదట!

ఈగవర్నరు మద్రాసు రాష్ట్రానికంతా ఉమ్మడిగా ఒకడే ఉంటాడట! అతనిని ఇంగ్లీషు చక్రవర్తి నియమించక పోయినా, మనమే నియమించుకో వచ్చునట! ఆ నియామకంలో ఆంధ్రుడు ఉండాలా తమిళ కర్నాటక మళయాళ గవర్నరుండాలా అనేసమస్యపై మనం పేచీలు పడుతూ ఉండవచ్చు.

పైగా "ఏవి సమిష్టి వ్యవహారాలో ఏవిప్రత్యేకంగా ఉన్న ఉపరాష్ట్రాలే నిర్వహించవలసిన విషయాలలో, గవర్నరు, మంత్రి వర్గమంతా కలిసి ఇచ్చిన సలహాను పురస్కరించుకొని నిబంధనలు చేస్తాడట" అంటే సమిష్టి వ్యవహారాలేమిటో తేల్చుకో దానికి రోజూ, మంత్రివర్గంలో వివిధ భాషా ప్రతినిధుల మధ్య తగాదాలు జరుగుతూ ఉంటాయి.

అంతేగాక ఒకేరాష్ట్రం అన్నపుడు చాలవిషయాలు సమిష్టిగానే జరుగవలసి వస్తాయి. ఆవ్యవహారాలలో తమకునష్టం కల్గిందనే పేచీలు రావడానికి ఎక్కువ అవకాశం కల్గుతుంది.

అనేక విషయాలు సమిష్టిగా జరిపితే ఇక ఉపరాష్ట్రాలకు మిగిలే విషయాలు చాలా కొద్ది. ప్రస్తుతపు జిల్లాబోర్డులకువలె ఈఉపరాష్ట్రాల శాసన సభలకు, మంత్రులకు, ప్రత్యేకాధికారాలు ఏమీ లేకుండా పోతాయి.

3. రాష్ట్రానికంతా ఒక పై శాసనసభ కూడ ఉంటుందట! దీనిలో దక్షిణ, ఉత్తర మద్రాసు ఉపరాష్ట్రాలకు చెరి రెండు స్థానాలుంటే మద్రాసు పట్టణానికి ఒక స్థానముంటుందట! ప్రజలచే ఎన్నుకోబడిన క్రింది శాసనసభలో చేసే మంచి తీర్మానాలను, చట్టాలను ఆటకాయించడానికి ఈ పై శాసన సభను ఉపయోగిస్తారు! వానిలో 5 కోట్ల జనాభాగల తదితర రాష్ట్ర ప్రజల కంతా 4 వంతులు స్థానాలుంటే, అందులో 50 వ వంతు (10 లక్షల) జనాభాగల మద్రాసు పట్టణానికి, ఐదవ వంతు స్థానాలుంటాయట! మద్రాసులోని పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు పై శాసనసభలో ఎక్కువ స్థానాలిచ్చి మద్రాసు రాష్ట్రమంతా పరిపాలించే కుట్ర తప్ప మరేమీ కాదిది.

సామ్రాజ్యవాదుల ప్లానును ఎదుర్కోండి

బి. యస్. రావు నివేదిక బ్రిటిషు సామ్రాజ్యవాదుల పూర్తి ప్లానేమిటో స్పష్టంగా బయటపెడుతూఉంది. మన ప్రజల సమస్యలన్నిటిని పరిష్కరించడానికి కావలసిన పూర్ణ స్వాతంత్ర్యాన్ని భరత ఖండానికివ్వడానికి, ఆంధ్రదేశానికివ్వడమూలేదు. మనపై బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పెత్తనం సాగుతూనే ఉంటుంది.

ఆంధ్ర ప్రజలకు అత్యవసరమయిన విశాలాంధ్రనిర్మాణప్రసక్తే ఈ నివేదికలో లేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్లాన

(మిగతా 13 వ పేజీలో)



కథ

# మహాదానం

రచన: యశ్ పాల్

సేఠ్ ప్రసాదీలాల్ బల్లీమల్ హోల్ సేల్ వ్యాపారి. యుద్ధం ఆరంభమైంది. జపాను జర్మనీలలో వ్యాపారం నిలిచిపోయింది. సముద్రాలలో శత్రు జలాంతర్గాములు తిరుగుతున్నాయి. నావలకు ప్రమాదం ఉంది. అమెరికాకు కూడా సరుకులు వెళ్ళడంలేదు.

ప్రసాదీలాల్ వద్ద ధనం మూల్గుతోంది. వ్యాపారం లేకుండా యీ ధనాన్ని యేం చేయాలి? ఒకవైపున ప్రభుత్వం నోట్లుగుప్పి వెదజల్లుతోంది. రెండోవైపున రోజురోజుకూ వడ్డీరేటు పడిపోతూంది. రూపాయి విలువ తగ్గుతోంది. వస్తువులకు ధరలు చుక్కలంటుతున్నాయి.

బియ్యం ధర పెరిగిపోతోంది. వెంటనే సేఠ్ ప్రసాదీలాల్ నాలుగుకొట్ల బియ్యం కొన్నాడు. చూస్తూ చూస్తూండటంతోనే యెందుకోగాని ప్రవేశించటం మంచిది. మణుగు యెనిమిదిరూపాయలచేసి కొన్నాడు బియ్యం. ఇప్పుడు పదకొండురూపాయలకు పోయింది. రాతిలోని క్రిమి కీటకాదులను పోషించే దేవుడు, నన్ను మాత్రం మరచిపోతాడా అనుకొన్నాడు సేఠ్ జీ.

నిత్యమూ రెండు గంటలు పూజాపురస్కారాలు చేసి, యింటినుండి కదిలేవాడు. పని వుంటేమాత్రం పూజలుండేవికావు. ముప్ఫై అయిదువేల మణుగుల బియ్యం కొన్నాడు. అందులో లక్ష అరువైఅరువేలరూపాయిల లాభం కనుపించుతోంది. ధర యింకా పెరుగుతూనే ఉంది. ఈ పరిస్థితిలో బియ్యం బైటకు తీయటం తెలివితక్కువనుకొన్నాడు సేఠ్ జీ. సరుకు యింకా ఖరీదుచేస్తూనేఉన్నాడు.

ధాన్యంధర విపరీతంగా పెరిగిపోయింది. తిండిలేక పల్లెప్రజలంతా కలకత్తాకు మళ్లారు. ఇటువంటి కరువును ఇదివరకెవరూ చూడలేదు. చూచివుంటేమాత్రం చెప్పేదెవరు? మానవులు కుక్కలకన్నా కనిష్టమైపోయారు. ఎంగిలాకుల కొరకు కుక్కలతోపాటు పెనుగులాడుతున్నారు. ఎక్కడజూచినా, అస్థిపంజరాలు మాత్రం మిగిలియున్న వీరు పస్తుతో మెతుకులకోసం చేతులు చాచి-బిచ్చం, బాబా .... పస్తుతో మెతుకులు వెయ్యండి అని కేకలు వేస్తున్నారు. సేఠ్ జీ, కొట్టునుండి వచ్చిపొయ్యేటప్పుడు యీ దీనులనుజూసి "రాం రాం, హరేరాం" అనుకుంటూ వెళ్ళేవాడు.

ఒకవైపున పస్తుతో మెతుకులకొరకు 'అన్నమో రామచంద్రా' యని ప్రజలంతా అలమటించుతుంటే, మరో వైపున ఆ ధాన్యాన్నంతా తనకొట్లో నింపుకొని ధర బాగా త్వరగా పెరగాలని చూస్తున్నాడు సేఠ్ జీ. బియ్యాన్ని కొంతకాలం బైటకు తీయకుండా దాచివుంచితే, ధర ఒకటికి ఐదింతలు రెండింతలు పెరిగిపోతుంది. కొట్లలో వున్న బియ్యానికి లాభం బాగా కనిపించేసరికి, బైటవున్న బియ్యాన్నికూడా కొని, తనకొట్లు నింపుకొనసాగాడు సేఠ్ జీ.

అన్నార్తులనుజూస్తే సేఠ్ జీ హృదయం కరిగిపోతుంది. వేయించిన శనగలబస్తా ఒకటి తెప్పించి తనకొట్టుముందు పెట్టించాడు. కొట్టుముందుకువచ్చి యాచించినవారికి గుప్పెడు గుప్పెడు శెనగలు దానం చేస్తున్నాడు సేఠ్ జీ నౌకరు. ఈదానం సంఘర్షణకు దారితీస్తుంది. ప్రజల్ని సరిపెట్టాలని సర్కులలో తిట్లు, చీవాట్లు, తన్నులు, గుద్దులు, ఒకోసారి కర్రలు, చెప్పులుకూడా ప్రయోగింపబడుతున్నారు.

సేఠ్ జీ యింటిముందు దానం, యింటిలోపల దహనం! దగాలు ఒక్కరొక్కరే లోపలకు వచ్చి బియ్యంవేలం వేస్తున్నారు. ఆకలిబాధతో అలమటించే పేదప్రజలమీద సేఠ్ జీకి గొప్ప ఉదారత్వంఉంది. కాని వ్యాపారరంగంలో మాత్రం ఆదంపల సేనా నాయకునివలె వ్యవహారాన్ని జూపించుతాడు.

సేఠ్ జీ యింటివద్దకు నుండి రు 35 చొప్పున బియ్యంఅమ్ముతున్నాడు. వుదయం నుండి గుమస్తా అయిదువందల మణుగుల బియ్యం అమ్మినాడని మధ్యాహ్నం యింటికి వచ్చేసరికి తెలిసింది సేఠ్ జీకి. కొంపమునిగిందనుకున్నాడు. గుమస్తావంక జూచి, అంతా పాడుచేసివేస్తావా? ఇక ఆపివేయ్ ....లేదు భయ్యా, లేదు, మావద్దలేదు. దళారులవైపు తిరిగి—భయ్యా, మేమే ముఫైఅయిదున్నర పెట్టి కొన్నాం అన్నాడు.

మధ్యాహ్నంనుండి సేఠ్ జీ ఖరీదు చేయసాగాడు. సాయంత్రానికి ముప్పైయెనిమిదిన్నర అమ్ముతూంది. కాని సేఠ్ జీ యింకా సరుకు ఖరీదుచేస్తూనేఉన్నాడు. ధర రాత్రికి ముప్పైతొమ్మిదిమీదనిలిచిపోయింది. సేఠ్ జీ వక్రదృష్టితో గుమస్తావైపుచూసి, ఇప్పుడు చెప్పు అన్నాడు.

రోడ్లమీదగాని, బజారుల్లోగాని, యెక్కడజూచినా అన్నార్తులసంఖ్య, వారిరోదనలు యెక్కువౌ తున్నాయి. సేఠ్ జీకి కంగారు పుట్టుకుంది. ప్రభుత్వం బియ్యానికికంట్రోలు పెట్టుతుంది. సమయం ఉండగానేవీలున్నంత వరకు సరుకును వినుదలజేసుకోవడంమంచిదని సలహాయిస్తున్నాడు గుమస్తా.

సేఠ్ జీ ఉగ్రుడయ్యాడు— "హా, ప్రభుత్వము ధర నిర్ణయించగానే యేమవుతుంది? సరుకువున్న వారికే ధరవస్తుంది. ఎక్కడ తీసుకొచ్చి అమ్ముతుంది ప్రభుత్వంచొకగా? ఇష్టం వచ్చినట్లుగా గుడ్డి పడేయటానికి కాగితపు ముక్కలా యేమిటి? ప్రభుత్వం సంపాదించినాదా కూడా వస్త్రములు వుండేగా?"

కంట్రోలువల్ల బహిరంగంగా వ్యాపారం ఆగిపోయింది. కాని నిజంగా మణుగు అరువైఅయిదు అమ్ముతున్నాడు సేఠ్ జీ. 'అరువైఅయిదు చొప్పున మనం ఎంత అమ్మగలం? అమాన్ (పునాస) పంటకూడా వస్తూనేవుందే,' అన్నాడు విచారంతో గుమస్తా.

'పంతులూ, ఇలా దిగులు చెందితే వ్యాపారం సాగుతుందా? ఈ ధరకు కొట్లో నగం అమ్మేసినా మనకు రెట్టింపు ఖరీదువస్తుంది. పైన ఆదేవుడున్నాడు.' అని ధైర్యంచెప్పాడు శేఠ్ జీ.

ప్రజలు ఈగలు, దోమలకువలె దిక్కులేకుండా చచ్చిపోతున్నారని అన్ని మూలలనుండి వార్తలు వస్తున్నాయి. సేఠ్ జీకి గుండె దడదడ కొట్టుకుంది. నిముష నిముషానికి భయంకరమైన వార్తలు వస్తున్నాయి. శ్మశానంలో శవాలు కుప్పలుప్పలుగా పడివున్నాయి. రూపాయకు యెనిమిది శేర్ల అమ్ముతున్నారు పుల్లలు. అధరకైనా దొరుకుతున్నాయా అంటే, అదీలేదు. శవాల్ని కూడా వదలిపెట్టి పోతున్నారు దరిద్రులు.

'పాపం, అన్నం మెతుకులు లేక అలమటించి చనిపోయారు. ఇప్పుడు వారికి యీ దుర్గతా? పాపం ఇక వారిగతి యేంకావాలి?' అంటూ కన్నీళ్ళు కార్చాడు సేఠ్ జీ.

రూపాయకు దమ్మిడీ చొప్పున ధర్మాదాయానికని విరగ్గోస్తున్నాడు. కొట్లో వ్యాపారానికి వ్యాపారమే, ధర్మానికి ధర్మమే. ధర్మాదాయంవల్ల వచ్చిన ధనాన్ని ఫండులో వేస్తే తిరిగి అది అనుపాయిదాలతో సహా ధర్మాదాయంలో చేరుతుంది. అది భగవద్దర్పణం, నిష్కపటీభావ మనుభవించేవారిని జూశాడు ధర్మాదాయ ఖాతానుండి రెండు బస్తాల సెనగలు రోజూ పంచిపెట్టుతున్నాడు సేఠ్ జీ. ధర్మాదాయం ఖాతాలోపైకం నమ్మైరెండు వేల రూపాయలున్నాయి. లాభంతోపాటు ధర్మాదాయంకూడా పెరిగిపోయింది.

'పంతులుగారూ'— అని కన్నీళ్ళుకార్చుతూ 'పుల్లలు యేధరకైనా సరే, ఇరువైవేలకు కొని రేవువద్ద పడవేయించండి! పాపం ఇక ఎవరికీ మట్టిపాలు కావలసిన దుర్గతి పట్టకుండుగాక!' అని సెలవిచ్చాడు శేఠ్ జీ.

తెల్లవారి ఉదయం వార్తాపత్రికల్లో — 'మహాదానం. సేఠ్ ప్రసాదీలాల్ బల్లీమల్ గారి మహాదానం....!' అని పెద్ద అక్షరాలతో పడింది.

గతిహీనుల స్థితినిగూర్చి హృదయావేదన పడేవారంతా వచ్చి ధన్యవాదాలర్పించారు సేఠ్ జీకి.

'నాదేముంది........ అంతా ఆ దేవునిదే. వానికే అర్పితం........ మానవుడేమి చేయగలడు?' వినయంగా, నిష్పేదవలె సమాధానమిచ్చాడు సేఠ్ జీ.

అనువాదం: చావ చంద్రయ్య



## గ్రంథావలోకనం

### 'ఇదీలోకం'

(మూడు అంకాల సాంఘిక నాటకం)

రచయిత: కొంపముది గోపాలరాయశర్మ.

83 పేజీలు వెల 1-4-0

దొరకుచోటు: రామా అండ్ కో; ఏలూరు.

వెంకయ్య, లక్ష్మీనరసయ్య అన్నదమ్ములు. అన్న ప్రజాసేవయే జీవితాశయంగా పెట్టుకుని, పంచుకున్న తన ఆస్తిని కోల్పోతాడు. తమ్ముడు దబ్బుగడించి ఫ్యాక్టరీ యజమాని అవుతాడు. కరువుకాలంలో దొంగవ్యాపారం చేసి లక్షలు ఆర్జించుతుంటాడు. అతని ఆశ్రయించిన శాస్త్రీ యజమానిని పొగడుతూ భావకవిత్వం చెబుతుంటాడు.

ఫ్యాక్టరీలో పనిచేసే పుల్లడు కుటుంబం సైన్యంలో కాలు విరిగిపోయి తిరిగి వచ్చిన పెద్దకొడుకు; మూగవాడైన చిన్నకొడుకు; జబ్బుతోవున్న భార్య, భార్య నానాబాధలు పడుతుంటుంది. యజమాని ఆమెపోటు, పైగా పుల్లడి కూతురును వశం చేసుగోవాలనే దుర్బుద్ధిపుట్టుతుంది. ఆకలిబాధతో, అంటువ్యాధితో పుల్లడి కుటుంబం నాశనమైపోతుంది.

ఈ గాథనంతా చూస్తున్న ప్రజాసేవకుడు వెంకయ్య, తమ్ముని దొంగవ్యాపారాన్ని నిరసించుతాడు. ఇదే నాటకంలోని యితివృత్తం.

నాటకరచనలో శర్మగారికి యిదివరకే నైపుణ్యం వుంది. కాని వారు పీడితప్రజల సమస్యను తీసుకొని వ్రాసిన మొదటినాటకం యిదే. ఐదు సీనులలో దీనిని ముగించారు.

విషయం కొత్తదగుటవల్ల కాబోలు, సంభాషణలు కొన్నిచోట్ల ఉపన్యాస ధోరణి బట్టాయి. ప్రజాసేవకుని - దొంగవ్యాపారిని అన్నదమ్ములుగా – సృష్టించుటవల్ల కథకు బిగి రాలేదు. 'జీవచ్ఛవం' అనే పతితపాత్ర సహజంగా లేదేమో అనిపిస్తుంది.

నాటకం ప్రారంభించిన విధం, ముగింపు, మొత్తంగా రచనా విధానం, బాగున్నాయి. ప్రదర్శించవలసిన నాటకం.

— చంద్రం

### "ఏమి మగవాళ్లు"

నాటికల సంపుటి. రచయిత పి. వి. రాజమన్నారు. 94 పేజీలు వెల 0-12-0 అభ్యుదయ రచయితలసంఘ ప్రచురణ. దొరకుచోటు: ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘ ఆఫీసు; గవర్నరుపేట; బెజవాడ.

దీనిలో 7 నాటికలున్నాయి. అన్నీ మధ్య తరగతి ప్రజల సాంఘిక సమస్యలకు సంబంధించిన ఇతివృత్తం కలవి. "ఏమి మగవాళ్లు", "నిష్ఫలం" అనే నాటికలు సంస్కారం పొందిన వైవాహికజీవితం గడపాలనీ, పరువుగా బ్రతకాలనీ ప్రయత్నం చేస్తున్న వేశ్య సంఘాన్నుంచి పొందే పరాభవాలను చిత్రించుతాయి. పవిత్రంగా మడిగట్టుకున్నట్లుగా నటించుతూ, వంకచిత్తంగాను కుళ్లబుద్ధితోను వుండేవారి ప్రవర్తనను బయటపెడుతాయి విముక్తి, దయ్యాలలంక అనే నాటికలు బాలవితంతువుల కష్టాలను హృదయ విదారకంగా చిత్రించుతాయి రెండూ విషాదాంతాలే.

రాజమన్నారుగారి నాటికలలో సంభాషణలు సహజంగా నడుస్తాయి. ప్రతిపాత్ర తీర్చి దిద్దినట్లుగా ప్రత్యేకత కలిగిఉంటుంది. వైనాలుగా నాటకరచన నైపుణ్యంగా వుందనే చెప్పవచ్చు. వీటిని చదువుతూంటే అపుడే పూర్తి అయిపోయాయేమో - అనే భావం కలుగుతుంది. 'వృద్ధాప్రయాణం', 'సంకల్పం' 'మాతృప్రేమ' అను తక్కిన మూడు నాటికలు సాధారణంగా వున్నాయి.

— చంద్రం

*

### "విభజించి పాలించే విధానంలో నూతనాధ్యాయం"

రచన: పామీ దత్తు

44 పేజీలు; వెల 0-5-0

ప్రజాశక్తి ప్రచురణాలయం, బెజవాడ

బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు పామీదత్తు, ఇండియాలో బ్రిటిష్ మంత్రుల రాయబారాలు సాగినన్నాళ్లు సంచారం చేసి, తన అనుభవాన్ని యీ కరపత్రం ద్వారా బ్రిటిష్ ప్రజలకు తెలియచేశాడు. విభజించి పాలించే పాత బ్రిటిష్ విధానమే ఇండియాలో కొత్తరూపం ఎలా ధరించిందో, ఇందులో తేటతెల్లంచేశారు. భారతరాజకీయ వర్గాలను ఒకదానిపైఒకటి పోటీపెట్టి, సామ్రాజ్యవాదులు ఆదే నాటకాన్ని బట్టబయలు చేశాడు.

బ్రిటన్లో సామ్రాజ్యవాద పత్రికలు, అభివృద్ధి నిరోధకనాయకులు బ్రిటిష్ ప్రజాశికపట్ల ప్రజామోహం పొందడానికి విపరీతమైన ప్రచారం చేస్తూంతే, పామీదత్తు దాని బూటకత్వాన్ని చిత్రించాడు. మన స్వాతంత్ర్య పోరాటానికి బ్రిటిష్ ప్రజల అండ సంపాదించేటందుకు యీ కరపత్రం సహాయకారి.

ప్రతి స్వాతంత్ర్యాభిలాషి దీన్ని చదవవలసిన అవసరం ఉంది.

సులభమైన శైలిలో విద్వాన్ విశ్వంగారు అనువాదంచేశారు.

—కంభంపాటి సత్యనారాయణ (సీనియర్)

# జమీందార్లకు నష్టపరిహారంఇవ్వడం

శ్రీహాయ కాంగ్రెసు మంత్రివర్గం జమీందార్లకు నష్టపరిహారం యిచ్చుటకై గావించిన సూచనలు వింటే, ఇది ఎలా, నిజమా అని విస్తోంది. ఇది జమీందారీ దోపిడీ పద్ధతిని రద్దుచేయుటమా, లేక ఇంకో రూపంలో దానిని శాశ్వతం చేయుటమా అనిపిస్తోంది.

వ్యవసాయ భూములలోనూ, అడవులు చేపలు మున్నగు జల సంపద, అటవీ సంపద, తోటలు, సంతబజార్లు మున్నగు వాటిలోనూ జమీందార్లకు గల హక్కులను ప్రభుత్వం కొనివేస్తుందట: జమీందార్ల నికరాదాయమునకు 6 నుండి 12 రెట్లవరకు ధర యిస్తారట. ఈ [illegible] కొంత నగదు రూపంలోనూ, కొంత [illegible] రూపంలోనూ, కొన్ని వాయిదాలలోనూ చెల్లిస్తారట. ఈవిధమైన నష్టపరిహారం యిచ్చి జమీందారీ పద్ధతిని రద్దు చేస్తుందట కాంగ్రెసు ప్రభుత్వం.

[illegible] మనరాష్ట్ర మంత్రివర్గం కూడా అనుసరించవచ్చును. ఈ మధ్య ప్రధాన మంత్రి ప్రకాశంగారితో మాట్లాడినప్పుడు "రేపటినుండి జమీందార్లు రైతాంగంగాలిగ వలసి వస్తుంది. కాబట్టి వారి పోషణనిమిత్తం నష్ట పరిహారం యివ్వాలి" అంటూ చెప్పారు. ఈ నష్ట పరిహారం జమీందార్లపై [illegible] యున్నట్లుగా వీరు చెప్పినా, రైతులకిది ఎట్లు పరిణమించునో వారు ఊహించలేక పోయారు.

[illegible] కమిషన్ సిఫార్సుల ప్రకారం బెంగాలు జమీందార్లకు 135 కోట్ల రూపాయలు పరిహారం యివ్వాలి. యు. పి. లో జమీందార్ల నికరాదాయం 10 కోట్లపైన సగటున 9 రెట్లు పరిహారమిస్తే 90 కోట్ల రూపాయీలు ఇవ్వాలి. మన రాష్ట్రంలో జమీందార్ల ఆదాయం [illegible] కోట్ల రూపాయలలో పేష్కషు 50 లక్షలు, వసూలు ఖర్చులు వగైరాలు 25 లక్షలు [illegible] 2 కోట్ల 25 లక్షల రూపాయీలు మిగులుతుంది. దీనికి సగటున 9 రెట్లు నష్టపరిహారం యివ్వటం అంటే 20 కోట్ల రూపాయీలు ఇవ్వాలన్న మాట: [illegible] మున్ముందు పలె రైతులు దీనిని ప్రతి సంవత్సరం తీరుస్తూ వుండాలన్న మాట:

ఇది జమీందారీ [illegible] రద్దుచేయుట మనిపించుకుంటుందా. రైతులను దోపిడీల నుండి విముక్తినొందించుట అనిపించుకొంటుందా? ఈ ప్రశ్నలకు హృదయం గల ఏ మానవుడైనా 'అవును' అని జవాబు యివ్వగలడా?

## రైతాంగానికి ఉచ్చుతాళ్ళు ఈ నష్టపరిహారం

ఇంతవరకూ జమీందార్లు భూమిపై పెత్తనం చేయుటంద్వారా రైతాంగపు ఆర్థిక స్థితిపై పెత్తనం వహించి పైశాచిక కృత్యాలు గావించారు. రైతుల మూలుగులు పీల్చేసి, గ్రామసీమలను స్మశాన వాటికలుగా మార్చారు. ఇకముందు వీరే మరో అవతారం ఎత్తుతారు. తమకు అప్పనంగా వచ్చుపడే నష్టపరిహారం మొత్తంతో పరిశ్రమలనూ, బాంకులను, కో-ఆపరేటివ్ సంస్థలను, ప్రభుత్వోద్యోగులను స్వాధీనం చేసుకొని రైతుల ఆర్థికజీవనాన్ని గుప్పెళ్ళలో పెట్టుకుంటారు. ఇప్పటికే పంచదార మిల్లులు, రైస్‌మిల్లులు, త్వరలో స్థాపింపబోయేవనస్పతి మిల్లులు, మున్నగు చిన్న పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు, యీ జమీందార్ల స్వాధీనమై వున్నవి రేపటినుండి మన ఆంధ్రదేశంలో స్థాపింపబోయే బట్టల మిల్లులు, ఎరువుల ఫ్యాక్టరీలు, సిమెంటు మిల్లులు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు మున్నగువాటిని కూడ స్వాధీనం చేసుకుం

కాయి. [illegible] వ్యవసాయోత్పత్తి, పంటల అమ్మకములకూ ప్రధానమైనవి. వీటిపై పెత్తనం సంపాదించుట అంటే వ్యవసాయ ఆర్థిక స్థితిని తమ గుప్పెళ్ళలో వుంచుకోవడమన్నమాట. ఈ రోజున భూమిపై అధికారం ద్వారా రైతాంగాన్ని [illegible] వ్యవసాయానికి ప్రాణాధారము [illegible] [illegible] చేసుకొని [illegible] కాంగ్రెసు [illegible] నష్టపరిహారం [illegible] [illegible] జమీందారీ దోపిడీ అంత మొందించుటా లేక రైతాంగాని [illegible] [illegible] బిగించుటమా?

### షదివాకు శ్రమ.గా సంపాదించినది చాలదా?

ఇంకో విషయం చూద్దాము. 145 ఏండ్లుగా జమీందార్లు అక్రమంగా, అన్యాయంగా రైతుల [illegible] వింటే తెలుసుకుంటాము. మొత్తం జమీందార్లు యీనాడు చెల్లించే పేష్కషు సుమారు 48 లక్షల [illegible]. అంటే వీరి ఆదాయం 72 లక్షలు వుండవలసినది 1802 లో వీరి ఆదాయం 70 లక్షల రూపాయలతో వుండేదన్నమాట. కాని యీనాడు వీరు సుమారు 3 కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారు. అంటే [illegible] 2 కోట్లకుపైగా అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు—

| ఎస్టేటు | పేష్కషు 1802 సుమారు | ఆదాయం | ప్రస్తుత |
|---|---|---|---|
| | రు. | రు. | రు. |
| విజయనగరం | 494816 | 00060 | 2119237 |
| పిఠాపురం | 262782 | 102182 | 810795 |
| [illegible] | 83453 | 150188 | 656283 |
| [illegible] | 4008 | 6012 | 80000 |

ఈవిధంగా ప్రతిజమీందారు పర్మనెంటు సెటిల్మెంటునాడు ఎన్నో రెట్లు ఉప్పుకొన్న మొత్తం కంటే యీనాడు ఎన్నో రెట్లు వసూలు చేస్తున్నారు. యీవిధంగా 1938 తరువాతనే ఈ 38 ఏండ్లలోనూ సగటున ఏడాదికి [illegible] 2 కోట్ల [illegible] 76 [illegible] సంపాదించి [illegible]. [illegible] ఎస్టేట్ల అభివృద్ధికి గాని, జలాధార [illegible] గాని, ప్రజలవిద్యా వైద్య సౌకర్యాలకుగాని ఖర్చుపెట్టిన పాపాన పోలేదు [illegible]. 10 ఏండ్లలో పిఠాపురం జమీందారు కిస్తుల ద్వారా మాత్రమే 81 [illegible] రూపాయలను పైగా వసూలు చేశారు. [illegible] 10 ఏండ్లలో 4 లక్షల 28 వేలమాత్రం, అంటే వసూలు చేసినదాం [illegible] 20వంతుమాత్రం జలాధారాలకు ఖర్చుపెట్టారు. కిస్తువసూలు ఖర్చులు 4 లక్షలు, జలాధారములకు 4లక్షలు [illegible] 8 లక్షలు పోతే ప్రతిఏటా 40 లక్షలకుపైగా తన కుక్కలకు, కోళ్ళకు, గుర్రాలకు దానధర్మ జనములకు [illegible] ఖర్చుపెట్టుకున్నారు. లేదా ఎన్నికలకు తగలేశారు. ఇన్నిఏండ్లనుండి ఇన్నికోట్ల రూపాయలను రైతులనుండి దోచుకొని, తమ భోగవిలాస మునకు దుబారా ఖర్చుచేసి, మరల యీనాడు నష్టపరిహార మివ్వమని అడుగుటకు యీ జమీందార్లకు నైతికమగు హక్కుఏమిటి? ఇస్తామని కాంగ్రెసు ప్రభుత్వాలనుటకు మొగ [illegible] చెల్లుతుంది?

మనరాష్ట్రంలో 20 కోట్ల రూపాయలు నష్టపరిహారంగా చెల్లించాలంటే ఏమిటో చూద్దాం. చిన్నమెత్తు పని చేయకుండా, 145 ఏండ్లు తాముచేసిన దుష్కృత్యాలకు ప్రతిఫలంగా

## కాంగ్రెసు మంత్రివర్గాలపా

### జమీందార్లు కాంగ్రెసువేషం

[illegible] జమీందార్ల ప్రభుత్వదళవళ్ల [illegible] ప్రజలశ్రమ ఫలితం [illegible] జీవించటానికి మూస్త మేస్తున్నారు. [illegible] జమీందార్లుగా ఉన్న [illegible] [illegible] [illegible] నూతనపారిశ్రామిక [illegible] వీరి పోషించటానికి డబ్బు ఎక్కడనుండి వస్తుంది? రైతుల చెమటోడ్చి, కష్టించి పండించిన పంటనుండి కాదా? గ్రామాలకు విద్య, వైద్య సౌకర్యాలు, రోడ్లు, లైబ్రరీలు మున్నగునవి నిర్మించుటకు, లేక నూతన ప్రాజెక్టులు వగైరాలు నిర్మించుటకు ఎంతో అవసరంగా కావలసిన 20 కోట్ల రూపాయలను [illegible] యీ సోమరిపోతులను పోషించుటకు వినియోగపర్చటం కాదా?

బూడిదలో పోసిన పన్నీరు అంటే ఇంతే మిటి?

జమీందార్లకు నష్టమేమిటి? పరిహారమేమిటి?

అసలు జమీందార్లకు నష్టపరిహారం ఎందుకివ్వాలి? ఒకరి హక్కులకు నష్టం కల్గిస్తే పరిహారంయిచ్చే మాట వస్తుంది. కాని జమీందార్లకున్న హక్కులేమిటి? భూములు, నదులు, గనులు, మున్నగు వాటిపైగల



నండూరి
(కార్యదర్శి, ఆం

## జమీందార్లపై యు. పి. రైత

### 5 వేల బీఘాలభూ నిరోధించలేక పోలీస

గ [illegible]

- రైతులకు పొలం
- నేస్యంచేసిన రై
- జమీందారీ దుర

ఈ నినాదాలు నేడు యు. పి. [illegible]

యు. పి లో నేడు జరుగుతున్న రైతుపోరాటాలు పీడితప్రజలు సాగించే సామాన్య పోరాటాల్లాంటివికావు. అది ఒక విప్లవం, బ్రహ్మాండమైన రైతు విప్లవం.

బస్తీ అనే జిల్లా యు. పి. లో హిమాలయ పర్వత పాద ప్రదేశంలో ఉంది. నేపాల్ సరిహద్దులు ఈ జిల్లాను తాకుతూఉంటాయి. జగత్ప్రసిద్ధి గాంచిన గౌతమబుద్ధుడు ఈ జిల్లాలోనే (కపిలవస్తు) జన్మించాడు.

ఇవి చాలా సారవంతమైన భూములు. కాని అహర్నిశం కష్టించి పనిచేసే రైతులు కడుపునిండా తిండిలేక పస్తులుపడుతుంటున్నారు. రైతుల కష్టాన్ని దోచుకుతినే జమీందార్ల, తాలూక్‌దార్ల బొర్రలు మాత్రం రాంబోళ్ళలాగా పెరిగిపోతున్నాయి.

సహాయ నిరాకరణోద్యమ (1921) సమయంలో ఈ జమీందార్లు, తాలేదార్లు చేసిన దురంతాలకు అంతులేదు. బాస్తీరాజా మేనేజరు పంపించిన కాంగ్రెసు వాలంటీర్లను గోతాల్లోవేసికట్టి, నదిలోకి తోయించారు. ఇంత "గొప్ప" పనులు చేసినందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆ మేనేజరునే ఒక 'రాజా'గా చేసింది.

రైతుల్ని పీల్చిపిప్పిచేయడంలో షాహ్రాత్‌గంజ్ జమీందారుకూడా చాలా ప్రఖ్యాతి వహించాడు. తన కయే ఖర్చులన్నీ రైతుల నెత్తినే రుద్దుతాడు. మోటారుకారు కావాలంటే, రైతులదగ్గర డబ్బు వసూలుచేసి కొనుక్కుంటాడు. తన యింట్లో జరిగే టీ పార్టీలకు, డిన్నరుపార్టీలకు రైతులదగ్గిరే డబ్బు వసూలు చేస్తాడు.

రైతుల్ని పీడించడంలో ఈ ప్రాంతపు భూస్వాములుకూడా ఏ జమీందారుకు తీసిపోరు. ఈ భూస్వాములకింద పనిచేసేరైతులెవరూ తెల్లటిబట్టలు కట్టుకోకూడదు. పావటతీని క్రాపులు దువ్వుకోగూడదు. రోడ్ల మీద రైతులు నడవడానికికూడా వీల్లేదు. రైతు స్త్రీలమీద వీళ్ళు సాగించే దుర్మార్గాలకు అంతులేదు.

బలవ్తీగా ఇదివరకు రైతుల [illegible] వేల బీఘాలభూమిని (…మా [illegible]

రైతుల సంఘ బలాన్ని చూచి [illegible] రైతుసంఘం అంటే జమీందారులకు ని[illegible]

నూతన చైతన్యంతో ముందుకు[illegible] విధానాన్ని నామరూపాలులేకుండా చే[illegible] బలవ్తీని ఇక రైతులు సహించవు[illegible] రైతులు విశ్రాంతి తీసుకోరు.

కోపికి విధానంలో [illegible] రైతు పోరాటాలు అఖాకిరణాలు.

బస్తీలో రైతులు ప్రతి నిత్యం అను[illegible] వించే కష్టాల్లో ఇవి కొన్ని మాత్రమే. ఒక్క మాటలో చెప్పాలంటే జమీందారులు చేయ[illegible] ఘోరం అంటూ లేదు. గ్రామంలో ఉన్న ఏ స్త్రీమీదనైనా వీళ్ళ కన్నుబడితే, ఆ స్త్రీ[illegible] సమర్పించుకోవలసినదే. లేకపోతే ప్రాణ[illegible] దక్కదు.

### కాలచక్రం తారుమారయింది

ఆరుమాసాల పూర్వం వరకు బస్తీలో ఇలాంటి దారుణ కృత్యాలే జరుగుతూ ఉం[illegible] దేవి. కాని నేడు, ఎర్రజెండా ప్రవేశించిన తర్వాత, పరిస్థితులుపూర్తిగామారిపోయాయి. రైతుల్లో నూతన చైతన్యం కలిగింది. సంఘ బలంతో రైతులు ముందుకు నడిచారు. [illegible] ఈలాటి రాక్షస కృత్యాలు సాగడానికి వీ[illegible]

# రైతాంగానికి ఉరిత్రాళ్లు బిగించడమే!

## [illegible]సీ రైతుల్ని మాడ్చివేస్తుంది

### [illegible] వేయడంలోగల అంతరార్థం



ప్రసాదరావు
([illegible]రాష్ట్ర రైతుసంఘం)

"హక్కులు"లేకున్నందుకు నష్టపరిహారం యివ్వాలని [illegible] ప్రభుత్వం చెప్పుతోంది. కాని యీ హక్కులు ఏ శాస్త్ర ప్రకారం, ఏ న్యాయం ప్రకారం కలిగినవో ప్రభుత్వం చెప్పగలదా? భారతీయేతిహాసము సంతా గాలించి చూసినా ఇక్ష్వాకుల కాలంనుండి భూమి రైతుదే. వేదాలుచదవండి, మనుధర్మశాస్త్రం చూడండి; జస్టిస్ అక్బరీ చూడండి భూమిపై హక్కు యెవరిదో తెలుస్తుంది.

జమీందార్లు అనేవారు మనుష్య, జంతు, వృక్షవర్గాలలో ఎక్కడా [illegible] లేరు. మొగలుల కాలంలో మాత్రం శిస్తువసూలు దార్లను జమీన్‌దార్లు అని పిల్చేవారు. ఈస్టిండియా కంపెనీయే ప్రస్తుత జమీన్‌దారీ పద్ధతిని ఏర్పాటు చేసింది. కాని శాశ్వత పైసలా పద్ధతిక్రిందకూడా జమీన్‌దార్లకు భూమి, అడవులు, జలాధారాలు, మున్నగువాటిపై ఎట్టి హక్కులూ కల్పించబడలేదని, సర్వ హక్కులూ రైతులకే వున్నవని ప్రకాశం కమిటీయే నిర్ధారణచేసింది. అంగిట్లోబెల్లాన్ని, గుర్రానికి [illegible] నైవేద్యం పెట్టగలమా? లసకేలేని హక్కులను ప్రభుత్వం జమీందార్లకు కల్పించేయగలదా? కాబట్టి హుళక్కి హక్కులకు నష్టపరిహారం యివ్వాలనటం పెద్ద నవ్వుపాలు కావటంకాక మరేమిటి?

ఈనాడు జమీందార్లకు నష్టపరిహారం యివ్వాలని కాంగ్రెసు మంత్రివర్గంఅనటానికి నేను ఒకే కారణాన్ని [illegible]హిస్తున్నాను. ఈ రోజున జమీందార్లంతా కాంగ్రెసుముసుగు వేసుకున్నారు. దేశభక్తిని నటిస్తున్నారు. కాంగ్రెస్‌నిధులకు [illegible] చందాలు యిస్తున్నారు. వీరి యీ కపటదేశభక్తికి పారితోషికంగా ఈ నష్టపరిహారం యివ్వబడుతోందని నేను ఊహిస్తున్నాను.

పంచతంత్రములోని బంగారు కడియపు వృద్ధవ్యాఘ్రమువలె, యీనాడు జమీందార్లు నటిస్తున్నారు. కాని నిజానికి వీరు కాంగ్రెసు గోత్రీకులుకారు. కాంగ్రెస్ [illegible] కారు. వీరు బ్రిటిషు సామ్రాజ్యవాదుల సృష్టి, వారి చెంచాలు. గత 150 ఏండ్ల చరిత్రను తిరగేసిచూస్తే వీరి దేశద్రోహ చర్యలు స్పష్టంగా [illegible]. జాతీయోద్యమానికి వీరు [illegible] ద్రోహం చేశారో, కాంగ్రెసుకు నాశనం చేయటానికి బ్రిటిషు సామ్రాజ్యవాదులకు ఎంత తోడ్పడ్డారో, మనం ఇంతలో మరువలేము. ఈనాటికి చల్లపల్లి, ఉయ్యూరు, మిర్జాపురం, ఎలమంచిలి మందసా, [illegible], వెంకటగిరి, పిఠాపురం మొదలగు ఎస్టేటులలో జరిగే హృదయ విదారకమగు ఘోరాలు చూస్తే, ఈ రుద్రాక్ష పిల్లుల హృదయ పరివర్తనను ఎవరు నమ్మగలరు?

ఈనాడు [illegible] కాంగ్రెసులో చేరటానికి ఒకే కారణం వుంది, తమ దోపిడీని పాత పద్ధతులలో సాగించలేమని వీరు గుర్తించారు. కాబట్టి వేషం మార్చారు, [illegible] తిప్పారు. కాంగ్రెసు పేరుతో, కాంగ్రెసు పలుకుబడితో, పరిశ్రమల ద్వారా, బాంకుల ద్వారా తమ దోపిడీని కొనసాగింపదలచారు. ఇందుకే వీరు [illegible]ప్పుడు, కోట్లకొలది సొమ్ము అప్పనంగా వచ్చి వళ్ళో పడుతున్నప్పుడు, నాలిక గీసుకుంటానికైనా పనికిరాని పన్నుదలను విరుపులనువిసర్జించటానికి వీరికేమైనా [illegible]?

### ఎవరు నష్టపరిహారాన్ని కోరేది?

"మొగుడ్ని కొట్టి మొర్రో" అన్న ఇల్లాలు వలె, రైతుల పీడించుకు తింటూ పైగా తమ హక్కులన్నీ వూడదీస్తున్నారే యని జమీందార్లు ఒకే కాకిగోల చేస్తున్నారు. గాంధీజీవద్దకు కూడ రాయబారం వెళ్ళుతారట. [illegible], వీరి పిచ్చిగాని, రైతాంగమంతా జాగృతమై వున్నప్పుడు గాంధీజీగాని, మరొకరుగాని, అన్యథా ఏమి చేయగలరు? జమీందార్లుఎంత గోలపెట్టినా, ఎర్రని ఏగాని కూడ వారికి పరిహారం యివ్వబడదు, అని రైతాంగం నిశ్చయించుకున్నది. ఇందుకు తన యావచ్ఛక్తిని వినియోగించి పోరాడగలదు. కాని, తనకుగా తాను వుని [illegible] తగిలించుకొన ఎవరు ఉత్సహించురు?

నష్టపరిహారం కోరవలసినది, కోరదగ్గది, రైతులు. 145 ఏండ్లుగా జమీందార్లు ఎస్టేట్లను పరిపాలించి, కళకళలాడే గ్రామసీమలను స్మశాన వాటికగా మార్చారు. వాటిని మరమ్మతుచేసి, సక్రమ స్థితికి తేవాలంటే ఎంతసొమ్ము కావాలో? ఎన్ని ఏండ్లు పడుతుందో? ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని సాగించటానికై జమీందార్లు రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలి. అందుకై జమీందారీపద్ధతి పూర్తిగా రద్దు అయ్యేలోగా ఎస్టేట్లపై వసూలుకాబడే శిస్తులు హామీగావుండాలి. ఆ ఎస్టేటుపొలనుండి, జమీందార్ల కుటుంబ పోషణకుగాను, కుటుంబపరిస్థితుల్నిబట్టిఏడాదికి రు 6000

మించకుండునట్లు భరణం మాత్రం యివ్వాలి. ఈ మొత్తమూ, వసూలు ఖర్చులూ, పేష్కషూ పోను మిగతా సొమ్మును అంతటినీ "ఎస్టేటు అభివృద్ధి నిధి" క్రింద వుంచి, జలాధారాల మరమ్మతు మున్నగు వాటికై ఖర్చుపెట్టాలి. ఇదీ రైతులు కోరేది.

కాంగ్రెసు మంత్రివర్గాలు నిజంగా ఎవరు నష్టపరిహారాన్నికోరుటకు అర్హులో యోచించ గలరా? జమీందార్లకుకాదు, రైతులకు యివ్వాలి నష్టపరిహారం — అన్న వాదనను కాదనగలరా? అని ప్రశ్నిస్తున్నాను.

## [illegible]ంగం యుద్ధం ప్రకటించింది

### [illegible] తిరిగి లాక్కున్నారు [illegible] వెనక్కు తిరిగారు

[illegible] కావాలి
[illegible]సే పంట దక్కాలి
[illegible]కాలు నశించాలి
[illegible]ష్ట్రమంతట ప్రతిధ్వనిస్తున్నాయి.

[illegible] దగ్గరనుంచి జమీందారులు అపహరించిన [illegible] రైతులు తిరిగి స్వాధీనపరచుకున్నారు. [illegible]దారులు, భూస్వాములు హడలిపోతున్నారు. [illegible] ఘోస్వప్నంగా ఉంది.

[illegible] భారత రైతాంగం జమీందారీ [illegible]నికి సమరం బిగించింది. జమీందారుల [illegible] జమీందారులను పూర్తిగా రద్దుచేసిగాని [illegible]

[illegible] భారత రైతాంగానికి యు. పి.

[illegible]దని నిర్భయంగా జమీందారీ వర్గాన్ని ఎదిరించారు. దండ్వా గ్రామంలో ప్రప్రథమంగా రైతు జయభేరీ మ్రోగింది. రణగర్జన వినిపించింది. జమీందారులు తమవద్దనుంచి బలవ్తీగా లాక్కున్న భూముల్ని ఒక్కొక్కటే మళ్ళీస్వాధీనపరచుకొన్నారు రైతుల సంఘశక్తినిజూచి జమీందారులు హడలిపోయ్యారు. వాళ్ళ గుండె లవిసిపోయ్యాయి. కాళ్ళు గడగడ వణికాయి.

### జమీందారుల దురంతాలు

రైతు ఉద్యమాన్ని అణచివేయటానికి జమీందారులు కుట్రలు పన్నారు. సన్నసువారాల్లో మేపి, రౌడీల్నితయారుచేసి, రైతుల మీదకు పంపించారు. రౌడీలు గ్రామాలమీద

బడిరైతులఆస్తులు [illegible] గ్రామాలు తగలబెట్టారు.

ఇంతటిలో జమీందారుల దురంతాలు ఆగిపోలేదు. తమ పశువుల చావడిని తామేతగలబెట్టి, రైతులు తగలబెట్టారని దొంగకేసు బనాయించారు.

కాని రైతుల సంఘశక్తి ముందు జమీందారుల కుట్రలన్నీ పటాపంచలయ్యాయి. రౌడీలు తోకముడిచి పరుగుపుచ్చుకున్నారు.

ఇంతకు పూర్వం జమీందారులు అపహరించిన 5 వేల బీఘాలభూమిని దండ్వారైతులు స్వాధీన పరుచుకున్నారు. జమీందారుకోటను ముట్టడివేశారు. మూడురోజుల వరకు కోటలోనుంచి ఒక్క పురుగుకూడా బైటికి రాలేదు. జమీందారీరౌడీలు దోచుకున్న ధాన్యాన్ని అంతా మళ్ళీ స్వాధీనం చేసుకున్నారు.

మొదటి పోరాటంలో రైతులకే అఖండ విజయం కలిగింది. ఎన్నాళ్ళనుంచో తమ రక్తాన్ని పీల్చిన జమీందారులకు తగినబుద్ధి చెప్పాలనుకున్నారు.

### జమీందారుల్ని వెలివేశారు

గ్రామమంతా ఒకకట్టుగా నిలబడి జమీందారుల్ని భూస్వాముల్ని వెలివేశారు. కోటలో ఉండే పనిమనుషులుకూడా పనులుచేయడం మానివేశారు. అంతఃపురంలో ఎండ కన్నెరుగకుండతినితాగుతుంటూన్న 'దొరసానులు' దేవుడా అనుకుంటూ తమబట్టల్ని తామే ఉతుక్కుంటున్నారు. తమవంట తామేచేసుకుంటున్నారు. కాలచక్రం తిరిగిపోయింది. కష్టపడి పనిచేసేవారిదే పొలంమీదహక్కు. కాలుమీద కాలువేసుకుని పంచభక్ష్య పరమాన్నాల తొక్కుడితోఉబ్బరట్లుగే బొర్రలతో మజాకోసం మానవ హింసజేసే జమీందారులకు సంఘంలో ఇకస్థానంలేదు.

నడవగూడదని జమీందారులునిషేధించిన రోడ్లమీద రైతులు నేడు స్వేచ్ఛగా నడుస్తు

(మిగతా చివరికాలంలో)

(8 వ కాలం తరువాయి)

న్నారు. మాచెమటతో, మారక్తంతోకష్టపడి మేమునిర్మించిన రోడ్లమీద జమీందారులకు నడిచేహక్కులేదుఅని రైతులు ఏకాభిప్రాయమై జమీందార్లనేబహిష్కరించారు.

### పోలీసుల సహాయం

ఛతహారాలో జరిగిన పోరాటంలో కూడా రైతులదే విజయం. మూడు వారాల క్రితమే ఈ పోరాటం జరిగింది. జమీందారులు అపహరించిన భూమిని రైతులు తిరిగిస్వాధీన పరుచుకున్నారు. పైరు వేసుకున్నారు. అదిపంటకు వచ్చింది. పైరు కోయడానికి రైతులు పొలందగ్గరకు వెళ్ళారు. కాని జమీందారు ఇంతకుముందే కొంత తతంగం జరిపి, పోలీసుల్ని వెంటబెట్టుకొనివచ్చాడు. 'తగాదాలోఉంది గాబట్టి ఈపొలంలో ఎవరూ అడుగు బెట్టగూడద'ని పోలీసులు ప్రకటించారు. రైతులు ఇంటికితిరిగివెళ్ళారు. మీటింగు జరుపుకున్నారు. "కష్టపడి మనం దున్ని పైరువేసుకున్న పొలంలో ఆ పంట అనుభవించడానికి ఇతరుల కేం హక్కుంది? మనం వేసుకున్న పైరు మనం కోసుకోవాలిసిందే" అని నిర్ణయించుకున్నారు. వెంటనే "దున్నేవారిదే పొలం" అనే నినాదం నలువైపుల ప్రతిధ్వనించింది. మూడువేలమంది రైతులు బారులుతీర్చి నినాదాలిచ్చుకుంటూ కొడవళ్ళతోసహా పెద్ద ఊరేగింపుగా బయలుదేరి పొలం దగ్గరకు వెళ్ళారు. పోలీసులు, సబ్‌ఇన్‌స్పెక్టరు పిస్తోళ్ళతోసహా పొలం దగ్గరే 'రెడీ'గా ఉన్నారు.

### రైతుల యుద్ధ వ్యూహం

వెంటనే రైతులు యుద్ధ వ్యూహం పన్నారు. మూడు వేలమంది రైతులు మూడుదళాలుగా చీలారు.

వెనకనుంచి పోలీసులకు సహాయం రాకుండా చూడడానికి ఒక దళం దగ్గరలో ఉన్న రైలుస్టేషన్ను కాపలాకాసింది. మరో దళం పోలీసుల్ని చుట్టూ ముట్టడించింది. మూడో దళం పైరు కోయసాగింది.

రైతులమీద కాల్పులు సాగించడానికి పోలీసులదగ్గిర ప్రభుత్వఉత్తరువులున్నాయి. కాని "మామీద కాల్పులుసాగిస్తే జాగ్రత్త! మీ ప్రాణాలు దక్కవు" అని రైతులు ముందే పోలీసుల్ని హెచ్చరించారు.

మొదట దీన్ని లెక్కచేయకుండా సబ్‌ఇన్‌స్పెక్టరు రైతుల్ని కాల్చడానికి తన చేతిలోఉన్న పిస్తోలును పైకి ఎత్తాడు.

'జాగ్రత్త! పిస్తోలును జేబులోపెట్టి చేతులు పైకెత్తు, అని రైతులు కేకవేశారు.

ఇకలాభంలేదని పోలీసులు [illegible] వచ్చినదారినే వెళ్ళిపుచ్చుకున్నారు;

యు. పి. రైతులు నేడు మేల్కొన్నారు. జమీందారీ దురంతాల్ని ఇకవారు సహించరు. జమీందారీ విధానాన్ని సమూలంగా నిర్మూలనం చేసిగాని రైతులు విశ్రాంతి తీసుకోరు.

'పీపుల్సు ఏజ్' నుంచి



కొల్లా వెంకయ్య
అధ్యక్షుడు,
(గుంటూరుజిల్లా పొగాకుమార్కెటింగ్ కమిటీ)

# పొగాకు రైతులపై ప్రజాప్రభుత్వపు శీతకన్ను

## గుంటూరు మార్కెటింగ్ కమిటీపై సర్‌చార్జి!

"డైరెక్టర్ (పొగాకు మార్కెటింగు కమిటీ) ఉత్తరజిల్లాలు, ఐదంచుకంటి జిల్లా పర్యటన, ఉద్యోగులను మైసూర్ పంపుట, బేరన్ సామానులు సప్లైచేయుట, నారు స్కీముల నిమిత్తం అనుమతిలేనిదే సొమ్ము ఖర్చుపెట్టడం కమిటీయొక్క సక్రమ బాధ్యతకాదని. లోకల్‌ఫండ్ ఎగ్జామినరు, వ్యవసాయశాఖ డైరెక్టరుతో ప్రభుత్వం ఏకీభవిస్తూ ఆవ్యయాన్ని బాధ్యులైనవారినుండి రాబట్టుటకు ఆజ్ఞాపిస్తూంది."

★

ఇది ఎవ్వరిచ్చిన ఆర్డరుకాదు. ప్రజామంత్రివర్గం 15-5-46న జారీచేసిన ఉత్తరువు ఏనాడుకానీ కమిటీకివ్యతిరేకంగా ఇచ్చిన ఉత్తరువుకాదు. పొగాకు రైతులు వ్యాపారస్తులు ఎన్నుకున్న గుంటూరు పొగాకు మార్కెట్ కమిటీకి వ్యతిరేకంగా ప్రజలచే ఎన్నుకోబడిన మంత్రులు జారీ చేసిన ఉత్తరువు.

### కమిటీచేసిన తప్పేమిటి?

11-9-44న కమిటీ సమావేశమయింది. పొగాకు పండించి, తయారు చేయటంలోను తనపొగాకును సక్రమధరకమ్ముకొనుటలోనూ రైతాంగం పడుతున్న బాధలను, ఆర్థిక నష్టాలను, కమిటీ చర్చించింది. ఉత్పత్తి, మార్కెటింగులలో అనేక యిబ్బందు లున్నాయి. నారుదొరకుటలేదు. మొక్కలు వేసి ఎదిగిన తర్వాత బెరుకు విత్తనమని తెలిసి, తోట పీకివేసిన సంఘటనలున్నాయి. నారు పెంపకంలో కంట్రాక్టు పద్ధతి వ్యాపించింది. మైసూరులో లాగా ప్రభుత్వం శాస్త్రీయంగా తయారుచేసిన నారు రైతు కందించుటలేదు.

బేరన్ సామానులు. రేకు, ఎరువులు, కిరోసిన్‌కొరకు బేరన్ రైతులు పడుతున్న యిబ్బందులు వేరేచెప్పనవసరంలేదు. ధరలు విపరీతంగా పెరిగినవి. దొంగ మార్కెట్లో కూడా సరుకు దొరకుటలేదు.

పనిముట్లకిమ్మని బెరన్ సామానులకు సిఫార్సు చేయవలసిందిగా కమిటీ డైరెక్టరును మొదటినుంచి కోరుతూ వచ్చింది. మొదట డైరెక్టరుఅందుకంగీకరించి, తర్వాత వ్యాపారుల కుట్రలకులోనై సిఫార్సుచేయ నిరాకరించాడు. ఇనుపసామానులు కాక పోయినా, యితర కంట్రోలు సరుకుల సామానులనైనా సంపాదించి, రైతుల కందించి దొంగవ్యాపారులనుంచి కాపాడాలని కమిటీ ఆలోచించింది. ఏ పొగాకు రైతులను మార్కెట్‌లో గుత్తవ్యాపారులు దోచుకోవటం మనకుతెలియనిదికాదు. ఎరువు వచ్చిందాకా పొగాకు నిల్వచేసికోవాలంటే రైతుకయ్యే ఖర్చులకు అప్పుదొరికే అవకాశంలేదు. నాటుపొగాకు పండించే రైతుల భవిష్యత్తు అయోమయంగా ఉంది. పొగాకు రైతుల సహకార సంఘాన్ని రిజిష్టరు చేయమని పొగాకు రైతులూ, కమిటీవారూ ఆందోళన సాగించారు. పొగాకు రైతుల సభలు కూడా జరిగాయి. ప్రభుత్వం సహకార సంఘం రిజిష్టరుచేయడం మంచిదని సలహాయిస్తూ జి. ఓ. ఇచ్చినా రిజిష్ట్రారు వ్యాపారులకులొంగి ఆ జి.ఓ. ను బుట్టదాఖలు చేశాడు.

ఈ పరిస్థితులలో పొగాకు రైతులకవసరమైన సరకులనందించి, పొగాకుకు సక్రమ ధరను రాబట్టుటకు పొగాకు రైతుల సహకార సంఘాన్ని వెంటనే రిజిష్టరుచేయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ 11-9-44న మార్కెటింగ్ కమిటీ తీర్మానించింది. ఈలోగా రైతుల కవసరమైన బేరన్ సామానులు తెప్పించి అందించాలనీ, పూనానుండి తెప్పించిన విత్తనాలతో మళ్ళీపెట్టి, మంచి విత్తనాలు తయారుచేయాలనీ నిర్ణయించింది. కొంత నారు ఉచితంగా ఇచ్చి, విత్తనాలు తయారుచేయాలనీ, మిగతాదాన్ని గిట్టుబాటు ధర కమ్మాలనీ నిర్ణయించింది. కమిటీ బేరను సామానులందించడమేకాక, వ్యవసాయశాఖ మళ్ళ ప్రక్కనే నుళ్ళుపెట్టి శాస్త్రీయ పద్ధతులతో మార్కెటింగుకమిటీ నారు పెంచింది. మార్కెట్ ధరకంటె రు. 10లు తక్కువధరకు నారులందించింది. మంచి విత్తనాలు తయారుచేసి వ్యవసాయ శాఖ కంటె మిన్న అనిపించింది.

సహకార సంఘాన్ని జయప్రదంగా నడుపుటకై మైసూరు కంపెనీలోసాగుతున్న ఉత్పత్తి, మార్కెటింగు విషయాల్లో అనుభవాలను సంపాదించుటకుగాను కమిటీ ఉద్యోగులను మైసూరు పంపాలనీ. దక్షిణ ఉత్తరాది జిల్లాలకు వైస్ ఛైర్మన్‌నుపంపి మార్కెట్‌తో సంబంధాన్ని పెట్టుకోవాలనీ, పూర్తిసమాచారాన్ని సేకరించాలెననీ నిర్ణయించింది మైసూరులో శాస్త్రీయపద్ధతుల ప్రకారం మళ్ళను పెంచుతున్న అనుభవాలనేగాక, మైసూరు మార్కెట్ పరిస్థితులను, ఉత్తరాది, దక్షిణాది మార్కెట్లకు సంబంధించినసమాచారాన్ని సంపాదించింది. సంబంధాల నేర్పరచుకొంది. రైతుల కవసరమైన సామానులు అందించ డానికి, ఇతర పొగాకు సంస్థల అనుభవాలను ఇతర మార్కెట్ల సమాచారాన్ని సేకరించ డానికై కమిటీ కృషిచేయటం ప్రభుత్వ దృష్టిలో మహాపరాధమైంది.

### కమిటీ నిర్ణయాలు చట్ట విరుద్ధమా?

ఈ కమిటీ మద్రాసు వ్యాపార పంటల చట్టంక్రింద ఏర్పడిపనిచేస్తున్నది. అప్పటి కున్న చట్టాన్ని, సవరణలనూ దృష్టిలో పెట్టుకొని చూస్తే. కమిటీ నిర్ణయాలు చట్టానికి విరుద్ధంకాదు

చట్టంలోని 18వ సెక్షను ప్రకారం పొగాకు ఉత్పత్తి మార్కెటింగును సంబంధించిన సమాచారాన్ని సేకరించటానికి, వ్యవసాయా భివృద్ధినీ పొదుపునూ గురించి ప్రచారం చేయటానికి, పొగాకు పైరును అభివృద్ధి పరచుట కవసరమైన స్కీమును వేసి ఆచరణలో పెట్టుటకు కమిటీ తనధనాన్ని వ్యయపెట్టవచ్చు. ఇతరులు (వ్యక్తులుగానిలేక సంస్థలు) తయారుచేసిన స్కీములకు ఆర్థిక సహాయాన్ని యివ్వటానికి మాత్రం ప్రభుత్వ అనుమతిని పొందాలి. అందువల్ల వైస్ ఛైర్మన్ పర్యటనగానీ, ఉద్యోగులను మైసూరు పంపటంగానీ, బేరను సామానులు నారు మొదలగు స్కీములుగానీ చట్టసమ్మత మైనవనీ, వీటికొరకు ప్రభుత్వానుమతి పొందనవసరములేదనీ స్పష్టమవుతూవుంది.

యీపరిస్థితులలో ప్రభుత్వ ఉత్తర్వు ఎంత అక్రమమో. అసమంజసమో వేరుగా చెప్ప నక్కరలేదు.

### పొగాకు రైతుల శ్రేయస్సు నరికట్టే కుట్ర

1944 మార్చిలో జరిగిన ఎన్నికలలో పొగాకు రైతులు, చిన్నవ్యాపారులు జిల్లా రైతుసంఘం వెనుక నిలచి 8 స్థానాల్లో 7 స్థానాలు సంపాదించారు. ఇది విదేశ గుత్తవ్యాపారులకూ, దేశీయులైన పెద్ద వ్యాపారులకు కంటకంగా వుంది. ప్రజా ప్రాతినిధ్యం గల యీ కమిటీ పొగాకు రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు పెట్టాలనటం, అక్రమ తీసివేతలు తూకాలకు వ్యతిరేకంగానూ, బేరపు షరతుల ధిక్కరణకు వ్యతిరేకంగాను పోరాడటం వారికి కష్టంగా వుంది. వ్యవసాయశాఖ డైరెక్టరుతోను కో ఆపరేటివ్ అధికారుల తోను మంతనాలు సాగించారు. పెద్ద వ్యాపారులచేతుల్లో కీలుబొమ్మగా ఇండియన్ టుబాకో ఎసోసియేషన్ వుంది. డైరెక్టరు యీ అసోసియేషన్ వుండగా కమిటీ ఎందుకని అనుమానాలు వెలిబుచ్చసాగారు. వారి ఆమోదం గూడా సంపాదించలేకపోతే కమిటీ నిబంధనలను అంగీకరించడం కష్టమన్నారు. పెండెతారు తీసివేస్తున్నప్పుడు చిన్నవ్యాపారులలాగానే పట్టు, కొన, లేక వాటివిలువ తిరిగి ఇవ్వాలని కమిటీ తీర్మానం చేసింది. కమిటీలో ఈ తీర్మానం చర్చకు వచ్చినపుడు గుత్తవ్యాపారుల కంపెనీ అయిన ఐ. యల్ టి డి. కంపెనీ తరపున ప్రభుత్వం నియమించిన సభ్యుడు మాత్రమే వ్యతిరేకించాడు. ఈ తీర్మానాన్ని చట్టంలోని కొత్త మార్పుల ప్రకారం అగ్రికల్చరల్ డైరెక్టరు ఆమోదానికి పంపగా, గుత్తవ్యాపారులతోచేరి యీ నిబంధనను త్రోసిపుచ్చాడు. దీనివల్ల ఒక్క ఐ. యల్. టి. డి కంపెనీకే 60 వేల రూపాయలు అక్రమమైన లాభం చేకూరుతుంది. రైతులు ఇంత మొత్తానికి నష్టపడాల్సివస్తుంది.

రైతులకు, చిన్న వ్యాపారులకు గోడౌను సౌకర్యాలు లేనూ, ఎక్కువ చట్టంవల్ల ఎక్కువకాలం స్వంత గోడౌనులో నిల్వచేసి కొనే అవకాశాలు లేకనూ చాల బాధపడుతున్నారు. దానిపై కమిటీ ఆదాయాన్ని. సెస్సునూ పెంచడంద్వారా గోడౌన్లనుఎక్కువ చేయాలని కమిటీ తీర్మానించింది. తనకొచ్చే కోట్లలాభం ఎక్కడ తరుగుతుందోనని యీ తీర్మానాన్ని వ్యతిరేకించాడు ఐ. యల్. టి. డి. సభ్యుడు. ప్రభుత్వ ప్రతినిధియైన అగ్రికల్చరల్ డైరెక్టరు కూడ వారికి తాళం వేస్తూ యీ తీర్మానాన్ని ఆమోదించవద్దని కలెక్టరుకు సిఫార్సుచేశాడు. తారం తీసివేత రెండుపౌన్లకంటె హెచ్చు వుండకూడదని కమిటీ అభిప్రాయపడితే ఐ. యల్. టి. డి. సభ్యుడు అడ్డుతగిలాడు. అగ్రికల్చరల్ డైరెక్టరుయొక్క ధోరణి గమనించి, కమిటీ పెద్దకంపెనీలలో పరిశీలించి, తూకాన్ని కంపెనీ యజమానులచేత రికార్డు చేయించింది. పట్టలు, పురి, తూకం రెండుపౌన్లకంటె ఎక్కువ లేదని రుజువుచేసి, ఐ. యల్. టి. డి. సభ్యునికి సాక్షం చెప్పింది. ఇలా రుజువు చేసి చూపించినా 29.4.46న ప్యాసుచేసిన తీర్మానాన్ని 3.6.46 వరకు డైరెక్టరు ఆమోదించకుండా కాలంగడిపాడు.

"తన ఉద్యోగులను మైసూరు పంపించి మైసూరు టుబాకో కంపెనీయొక్క అనుభవాం సంపాదించి, పొగాకు రైతులసహకార సంఘాన్ని నడుపవలెనని" మార్కెటింగు కమిటీ అభిప్రాయపడింది. ఐ.యల్.టి.డి. కంపెనీ తరపున నామినేట్ చేయబడిన సభ్యుడు ఒక్కడే. తమ గుట్టు ఎక్కడ బయటపడుతుందోనని యీతీర్మానాన్ని వ్యతిరేకించాడు డైరెక్టరు దీనికి తాళంవేయడం మొదలుపెట్టాడు. కో.ఆపరేటివ్ జాయింటు రిజిష్ట్రారు సహకారసంఘాలు ఆచరణయోగ్యమైనవి కావని శ్రీపికా అంజనేయులు మొదలైనవారితో చర్చించితే తేలిందని వాదించడం మొదలుపెట్టాడు.

1945 చివరివరకు ఉన్నచట్టం ప్రకారం డైరెక్టరుకు కమిటీ మీదఎలాంటిఅధికారమూ లేదు. 1944 మార్చివరకు ఏ డైరెక్టరు కూడ కమిటీ నిర్ణయాల్లో కలుగజేసుకొలేదు. కాని డైరెక్టరు బి.వి నాథ్‌గారు మాత్రం గుత్త వ్యాపారులకులొంగి, పెద్ద వ్యాపారులతో చేతులుకలిపి కమిటీపై లేనిపోని అధికారాన్ని చలాయించ మొదలుపెట్టాడు. రైతుల శ్రేయస్సుకై చేయబడ్డ ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. 29-9-44న మైసూరుకు ఉద్యోగులను పంపడం అనవసరమని సలహాయిస్తూ చట్టంలోని ఏ క్లాజు ప్రకారం బేరన్ సామాన్లు, విత్తనాలు, నారుకు సంబంధించిన స్కీములు ఆచరణలో పెట్టుటకు నిర్ణయించారో తెలియజేయమన్నాడు. నవంబరులో ఈ స్కీములు ఆచరణలో పెట్టడం ప్రారంభమైన తర్వాత ఉద్యోగులు మైసూరు వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత ఇది తప్పనీ, కమిటీ బాధ్యత కాదనీ రిమార్కులు పంపాడు. చివరకు కమిటీ అధికారాలను సంకుచితపరుస్తూ కలెక్టరునుండి తన చేతికి అధికారాన్ని లాక్కొంటూ ఎడ్వయిజర్ల ప్రభుత్వంచేత చట్టంలో మార్పులు చేయించాడు. వ్యవసాయాన్ని శాస్త్రప్రకారం అభివృద్ధి పరచుటకు కృషిచేయవలసిన డైరెక్టరు ఎరువులు, ఇనుప సామానుల అమ్మకాన్ని, బొగ్గు, కిరోసిన్, బేరన్‌సామానుల పంపకాన్ని పొగాకురైతుల శ్రేయస్సుకై పనిచేస్తున్న కమిటీ చేతుల్లో లేకుండా చేశాడు.

ఇక ఆడిటర్ల విషయం చెప్పనవసరం లేదు. ఆడిట్ సమయంలో వీరికి కాఫీలు, ఫలహారాలు తెచ్చి దిట్టంగా మేపే సాంప్రదాయం లోగడ వుండేదట. ప్రజల కమిటీ ఈ అవినీతికి లొంగదలచలేదు. ఆడిట్ అధికారి తనకొక ట్యాబరీలైటు యివ్వమంటే ఇలాంటి చేష్టలావమని సమాధాన మిచ్చాం. దీంతో యిదివర కెన్నడూ అభ్యంతరాలులేని విషయాలపై అభ్యంతరాలు బయలుదేరాయి.

ఈతతంగమంతా గమనిస్తే, విదేశ గుత్త వ్యాపారులు, పెద్ద వ్యాపారులు. పరంకుశాధికారులు, లంచగొండి ఉద్యోగులు. పొగాకు రైతులకు, వారి శ్రేయస్సుకొరకు పనిచేసే కమిటీకి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని స్పష్టమవుతుంది.

### ప్రజాప్రభుత్వం యీ కుట్రదారులతోనా ఏకీభవించుట?

11-1-45న ప్రభుత్వ సలహాదారులైన శ్రీ కొంతి రామమూర్తిగారికి యీ పరిస్థితులు తెలియచేసి పరిష్కారం చేయమని కోరాను. ఆయన 14-1-45న తన ప్రత్యేక లేఖలో కమిటీకి గలిగిన యిబ్బందులను విచారిస్తున్నానీ, వీటిని సరిచేయాలని ఆశించుతున్నా

(మిగతా 11వ పేజీలో)



### పొగాకు మార్కెటింగ్ కమిటీ

(10వ పేజీ తరువాయి)

నని వ్రాశాడు. 1945 జూన్‌లో బాపట్లలో అగ్రికల్చరల్ డైరెక్టరు సముఖాన సహకార సంఘాలగూర్చి చర్చించారు. డైరెక్టరు చూపుతున్న అభ్యంతరాల త్రోసిపుచ్చారు. సహకార సంఘాన్ని యేర్పరిచి ఒక స్కీముతో పని చేస్తామని చెప్పారు. ఆతర్వాత మార్కెట్ కమిటీ సలహాపై సహకార శాఖ ఒక స్కీమును తయారు చేసింది. గుంటూరులో పొగాకు వ్యాపారుల సమావేశం ఆ స్కీమును చర్చించింది. కాని జూన్ నెలవరకు డైరెక్టరు యీ స్కీముకు తన ఆమోదాన్ని పంపలేదు. సంవత్సరం నుండి స్కీము నిలచిపోయింది.

ప్రజలచేత ఎన్నుకోబడ్డ మంత్రివర్గం అధికారంలోకి రాగానే రైతుల ప్రయోజనాల కొరకు మెక్కువ పాటుబడటానికి అవకాశముంటుందని కమిటీ ఆశించింది. కాని యే ఒక్కరో మినహా మిగతాకమిటీసభ్యులంతా యేకగ్రీవంగా, ఆమోదించిన సమస్యలపై ఖర్చుపెట్టిన డబ్బును కమిటీనుండి తిరిగి రాబట్టవలెనంటూ ఐ. యల్. టి. డి; బి. ఐ. టి. నేషనల్, మొదలగు కంపెనీలకు, పెద్ద పెద్ద వ్యాపారులకు మేలుచేసింది. రైతులను దెబ్బకొట్టింది. ఇకమీదట రైతులకు సేవచేసే అవకాశంలేకుండా రైతులను దొంగవ్యాపారులకు ఒప్పజెప్పింది.

### ప్రభుత్వ ఉత్తర్వు చట్టసమ్మతమేనా?

కమిటీ నిర్ణయాలు ఎలా చట్టసమ్మతమైనవో పైన స్పష్టంచేశాను. పై విషయాల్లో కమిటీపై సర్చార్జిచేయటానికి ప్రభుత్వానికి హక్కులేదు. కాని ప్రభుత్వం లీగల్ సలహానైనా తీసికోకుండా నిరంకుశ అధికారులు, లంచగొండి ఉద్యోగులు చెప్పిన దానికల్లా తలవూపి, పొగాకు రైతులకు హాని చేయటం, కమిటీకున్న హక్కుల భగ్నపరచటం, కనీస ప్రజాస్వామ్యసూత్రాలనుకూడా లెక్కచేయకపోవటం, శోచనీయం ఇది ప్రజలచేత యెన్నుకొనబడ్డ ప్రభుత్వం చేయవలసిన పనికాదు.

### ప్రజావ్యతిరేకధోరణి నరికట్టాలి

ఈ ధోరణి రైతాంగానికి రాష్ట్ర ప్రజలకు అనర్థదాయమైనది. ఇంగ్లీషువాళ్ళ కంపెనీలు, తాబేదారులైన నిరంకుశోద్యోగులూ చేస్తున్న కుట్రలకు ప్రజలచేత యెన్నుకోబడ్డ ప్రజా మంత్రివర్గంలోనుగాకుండా రైతాంగం చూడవలసివుంది. ప్రభుత్వంచేసిన సర్చార్జినిరద్దు చేయించుటకు కమిటీకి చాలా లీగల్ అవకాశాలున్నవి. కాని అసలుసమస్య అదికానేకాదు. ప్రజల ప్రభుత్వం, ప్రజలచే యెన్నుకోబడ్డ కమిటీమాట త్రోసిపుచ్చి, ఒక తెల్ల సామ్రాజ్యవాద వ్యాపారిమాటకు విలువనివ్వటం, రైతుల కత్యవసరములైన బేరన్ సామానులు, నారు విత్తనాలు, మార్కెట్ సమాచారాలను సేకరించటం కమిటీ బాధ్యతకాదని చట్టంలోవున్న అవకాశాలనుకూడ లేకుండాచేయటం ఎంత ప్రమాదకరమైన దోరణో రైతులూ. చిన్న వ్యాపారులూ గమనించాలి. మన మంత్రివర్గాన్ని ఇట్టిప్రమాదకరమైన మార్గాలనుండి కాపాడుటకై ఆందోళన చేయవలసిందనికూడ విజ్ఞప్తి చేస్తున్నాను.

నైజాంలో

# ప్రజలప్రాణాలకు రక్షణలేదు

## తిమ్మాపురం రైతుల వీరోచిత ప్రతిఘటన


నైజాం రాష్ట్రములోని ప్రతి గ్రామములోవలె తిమ్మాపురములో పెత్తందార్ల దోపిడి, వెట్టిచాకిరి, లంచాలచే ప్రజలు. మొదటనుండి బాధపడుచుండిరి. మాల్ పటేలు ప్రతి లెవీ ధాన్యం వ్రాయుటకు ప్రతి సంవత్సరమూ, ప్రతి రైతు నుండీ 50/ రూపాయలు తీసుకొని వేల రూపాయలు. సంపాదించాడు. ఇతర మామూళ్ళకు ఏమీకొదవలేదు. ఇతర గ్రామాల రైతులు ఆంధ్ర మహాసభలోచేరి; అక్రమాలను ఎదిరించి స్వతంత్రముగా బ్రతుకుతున్నది చూచి ఈ తిమ్మాపుర గ్రామ ప్రజలుకూడ 6 మాసాలక్రింద ఆంధ్ర మహాసభ కమిటీ పెట్టుకొని. కానూన్‌కు విరుద్ధంగానున్న అన్ని అక్రమ పన్నులు, వెట్టిచాకిరి. లంచాలు. మొదలగునవిఎగబెట్టారు. 100మందితో సూర్యాపేటకు ఆకలి యాత్ర నునడిపారు. తహశీలుదారుతో మాట్లాడి అవసరమైన ధాన్యం గ్రామానికి సప్లయి చేయించుకున్నారు. రైతుల్లోవచ్చిన ఈ చైతన్యాన్ని చూచి, లంచగొండి ఉద్యోగులు తమ ఆటలు యిక సాగవనుకొన్నారు ప్రభుత్వ దమన నీతికితోడు ఈ గ్రామ రైతులను అణచుటకిదే అదునని తలచారు.

మాల్ పటేలు ఈ సంవత్సరము కూడ ఎప్పటివలెనే వెట్టికి వేటలు ఇవ్వవలసిందిగాగొల్లలనుబలాత్కరించాడు. లొంగని కారణమున ఒక రౌడీకి కల్లు. సారాయిలను పోయించి తుపాకినిచ్చి గొల్లలవైపు వుసికొల్పాడు. గొల్లలు తుపాకినిలాగి వానికిబుద్ధిచెప్పి పంపారు. మరునాడు 7-1-46 నాడు మాల్‌పటేలు రౌడీ, ఇద్దరు తుంగతుర్తి పోలీసు స్టేషనుకు వెళ్ళి. సంఘమువాళ్లు కొట్టారనీ, ఆ రౌడీ భార్య మెళ్ళోని నాను, వెండి వడ్డాణం దొంగిలించారనీ, గ్రామ కమిటీ ముఖ్య కార్యకర్తలపై రిపోర్టుయిచ్చారు

ఆ మరునాడు 30 రిజర్వు పోలీసులు వచ్చి పదిమంది ముఖ్య కార్యకర్తలపై దొంగతనం కేసుమోపి 7 గురిని అరెస్టు చేశారు. పోలీసులు జీడి గోపయ్య. జీడి వీరయ్య. చాకలియెల్లయ్య. వెంకటరామ నరసయ్య. వుప్పు సత్తయ్యలను విపరీతంగా కొట్టారు. 60 ఏండ్ల ముసలి వానిని కూడ విడువలేదు. గ్రామములో హడాహుడి చేస్తూ తిరిగారు, పడుచు స్త్రీలు ఎక్కడవున్నారని పిచ్చికూతలు పెట్టుతూ ప్రజలను భయభ్రాంతులు చేశారు. ఇండ్లపై దాడులతోనూ, అరాచకంతోనూ ప్రజల మానప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది.

ఈ రిజర్వు పోలీసుల దుర్మార్గాలకు అసమ్మతి సూచకముగా 10-1-46 తేదీన పాత సూర్యాపేట, నెమలికల్లు, బాలెంల, పాతర్లపాడు, ఇస్తార్లపురం, యెలకపల్లి కుంచమర్తి గ్రామాల ప్రజలు దాదాపు వెయ్యిమంది తిమ్మాపురముదచ్చి ప్రదర్శనం చేశారు. రిజర్వు పోలీసులు అడ్డంవచ్చి తుపాకులు కాలుస్తామని— బెదిరించారు. కాని ప్రజలు వెనక్కి పోలేదు.

### ఆంధ్ర మహాసభ కార్యదర్శి ఖండన



హైదరాబాద్, అక్టో 14

ఆంధ్రమహాసభ కార్యదర్శి రావి నారాయణరెడ్డిగారిలా ప్రకటిస్తున్నారు:

"జమీందారీ దౌర్జన్య వ్యతిరేక పోరాటాన్ని అణచుటకు రిజర్వు పోలీసులను ఉపయోగించడం సర్వసామాన్యమైపోయింది. వీటిలో తిమ్మాపురం కథ నూతనమైంది.

ఈ తిమ్మాపురం గ్రామంలో ఆంధ్ర మహాసభ అక్రమపసూళ్ళు, వెట్టి మొదలగునవి ఆపింది. వీటిని స్థానిక పటేలు, పట్వారీలు చేస్తుండేవారు. అందుచేత స్థానిక గొల్లలు దసరా అక్రమ వసూళ్ళుగా ఇచ్చే 15 గొర్రెలను ఈ ఏడు యివ్వ నిరాకరించారు. మాలి పటేలు, తన ఏజంటును తుపాకితో గొల్లలను బెదరించి గొర్రెలను వసూలుచేయ పంపించాడు. ఇతడు గొల్లలను బాధింపజూడగా ఇతరరైతులుఅడ్డుపడి తుపాకిని లాగుకొని వానిని పరుగెత్తింపజేసారు.

ఆటుతర్వాత మాలి పటేలు, అతని ఏజంటు సమీపగ్రామం వెళ్ళి 'దొంగతనము. సర్ధా' ఒక అబద్ధపు కేసును బనాయించారు. అమీను 9మంది పోలీసు జవాన్లతో వచ్చాడు. రెండో రోజు ఈ గ్రామము 30 మంది రిజర్వు పోలీసు వచ్చింది. 7 గురిని అరెస్టు చేశారు. పోలీసు 'లాకపు' లో కొందరిని క్రూరంగా కొట్టారు. మరునాడు ఒక వేయిమంది అరెస్టు చేయబడిన నాయకులను కొట్టినందులకు వ్యతిరేకముగా ప్రదర్శనము జరిపారు.

కానిరిజర్వుపోలీసులు మాలీపటేలుచే ప్రేరేపితులై అతడు సప్లయి చేసిన సారాయి తాగుచు, గొర్రెల తింటు, గ్రామ ప్రజలపైన తమ దౌర్జన్యకాండను జరిపారు. ప్రజలను పిల్ల, పెద్ద, స్త్రీ పురుష భేదము లేకుండ బాదారు. ఒక 60 ఏండ్ల ముదుసలిని కూడ కొట్టారు. స్త్రీలను అవమాన పరుచుటకుకూడ చూస్తున్నారు.

ఇంకరిజర్వుపోలీసుదళాన్ని తెప్పించి పరిసర గ్రామాల ప్రజలను బాధించున్నారని రిపోర్టులు వస్తున్నవి. ప్రజలు అక్రమ పన్నులను యివ్వ నిరాకరించితే దౌర్జన్యపరులకు సహాయముగా ప్రజలను బాధించుటకు రిజర్వు పోలీసులు ఉపయోగింప బడుతున్నారు.

ప్రజల ధన మానప్రాణ రక్షణలకు ఈప్రాంతములో చట్టభద్రతలు లేకుండా పోయినవి.

పరిస్థితులు ఇలాగనే కొనసాగించినట్లయితే, ముందు ఏమైన సంఘటనలు జరిగినచో ప్రభుత్వమే బాధ్యత వహించవలసియుంటుంది.

ఈ హింసాకాండకు వ్యతిరేకముగా. ప్రజలందరు ఏకకంఠంతో నిరసించుతూ. నల్లగొండజిల్లాప్రజల వీరోచితప్రతిఘటనను బలపర్చవలెనని విజ్ఞప్తిచేస్తున్నాను.

## జటప్రోలుసంస్థానంలో పోలీసుల క్రూరచర్యలు

జటప్రోలు సంస్థానాధీశుడగు శ్రీ రాజా వెంకట జగన్నాధరావుగారి నిర్బంధవిధానము రోజు రోజుకు మహాభయంకర రూపము దాల్చుచున్నది. సాగరు కర్నూలు తాలూకాలో వున్న ముష్టిపల్లిప, పెదమూళ్ళపిల్లి అను గ్రామ రైతుల సిరస్థాయుభులను ఆక్రమించుకొనుటకు అక్కడి మఖ్తేదారులు విశ్వ ప్రయత్నముచేస్తున్నారు. తమ భూముల కొరకై రైతులు రెండు సంవత్సరముల నుంచి పోరాటం సాగించుతున్నారు. రైతులమధ్య మఖ్తేదారుల మధ్య ఒక పెద్దఘర్షణ జరిగింది. ఈ ఘర్షణకు మహబూబుజిల్లా మఖ్తేదారులు, భూస్వాములు, జాగీరుదారులు భయకంపితులై ఎట్లయిన ఈ రైతు సంఘము ను విచ్ఛినం చేయవలెనని. లేనిచో నిరంకుశత్వము బయట పడుననీ రైతులపై దౌర్జన్యాలు చేయుటకు పెద కొత్తపల్లి స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టరును పురికొల్పారు.

పెద కొత్తపల్లి సబుఇనస్పెక్టరు 20 మంది పోలీసుదళాన్ని, 400 మాదిగవారిని వెట్టిగా తీసుకవెళ్ళి రైతులను మహాత్క్యారంగా హింసించినారు. పైగా తమనే రైతులు కొట్టినారనీ, మాకు గాయాలు తగిలాయనీ, వంటినిండా రాతి దెబ్బలతోనూ, గాజులతోనూ గీసుకొని లింగాల హాస్పిటలుకు పోయి రుజువు చేయించుకున్నారు.

ఇవ్విధముగా రైతులపైన తప్పుడు కేసులుపెట్టి రైతులను అరెస్టుచేశారు. రెండహోరాత్రులు తిండిలేకుండా వుంచారు. మూడవనాడు బజారుకు తీసుకపోయి రేషనింగుషాపు దగ్గర చేటలో జొన్నలు కొలిపించి నెత్తిన పెట్టించుకొచ్చారు. కట్టెలకంపెనీకి తీసుకపోయి కట్టెలుకొట్టించారు. కుమ్మరి వాడనుంచి కుండలు తెప్పించారు. ఇవ్విధముగా యింకా ఎన్నియో రాక్షసకృత్యాలు చేశారు. చివరకు రైతులకు పనిచేయుచున్న చాకలి మంగలి కుమ్మరి మాదిగ మొదలగు వారిని బందుచేయించారు. రైతులు వందలకువందలుపెట్టి గాసాలు వుంచుకున్నగాస గాండ్లకుమీరు గాసాలు చేయవద్దు; తీసుకున్న డబ్బు యివ్వవద్దు అని గాసగాండ్లను యెగబెట్టించారు.

# ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ దినోత్సవం

## అక్టోబరు 31 జయప్రదంగా జరపాలి

### పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారి హెచ్చరిక

(కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్)

**1920** అక్టోబరు 31 వ తేదీన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్వరూపం దాల్చింది. కాంగ్రెస్ లీగు నాయకుల ప్రోత్సాహంతో యీ మహాసంస్థ నెలకొల్పబడింది. నాటి నుండి నేటివరకు ఐక్యకార్మికోద్యమాన్ని నడుపుతూ వచ్చింది. అనేక ఒడుదుడుకులు దాటి, నేటికి ఇది ఏకైక కార్మిక వర్గ సంస్థగా గుర్తించబడింది. కార్మికోద్యమాన్ని విచ్ఛిన్నం చేయ సంకల్పంతో ఏర్పడ్డ ఇండియన్ లేబర్ ఫెడరేషన్ (రాయిస్టులది) నిజస్వరూపం బహిర్గతమై, భారత కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించే అర్హత దానికి లేదని కేంద్రప్రభుత్వం కూడ అంగీకరించవలసివచ్చింది. ఎన్నడూ లేనంత బలంతో, నేటికి అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ షుమారు 7 లక్షల సభ్యత్వంతో అలరారుచున్నది.

### ఆంధ్రరాష్ట్రంలో సభ్యత్వం 55,008

మన ఆంధ్రదేశంలో కూడ కార్మికోద్యమం నలుమూలలా వ్యాప్తి చెందింది. అన్ని పరిశ్రమలలోను, అన్ని పట్టణాల్లోను నిర్మాణయుతంగా కార్మికోద్యమం అభివృద్ధి చెందుచున్నది. నేటికి 55 వేలమంది ఆంధ్రరాష్ట్రంలోని ట్రేడ్‌యూనియన్స్‌లో సభ్యులుగా చేరియున్నారు.

ఈ 25 సంవత్సరాలలోను కార్మికవర్గం అనేక పోరాటాలు జరిపింది. యజమానుల కుతంత్రాలను, ప్రభుత నిర్బంధవిధానమును ఎదుర్కొంటు కార్మికోద్యమం ముందుకు నడిచింది.

ఈ సంవత్సరంలో 9 లక్షలమంది రైల్వేకార్మికులు రైల్వే బోర్డుయొక్క సవాలును యెదుర్కొనవలసి వచ్చింది. దాదాపు 3 లక్షలమంది కార్మికులను తగ్గింపుచేయ నిశ్చయించిన రైల్వేబోర్డు నిర్ణయాన్ని రైల్వేకార్మికులు ధరలపెరుగుదల ననుసరించి కరువు భత్యం పెంచాలని, జీవితావసరాలకు సరిపోవు జీతాలు నిర్ణయింపబడాలని, రైల్వేకార్మికులు సమ్మెనోటీసుయిచ్చారు. తుట్టతుదకు రైల్వేబోర్డు మెట్టుదిగి తగ్గింపుకేసన్నకూడ వేయ నిరాకరించింది. కాని, కార్మికుల సంఘటనశక్తికి రైల్వే బోర్డులొంగక తప్పిందికాదు. రైల్వే కార్మికుల కోర్కెలలో చాలాభాగం అడ్జుడికేషన్ బోర్డుకు వదలుటకు అంగీకరించింది.

### ఎస్. ఐ. రైల్వేకార్మికుల సమ్మె

కాని రైల్వే కార్మికుల సంఘటనాశక్తిని నిర్వీర్యం చేయడానికని, రైల్వే బోర్డుకార్మికులపై దాడి సాగించి సంఘ విచ్ఛిన్నతకు కృషి చేస్తున్నది. దేశమంతటా అత్యధికసంఖ్యాకులైన రైల్వే కార్మికులు సమ్మె చేయవలసి వచ్చింది. రైల్వే బోర్డు విధానంయొక్క ఫలితమే ఇటీవల జరిగిన ఎస్. ఐ. రైల్వే కార్మికుల సమ్మె. దాదాపు నెలరోజులపాటు 40 వేలమంది రైల్వే కార్మికులు పోరు సల్పారు. ఈ సమ్మెకు మూలకారణం యస్. ఐ. రైల్వే మేనేజరు రైనాల్డ్సు తన యిష్టంవచ్చినట్లు కార్మికులను బర్తరపు చేయటానికని. అమలులోనున్న రూలు—బర్తరఫు చేసేముందు విచారణ చెయ్యాలనే కార్మికుల హక్కు—తొలగించారు.

కార్మికులు సమ్మెచేయక తప్పిందికాదు. కాని దురదృష్టవశాత్తు, అధికారంలో ఉన్న కాంగ్రెస్ మంత్రివర్గం కార్మికులకు వ్యతిరేకంగా రైల్వేమేనేజరుకు పోలీసు మద్దత్తుయిచ్చింది. 40 వేలమందిసమ్మెను అణచటానికని 1500 మందిని అరస్టు చేసింది. రైల్వేయూనియన్ నాయకులు, శాసనసభా సభ్యులగు నంబియార్ గారిని అరెస్టుచేసింది.

గోల్డెన్‌రాకులో దయ్యరు రాజ్యాన్ని నెలకొల్పారు. కేంద్రప్రభుత్వంలో రైల్వే సభ్యుడుగావున్న అసఫాలిగారు కూడా రైల్వే మేనేజరును సమర్థించుచూ వచ్చారేగాని, కార్మికుల న్యాయమైన కోర్కెలను గుర్తించలేదు. కాని యస్. ఐ. రైల్వే కార్మికులు చరిత్రాత్మకమైన పోరుసల్పారు. కార్మికోద్యమ వెల్లువను ఎవరూ ఆపజాలరని యస్. ఐ. రైల్వే సమ్మె ఋజువుచేసింది.

### సమ్మెల వెల్లువ

రైల్వే కార్మికుల పోరాట ప్రచారం నలుమూలలా వ్యాపించింది. దేశవ్యాపితంగా పోస్టల్ పనివారలు సమ్మెచేశారు. వారి సమ్మెను బలపరుచుతూ, సానుభూతి సమ్మెలు జరిగినాయి. బట్టలమిల్లు కార్మికులు, కొన్నిచోట్ల సమ్మెలు చేశారు. తదితరులు సమ్మెకు పుద్యుక్తులగుచున్నారు. బ్యాంకు గుమాస్తాలు, మిలిటరీ గుమాస్తాలు, చివరకు పోలీసులు కూడ బీహారులో సమ్మె చేయటం చూచాం. మద్రాసు రాష్ట్రంలో కొన్నిచోట్ల జీతాలు తీసుకోనటం మానివేసి తమ అసమ్మతిని వెలిబుచ్చారు.

ఈపోరాటాలలో ఆంధ్ర కార్మికులు యేమాత్రం వెనుకబడిలేరు. రాజమండ్రి జట్లకార్మికులు దాదాపు నెలరోజులు వీరోచిత పోరాటం సల్పారు. నూరునుండదాక ప్రభుత్వ నిర్బంధ విధానానికి గురైనారు. పోర్టరు కార్మికులు సమ్మె చేశారు.

### గుంటూరు కార్మికనాయకులపై ఖూనీకేసు

గుంటూరు పొగాకు కార్మికుల సమ్మె కొంతమంది కృత్రిమ దేశభక్తుల ప్రతిఘటనను కూడా యెదిర్చి విజయవంతంగా సాగించారు. ఈ సందర్భంలోనే, కార్మిక నాయకులగు కట్టయ్య, నాగయ్య మొదలగువారిపై ఖూనీకేసు కూడా మోపబడింది. జిల్లాకోర్టులో 10 సం॥ల కఠినశిక్ష విధింపబడింది. వారివిడుదలకై గుంటూరు కార్మిక వర్గమంతా సమ్మెలు జరిపారు. వీరిపై ఈశిక్ష రద్దుచేసేంతవరకు ఆంధ్ర కార్మికులు నిద్రపోరాదు.

గుంటూరు, యేలూరు లందు జ్యూటు మిల్లు కార్మికులు సమ్మెలు చేస్తూ తమ కోర్కెలను సాధించుకొనగల్గారు. బలమైన సంఘాలను నిర్మించుకున్నారు. రైసుమిల్లు కార్మికులు దాదాపుఅన్నిచోట్ల సంఘటితంచేయబడ్డారు.

### మున్సిపల్ కార్మికుల సమ్మె


ప్రధానంగా మున్సిపల్ కార్మికులు జీతాలకై పోరాటం సాగించి దాదాపు నెలరోజులవరకూ సమ్మెచేశారు. ప్రజలు అంగీకరించారు, కార్మికుల కోర్కెలు న్యాయమైనవని. కానిప్రభుత్వం న్యాయమైన కోర్కెలను పాటించుటకు మారుగా పెట్టుబడిదారులదృక్పథాన్ని అవలంబించి తీవ్రనిర్బంధ విధానాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెసు ప్రభుత్వమే ఈ దృక్పథాన్ని అవలంబించుట ఆశ్చర్యం కలిగించక మానదు.

### కార్మికులపై నిర్బంధ విధానం

రాజమండ్రి, యేలూరు, బెజవాడ పట్టణాలలో కార్మికులపై లాఠీఛార్జి చేయించింది. బెజవాడలో 700 మంది మునిసిపల్ కార్మికుల సమ్మెను భగ్నం చేయటానికని దాదాపు 60 మంది కార్మికులపై కేసులు బనాయించింది. రాజమండ్రి, యేలూరు తదితర ప్రాంతాలలో కూడ యిదేవిధంగా కేసులు బనాయించి, జైళ్లకు పంపటం జుల్మానాలు వేయడం చేసింది. మున్సిపల్ అధికారులు రౌడీలను ప్రయోగించి కార్మికులపై దౌర్జన్యం చేయించారు. కాని కార్మికులు తమ కార్యదీక్షను విడనాడలేదు. తీవ్రమైన పోరుసల్పారు. నాన్‌గెజెటెడ్ ఆఫీసర్లు కూడా సమ్మెకు పుద్యుక్తులు కావలసివచ్చింది.

### సమ్మెలను నిషేధించే చట్టాలు

ఈ రోజున కార్మికవర్గం జీవితావసరాలను తీర్చే సరసమైన జీతాలకై పోరుతున్నది. కాని దేశంలో ప్రజా ప్రభుత్వాలు అన్ని రాష్ట్రాలలోను ఏర్పడ్డాయి. అడ్వైజర్ల ప్రభుత్వాలు అంతరించిపోయినాయి. కేంద్రంలో కూడ ప్రజానాయకులు పదవులలో వున్నారు. ప్రజాప్రభుత్వాలు తమకు మద్దతుగా వుంటాయని కార్మికులు ఆశించారు. కాని నేటి



ప్రజాప్రభుత్వాలు అడ్వైజర్ల పాలనలోనే నడుస్తున్నాయి. కార్మికవర్గ కోర్కెలను మన్నించి శాసనాలుచేయటానికి మారుగా కార్మికుల ఏకైక ఆయుధమగు సమ్మెను నిషేధించు తున్నారు. బొంబాయిలో యిలాంటి బిల్లు శాసనం కాబోతున్నది. మద్రాసులో అడ్వైజర్ల కార్మిక విధానం శాసనం చేయబడింది. కార్మిక వర్గ పోరాటాలను ప్రతిఘటించుటకు పోలీసులకు సర్వాధికారాలు యివ్వబడ్డాయి.

కార్మికోద్యమం బ్రిటిష్ ఇండియాలోనే కాకుండా సంస్థానములందుకూడా వెల్లివిరిసింది. నైజాం, కొచ్చిన్, తిరువాన్కూరు సంస్థానాలందు అనేక వీరోచితపోరాటాలు సల్పింది కార్మికవర్గం. నైజాంసంస్థానంలోని ఆంధ్రకార్మికులు బలిష్టమైన కార్మికోద్యమాన్ని నిర్మించి అనేక విజయాలను సాధించారు. తెలంగాణాలోని ఆంధ్రకార్మికుల పోరాటాలను బ్రిటిష్ ఇండియాలోని ఆంధ్రకార్మికులు అన్నివిధాల బలపరచుతారు.

కార్మికవర్గం "ట్రేడ్ యూనియన్ దినోత్సవం" నాడు, కాంగ్రెసు మంత్రివర్గం ప్రస్తుతం అమలు జరుపుతున్న పాలసీని విడనాడవలెనని, కార్మికుల జీవితావసరాలకు సరిపోవు వేతనాలను గ్యారంటీచేస్తూ శాసనాలు తీసుకొనిరావాలని, అంతవరకు పెట్టుబడిదారీ వర్గానికి పోలీసులు మద్దతు చేయకుండా వుండాలనికూడా తీవ్రమైన ఆందోళన జరపాలి.

అక్టోబరు 31వ తేదీన ప్రదర్శనాలు, పూరేగింపులు, బహిరంగ సభలు జరిపి, అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ దినోత్సవం జయప్రదంగా జరపాలని ఆంధ్ర కార్మికులను కోరుతున్నాను

## తగ్గింపు ధరలు

★

ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉంచడానికై ఈక్రింది ముఖ్యమైన ప్రచురణలను ప్రజాశక్తి బుక్‌డిపో అన్నింటిలోనూ తగ్గింపు ధరలకు అమ్ముతున్నాం.

| | | | |
|---|---|---|---|
| 1 | అంతిమపోరాటానికిఐక్యమవుదాం | | 0- 1-0 |
| 2 | కాంగ్రెసుకార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు | 1 భా | 0- 8-0 |
| 3 | ,, | 2 భా | 0-12-0 |
| 4 | ,, | 3 భా | 0-12-0 |
| 5 | అందరికీ తిండి | | 0- 4-0 |
| 6 | అందరికీ ఉద్యోగాలు | | 0- 4-0 |
| 7 | మేము కాంగ్రెసులో ఎందుకు చేరలేదు? | | 0- 4-0 |
| 8 | అంతిమపోరాటానికి కదలిరండు | | 0-10-0 |
| 9 | సిక్కు మాతృభూమి | | 0- 4-0 |
| | | మొత్తం ధర | 3-11-0 |
| | పెట్టుకేసారి కొనువారికి ధర | | 2- 0-0 |

★ ★

**ప్రజాశక్తి ప్రచురణాలయం**

మొగల్రాజపురం, బెజవాడ



# రెండేండ్లలో పూర్తికావలసిన రైలుమార్గం 5 నెలల్లో పూర్తి!

## యుగోస్లావియా యువకుల దేశభక్తి

"మాతృదేశాన్నుండి శత్రుమూకల పారదోలి దేశానికి విముక్తిని సాధించటం యిప్పటికి పూర్తి అయింది. యుద్ధకాలంలో శిథిలమైన వాటినన్నిటిని పునర్నిర్మాణం చేయుట, నూతన దేశాన్ని సృష్టించటం యికముందు ప్రధాన కార్యక్రమం" అంటూ ఉపన్యసించాడు మార్షల్ టిటో. దేశ నాయకుని పిలుపును వెంటనే అందుకొన్నది యుగోస్లావియా యువజన సమితియొక్క కేంద్రకమిటీ. దేశ పునర్నిర్మాణంలో తమ కర్తవ్యంగా 92 కిలోమీటర్ల రైలుమార్గాన్ని నిర్మింప నిశ్చయించుకున్నారు. బ్రెకోనుంచి బ్రినోవిక్ వరకు వెళ్లే యీ రైలుమార్గాన్ని నిర్మించటం, పెద్దపెద్ద బొగ్గుగనులు త్రవ్వటానికి, పరిశ్రమలను అభివృద్ధి చెయ్యటానికి ఎంతో అవకాశం కలుగుతుంది.

ఇలాంటి దేశ నిర్మాణానికి తోడ్పడే పనికి పూనుకోవటం యుగోస్లావియా యువజనులకే మొదటిపర్యాయం. దేశంలోనెప్పు ఇంజనీరు అని పేరుగాంచిన ఒక ఇంజనీరు, యువకులు గనుక యీ రైలుమార్గ నిర్మాణం 2 సంవత్సరములలో పూర్తిచేయ గలిగితే చాల గొప్పవిషయం. దేశములో ఎల్లా ప్రప్రథమ బహుమతి వారికే యివ్వబడాలన్నాడు. రైల్వే చీఫ్ ఇంజనీరు దీనికి ప్లానువెయ్యటానికే ఒక సంవత్సరం, నిర్మాణానికిరెండుసంవత్సరాలు పడుతుందన్నాడు. 1939 సం॥లో అనాడున్న ప్రభుత్వం యీ రైలుమార్గాన్ని నిర్మించటానికి 700 మిలియన్ల దినార్లు ఖర్చువుతుందని, 2 సం॥ టైము పట్టుతుందనీ అంచనావేసింది. కాని యువకులు దీన్ని 200 దినార్లు ఖర్చులలో 5 మాసాలలో పూర్తిచేయ నిశ్చయించుకున్నారు.

ఇది ఏమాత్రం అతిశయోక్తికాదని యీ క్రింది విషయం ఋజువుచేస్తుంది. మే 1 వ తేదీన పని ప్రారంభించుదామనుకొని ఆనాటికి 12000 వాలంటీర్లకోసం పిలుపు యిచ్చారు. ఈ పిలుపు నందుకొని 15-25 సం॥ మధ్యవయస్సుగల యువకులు 14000 మంది మే 1 తేదీకల్లా వచ్చిచేరారు. ఇంతేగాక జూలై 1వ తేదీనాటికి, వేసవి సెలవులను త్యాగంజేసి మరి 10,000 మంది వచ్చి కలిశారు. మొత్తం 24,000 మంది అంటే పిలిచినదానికి రెట్టింపుసంఖ్యలో వాలంటీర్లు వచ్చారు. మిట్ట మధ్యాహ్న సమయములో పనిచేయటమంటే సామాన్య విషయంకాదు, అయినాయీకష్టాన్ని ఏమీలెక్కచేయక, అమితోత్సాహంతో, పాటలు పాడుతూ పనిజేస్తున్నారు. 250 మంది యువకులు ఒక్కొక్క బ్రిగేడ్ చొప్పున, బ్రిగేడ్లుగా ఏర్పడ్డారు. ప్రతి బ్రిగేడ్‌కు, దానిలో సభ్యులంతా కలిసి, ఒక జనరల్ కమాండరును, ఆహార కమాండరును, కల్చరల్ కమాండరును ఎన్నుకున్నారు. ప్రతి బ్రిగేడుకు ఒక భోజనశాల, చిన్న వైద్యశాల ఏర్పాటుచేయబడినవి. వీరు రోజుకు 6 గంటల చొప్పున వారానికి 6 రోజులు పనిచేస్తున్నారు. మిగతా 6 గంటలు ఆటలు, పాటలు, చదువు, రాజకీయచర్చల్లో కాలం గడుపుతారు. బ్రిగేడ్ బ్రిగేడ్ మధ్య పోటిపడి, సోషలిస్టుపోటీతో పనిజేస్తారు. టెక్నికల్ పరికరాలు లేకుండానే, పనిసాగిస్తున్నారు. వీరి పనికి కావలసిన ప్లాను ఇంజనీర్లు తయారుచేసి యిచ్చే వ్యవధి లేకుండా గూడ ఒక్కొక్కసారి పనిపూర్తిజేస్తున్నారు.

యుగోస్లావియా ప్రజలే గాకుండా, ఇతర దేశాలనుంచి వచ్చినవారుగూడ ఈ ప్రదేశాన్ని తప్పక సందర్శించి పోతున్నారు. ప్రజలంతా సంతోషతరంగాలుగా కాశీయాత్రకు వెళ్ళినట్టుగా వెళ్ళుతున్నారు. ఈ ప్రదేశాన్ని చూడకపోవటమే, పాపంగా పరిగణిస్తున్నారు. ఈ రైలుమార్గపు నిర్మాణమంతా అక్టోబరు నెలలోనా పూర్తి అవుతుందని అనుకుంటున్నారు. ఈపని పూర్తిఅయిన తర్వాత ఇంకా అనేక ప్రాజెక్టులు చేపట్టాలని ప్లానువేసుకున్నారు. ఈకార్యక్రమంలో యుగోస్లావియా యువకులకు సహాయపడుటకుగాను, అంతర్జాతీయ యువజనసంఘం నిర్ణయించుకుని, మిగతాదేశాల యువకులను గూడ కొంతమంది యువకవాలంటీర్లనుపంపి అంతర్జాతీయ యువజన బ్రిగేడ్‌ను ఏర్పరచాలనుకుంది. ఆవిధంగా వెళ్ళే యువకులు కనీసం ఒకనెలరోజు లుండేటట్లయితేనే వెళ్ళాలి. ఇప్పటికే ఆల్బేనియా, బల్గేరియా, జెకోస్లోవేకియా, ఫ్రాన్సు, పోలండ్, రుమేనియా యువజన వాలంటీర్లు అక్కడ పని చేస్తున్నారు.

## ఆంధ్రరాష్ట్రం

(6 వ పేజీ తరువాయి)

ప్రకారం నైజాం నవాబు చిరస్థాయిగా ఉంటాడట. మన ఆంధ్ర ప్రజలలో మూడోవంతుమంది, ఆంధ్ర దేశంలో దాదాపు సగభాగం నైజాం నిరంకుశత్వం క్రింద బానిసత్వంలోనే ఉంటుంది.

కడకు ఆంధ్రుల, తమిళుల మధ్య పరస్పరఅనుమానాలు, వైషమ్యాలుపెంచి చీల్చడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కొంతమంది స్వలాభ పరాయణులు చేసే ప్రయత్నాలను భగ్నం గావించాలంటే, మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలను వేరే రాష్ట్రంగా ఏర్పాటు చేయడం అవసరం. కాని బి. యన్. రావు నివేదిక అట్టిప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని కూడ త్రోసిపుచ్చుతుంది. ఒక ప్రత్యేక ఉపరాష్ట్రం ఇచ్చామంటూ, ప్రజలను మభ్యపెట్టడానికి చూస్తున్నారు. వీరి ఉపరాష్ట్ర ప్రణాళిక మద్రాసురాష్ట్రంలోని వివిధ జాతులలో ఇప్పటికన్న మరింత ఎక్కువ భేదాలు కల్పించడానికే తోడ్పడుతుంది. అంటే సామ్రాజ్యవాదులు తమ పెత్తనాన్ని సాగించడానికి చేసే కొత్త కుటిలయత్నాలే బి. ఎన్. రావు నివేదిక.

కాని నేడు ఆంధ్రప్రజలు బి. ఎన్. రావు నివేదికను కాలదన్నుతారు. మద్రాసులోని తెలుగు జిల్లాలను వేరే రాష్ట్రంగా చేసినా సంతృప్తిపడరు. తమ సమస్యలన్నిటిని పరిష్కరించుకోవాలంటే ఇంగ్లీషు ప్రభుత్వం పోవాలి. దాని సైన్యాలు, ఇంగ్లీషు గవర్నర్లు, ఉద్యోగస్తులు దేశాన్ని వదలిపోవాలి. ఇంగ్లీషు ప్రభుత్వానికి కాపలాదారైన నైజాం నవాబు పెత్తనం పోవాలి. నైజాం ప్రజలు, తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలి. ఆ రోజు మూడుకోట్ల ఆంధ్రులం ఒకటియై స్వతంత్ర భరత ఖండంలో స్వతంత్ర విశాలాంధ్రను ఏర్పరచుకుంటాం.

జమీందారీ విధానాన్ని రద్దుచేసి రైతుకూలీలకు పొలం ప్రజల కందరికీ తిండి సాధిస్తాం. పరిశ్రమలను ప్రభుత్వాధీనం క్రింద ప్రజల కుపయోగపడేటట్లు నడుపుతాం. ప్రజలందరికీ పనులు, సౌఖ్య జీవనానికి కావలసిన జీతాలు, విద్యావిజ్ఞానాలు, ఆరోగ్య సిరిసంపదలు కలుగజేస్తాం. విశాలాంధ్రలో ప్రజారాజ్యాన్ని నెలకొల్పి మన విజయాలను వేయి కండ్లతో కాపాడుకుంటాం.

(ఈ వ్యాసం రెండవభాగం వచ్చే సంచికలో ప్రచురింపబడుతుంది.)

# ఆంగ్‌సాన్ కార్మికవ్యతిరేకత

## సామ్రాజ్యవాదుల ఎత్తులు ఫలించాయి

( మా విలేఖరి )

రంగూన్, అక్టోబరు 13

● యుద్ధానికిముందు బర్మాలో విదేశీయుల పెట్టుబడులు రు. 66 కోట్లకు మించి వుండేవి. వానిలో నూటికి 96 వంతులు బ్రిటిష్‌వాళ్ళవి.

● 1937 నాటికి బర్మా నూనెగనుల నుంచి 30 లక్షల టన్నుల పెట్రోలు ఏటా తీయబడుతూంది. ఇదంతా 3 బ్రిటిష్ కంపెనీల సొత్తు.

● వెండి, సీసపుగనులలో 'బందూయిన్ గనులు' (బర్మాలోవి) ప్రపంచానికల్లా పెద్ద గనులు. బర్మా కార్పొరేషన్ అనే బ్రిటిష్ కంపెనీ సొత్తు ఇవి.

● బర్మా జాతీయ సంపదలోకల్లా అయిదోవంతు అక్కడున్న అడవులే. ఈ అడవులన్నీ 5 బ్రిటిష్ కంపెనీలవి.

● 'స్టీల్ బ్రదర్సు' అనే బ్రిటిష్ కంపెనీకి పూర్వం దేశంలో కలప అడితీలు, నూనె, సిమెంటు, బియ్యం, రబ్బరు వ్యాపారాలమీద ఏటా 50లక్షలరూపాయల ఆదాయంగడించేది

★

అఖిల బర్మా ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ పిలుపుపై నేటినుంచి బర్మా అంతటా కార్మికుల సార్వజనిక సమ్మె ప్రారంభమయింది. జీతాలు, ఎలవెన్సులు, సెలవులు మొదలగు వానిపై యజమానులు కార్మికుల కోర్కెలకు అంగీకరించక పోవడమే సమ్మెకు కారణం.

### బ్రిటిష్ యజమానులపై పోరాటం

ఈ సమ్మె ఫలితంగా రేవులు, ట్రాన్సుపోర్టు, నూనె గనులు, రంపపు మిల్లులు మొదలయిన బ్రిటిష్ యజమాల చేతులలోని పరిశ్రమలన్నీ స్తంభించిపోతాయి. విదేశీయ పెట్టుబడిదారులతోడి ఈపోరాటంలో జాతీయవాదులంతా తోడ్పడాలని ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు విజ్ఞప్తి చేసింది.

### సోషలిస్టుల పంథా

సోషలిస్టుపార్టీ సమ్మెను వ్యతిరేకిస్తూంది. జాతీయవాద పత్రికలన్నీ తాత్కాలిక ప్రభుత్వాన్ని పడగొట్టడానికై కమ్యూనిస్టులు సమ్మె చేయిస్తున్నారని తీవ్ర ప్రచారం ప్రారంభించాయి. ప్రజాఅవసర శాఖలలో సమ్మెలు కూడదంటూ బేషరతుగా కార్మికులు సమ్మె విరమించాలని ఫాసిస్టు వ్యతిరేక సమితి కార్యవర్గం తీర్మానించింది. సోషలిస్టులకు, కమ్యూనిస్టులకు అభిప్రాయాలు కలవలేదు గనక సమ్మెకు సానుభూతికూడా చూపనంది.

సమ్మె నోటీసులు ఇచ్చినాక ఫాసిస్టు వ్యతిరేక సమితిలో కమ్యూనిస్టు వ్యతిరేకత తీవ్రరూపం ధరించసాగింది. థీన్‌పే నాయకత్వంక్రింద వున్న కమ్యూనిస్టు గ్రూపువారు "న్యూ డెమాక్రసీ" అనే పత్రికలో తాత్కాలిక ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

సమ్మెదారులు తమ కోర్కెలను వదులుకోవాలని తాత్కాలిక ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందనీ, తత్వం విషయంలో తమ నిర్ణయాన్ని సమ్మెదారులపై రుద్దిందనీ విమర్శిస్తూ వ్యాసం వ్రాశారు. "సమ్మెదారులకు ఏ మాత్రమూ యిష్టంలేని షరతులపై వంది కుదర్చడంలో గవర్నరు జాతీయనాయకుల్ని ఉపయోగించుకున్నారు" అని వ్రాశారు. దానిపై సమితి నాయకులు మండిపడ్డారు. ఈ వ్యాసాన్ని ఉపసంహరించుకొని బహిరంగ క్షమార్పణ చెప్పమన్నారు. థీన్‌పే అనుయాయులు అంగీకరించలేదు.

దానితో, సోషలిస్టులు, సమితి నాయకులు థీన్‌పే కమ్యూనిస్టుల్ని, ట్రేడ్‌యూనియను, కృషక్ ఛకార్ని సమితినుంచి తొలగించాలని తీర్మానం తెచ్చి ప్యాసుచేశారు

### కమ్యూనిస్టుల ప్రయత్నాలు

కమ్యూనిస్టులలో వచ్చిన అంతఃకలహాలు, థీన్‌పే నాయకత్వం అవలంబించిన రాజనీతి ఫాసిస్టు వ్యతిరేక సమితిలో మితవాదులకు బాగా బలం కలిగించింది. గత మాసంలో సోషలిస్టు కాన్ఫరెన్సులో కమ్యూనిస్టుల్ని తొలగించాలనేతీర్మానం ప్యాసయింది. వారే కమ్యూనిస్టు వ్యతిరేకోద్యమానికి నేడు నాయకత్వం వహిస్తున్నారు.

ప్రభుత్వంలో పాల్గొనడంచేత అతని అనుచరులలో కూడా అసంతృప్తి ప్రబలింది. ఇప్పుడుకూడా థిన్‌పే తనంతటతాను పదవిని వదులుకోడానికిఇష్టపడడంలేదు. కమ్యూనిస్టులందరికీ ఈధోరణి ఆశ్చర్యం కలిగిస్తోంది.

### ఫాసిస్టు వ్యతిరేకసమితి భావి

ఇదివరకుసామ్రాజ్యవాద వ్యతిరేకసంస్థలన్నీ సమితిలో కలిసివుండేవి. నేడు ఆస్థితిలేదు. థాకిన్ సో నాయకత్వం క్రిందనున్న బర్మా కమ్యూనిస్టుపార్టీని ఎప్పుడో వెళ్ళగొట్టారు. ఇప్పుడు థీన్‌పే అనుచరులను, ట్రేడ్‌యూనియన్లను, కిసాన్ సభలను వెళ్ళగొట్టారు. ఆ సమితి జాతీయవాదుల ఐక్య సంఘటనగా ఇంక వుండక, ఒక పార్టీగా తయారయిపోయింది. బర్మా దేశభక్తులలో వచ్చిన ఈ తగాదాలు, విభేదాల ఫలితంగానే స్వాతంత్ర్యోద్యమంలో చీలికలు వచ్చేయి. ప్రజల దృష్టిని జాతీయోద్యమంమీద నుంచి మరల్చాలనే సామ్రాజ్యవాదుల ఎత్తులు ఫలించాయి.

### సమ్మె చీలదీస్తున్నారు

నేడు సమ్మె ప్రారంభంకాగానే ఆంగ్‌సాన్ రంపపు మిల్లుల కార్మికుల వద్దకువెళ్ళి పనులలో చేరమని ఒత్తిడి తెస్తున్నాడు.

### ధాన్‌టూన్ వివరణ

కమ్యూనిస్టు నాయకుడు థాన్‌టూన్ తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణాన్ని తీవ్రంగా ఖండించి ఆంగ్‌-సాన్, థీన్-పేలు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలలో చిక్కారన్నాడు. ఫ్యాసిస్టు వ్యతిరేక సమితిలో 3 వ వంతువుండే కమ్యూనిస్టులను వెళ్ళగొట్టాలంటే జనరల్ బాడీకేగాని, కార్యకారిణీసమితికి అధికారం లేదన్నాడు. వారి రాజీధోరణి ప్రజావుద్యమాలను చీలదియ్యడంలోకి దిగిందన్నాడు.

# ప్రజాబలాన్ని చూరగొన్న కమ్యూనిస్టుపార్టీని అణచడం కొమింటాంగు తరంకాదు

## చైనా అంతర్యుద్ధంలో ఇరుపక్షాల బలాబలాలు

అమెరికా సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో కొమింటాంగు ప్రభుత్వం తలపెట్టిన అంతర్యుద్ధం చైనాలో, నానాటికి క్రొత్తప్రదేశాలకు ప్రాకుతూంది.

చైనాసమస్య యుద్ధరంగంలోనేతప్ప మరోవిధంగా పరిష్కారం కాదేమో అనిపిస్తూంది. చంగ్-కై-షేక్ ప్రభుత్వం పైకి ఎన్ని చెబుతున్నప్పటికీ, నిజానికి శాంతిస్థాపనను కోరడంలేదు. తనకు లభిస్తున్న అమెరికా సహాయంతో, కమ్యూనిస్టులను పూర్తిగా తుడిచిపెట్టగలనని వానిధీమా. అందువల్లనే క్రొత్త వ్యూహాలు పన్నడానికి, క్రొత్తసేనలను ఆయా రంగాలకు పంపడానికి వ్యవధి కోసం, పదిరోజులు, పదిహేను రోజులు యుద్ధవిరమణనే మొదటినుంచీసూచిస్తూ వచ్చింది. దేశమంతటా, కాలపరిమితి లేకుండా యుద్ధవిరమణ అన్న సూచనను నిరాకరిస్తూ వచ్చింది.

### మిలటరీ బలాబలాలు

ఈ అంతర్యుద్ధపు అంతిమ ఫలితం కమ్యూనిస్టు, కొమింటాంగు పక్షబలాబలాలపై ఆధారపడి ఉంటుంది. ఈ సంవత్సరంలో ఒక్క మిలిటరీ బలాన్నే కాకుండా, ఇతర విషయాలను కూడ చూడాలి.

అచ్చంగా మిలిటరీ సంఖ్యాబలంలో కొమింటాంగుదే పైచేయి అన్నమాటను ఎవ్వరూ కాదనలేరు. కొమింటాంగు పార్టీకి 251 సేనలు అంటే, 30 లక్షల సైన్యముంది. అందులో సుమారు పది లక్షల మందికి అమెరికా వారు అధునాతన ఆయుధాలనే సప్లయి చేశారు.

కమ్యూనిస్టులకి 12 లక్షల సైన్యం మాత్రమే ఉంది. పాతకాలపు ఆయుధాలతో ఉన్న 20లక్షల వాలంటీరు సైన్యం అదనంగా ఉంది.

### ప్రజాబలం

ఇక ఈరెండు పక్షాల వెనుకవున్న ప్రజాబలాన్ని, అదనుసమయంలో అదనపు సైన్యసేకరణ శక్తిని పరిశీలిద్దాము.

ఈ విషయంలో కమ్యూనిస్టులదే పైచేయి అన్న విషయం నిర్వివాదాంశం. కొమింటాంగు పాలిత ప్రాంతంలో 35 కోట్ల ప్రజలున్నారు. కమ్యూనిస్టు ప్రదేశాల్లో 13 కోట్లు మాత్రమే ఉన్నారు. కాని, కమ్యూనిస్టులు అమలుజరిపిన వ్యవసాయిక సంస్కరణల ఫలితంగా, కమ్యూనిస్టుప్రాంతాల్లో చక్కని పంటలు పండుతున్నాయి. కమ్యూనిస్టులు నిర్మించిన ఆర్థికవ్యవస్థలో జీవితానికి భద్రత చేకూరింది. ప్రజలు సుఖపడుతున్నారు. శతాబ్దాలుగ ఎరుగని యీ సౌఖ్యాన్ని దక్కించుకోడానికి ఆ 13 కోట్ల ప్రజలు ఎంత త్యాగంచేయడానికయినా సిద్ధంగా ఉన్నారు.

కొమింటాంగు పార్టీవెనుక ఈప్రజాబలంలేదు. కొమింటాంగు పాలిత ప్రదేశాల్లో కరువుకాటకాలూ జమీందారుల దోపిడీయు రాజ్యంచేస్తున్నాయి. దొంగవర్తకులు పెంచుతూన్న అధిక ధరలను భరించలేక పట్టణాల్లో ఒక కార్మికులే [illegible] ఘటిస్తున్నారు. కొమింటాంగు ఆర్థిక విధానం పెద్దవ్యాపారస్తులకు అమెరికన్ పెట్టుబడిదారులకు మాత్రమే అనుకూలంగా ఉంది. దీనివల్ల తీవ్రఅసంతృప్తి రేగుతూంది. అన్నిపక్షాలు కలిసి ఉన్న ప్రజాప్రభుత్వం కావాలి. అమెరికా వారు తొలగి పోవాలి; అని జరిగిన ప్రదర్శనాల్లో చిన్నవ్యాపారస్తులు, చిన్నబ్యాంకర్లుకూడా కలిశారని ఇటీవల వచ్చిన వార్త తెలుపుతోంది. ఈ విధంగా కొమింటాంగు వెనుకవున్నది ఒక పెద్ద అగ్ని పర్వతంకాని, ప్రజాబలం కాదు. కొమింటాంగుకు ఉన్న అండ అంతా పరాయి అమెరికా సామ్రాజ్యవాదుల ఆయుధబలమే.

కమ్యూనిస్టులకు ఇలాంటి విదేశీ సహాయం ఏమీలేదు. కాని, తమకున్న ప్రజాబలంతో కొమింటాంగు బలాలను ఎదుర్కోగలరు.

### రాజకీయంగా

ఇక రెండుపక్షాలు రాజకీయంగా ఎంత బలసంపన్నమో చూద్దాం.

ఈనాడు కొమింటాంగు జమీందారీ పాలకవర్గం అంతటి పనికిమాలిన, అవినీతికి పాల్పడిన పాలకవర్గం చైనా చరిత్రలో ఎన్నడూ లేదన్నది అందరూ అనుకుంటున్న విషయం. ఇలాంటి నియంతృత్వం ఇదివరకెన్నడూ లేదు. దేశంలో ఇంత అసంతృప్తి ఉండడం చేత కొమింటాంగు పార్టీ దీర్ఘకాలం అంతర్యుద్ధాన్ని సాగించలేదు. అంతర్యుద్ధాన్ని త్వరగాముగించి తనస్థానాన్ని బలపరుచుకోవాలనేచూస్తూంది.

కమ్యూనిస్టు ప్రదేశాల్లో పరిపాలన సాగిస్తున్నది ప్రజలచేత స్థాపించబడిన ప్రజాప్రభుత్వసంస్థలు. ఈనాడు చైనాలో ఒక్క కమ్యూనిస్టు ప్రదేశాల్లోనే తప్పనిసరిగా ఎన్నికలుజరుగుతున్నాయి. చైనా కమ్యూనిస్టు ప్రదేశాల్లో నిజమైన ప్రజాతంత్ర పరిపాలన అమలుజరుగుతున్నదనీ, ఈ వేళ కాకపోతే రేపయినా యావత్తు చైనా దానిని అనుసరించక తప్పదనీ మాంచెస్టరు గార్డియన్‌లాంటి బ్రిటిష్ మితవాద పత్రికలుకూడా అంగీకరించక తప్పిందికాదు. బలమైన ప్రజాస్వామిక పునాదులపై నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టుపార్టీ ఎంతదీర్ఘకాలం అంతర్యుద్ధాన్నయినా నెట్టుకొని నిలవగలదన్నది నిర్వివాదాంశం.

అంతర్యుద్ధంలో రెండుపక్షాలూ అనుసరిస్తున్న పద్ధతులు ఈ బలాబలాలను ప్రతిబింబిస్తున్నాయి. అమెరికా ఆయుధాలతో కొమింటాంగు పార్టీ సత్వర విజయాన్ని సాధించాలనుకుంటూంది. ఆ విధంగా, అసలే ఈగిన [illegible] కూలిపోతుందని కాపాడుకో గలుగుతాననుకుంటూంది.

తనకు కావలసినంత ఆయుధ బలం లేదన్న సంగతి కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది. కాని, అభేద్యమైన ప్రజాప్రాతిపదిక తన కున్నదని తెలుసు. దీర్ఘకాల యుద్ధాన్ని సాగించగల బలం కొమింటాంగు నియంతృత్వానికి లేదని కమ్యూనిస్టులకు తెలుసు. అందువల్ల గెరిల్లా పద్ధతుల్లో ప్రతిఘటిస్తూ, యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగింపజేసి కొమింటాంగు బలాన్ని తరగ చేయడం ఒక్కటే, ప్రజా విజయాన్ని సాధించగల మార్గమని కమ్యూనిస్టుల నిర్ణయం.

కమ్యూనిస్టు సేనలు గెరిల్లా పద్ధతుల ననుసరించడం వల్ల కొమింటాంగు ప్రభుత్వానికి సత్వర విజయం అందిన భ్రమ కలుగుతూంది. ఒక కేంద్రంపై కొమింటాంగు సేనలు దండెత్తాలనుకుంటే, ఇతర కీలక ప్రదేశాల్లో కమ్యూనిస్టుల విజృంభణను తట్టుకోవలసి వస్తూంది. కాల్గాన్ దగ్గర విజయం సాధించాము అని విర్రవీగే సరికి, పెకింగ్-హాంకో కీలక రైలుమార్గంలో చాలభాగం కమ్యూనిస్టుల వశమయిందని కొమింటాంగు ఒప్పుకోక తప్పిందికాదు.

ఏప్రదేశంమీదనైనా కొమింటాంగు సేనలు దండెత్తితే, కమ్యూనిస్టు తన బలాన్నంతటినీఒడ్డి అక్కడ నిలబడ్డారు. కొమింటాంగు సేనలను ప్రతిఘటిస్తూ, అక్కడ అవసరమైతే వెనక్కి వస్తున్నారు. కాని, అదేసమయంలో ఇతర చోట్ల, కొమింటాంగు సేనల సప్లయి మార్గాలు మొదలయిన ఆయువుపట్టుల మీద బలమైన దెబ్బలు తీస్తున్నారు.

### గత ఆరుమాసాల్లో

గత ఆరుమాసాల అంతర్యుద్ధ చరిత్ర ఈ పై వివరణను రుజువుచేస్తూంది.

జులైలో కొమింటాంగు ప్రభుత్వం ఉత్తర కియాంగ్సులో కమ్యూనిస్టులను తుడిచివేయాలనుకుంది. మిలటరీరీత్యా అక్కడ కమ్యూనిస్టుల స్థానం చాల దుర్బలమయినది. అయినప్పటికీ రెండు నెలల్లో కొమింటాంగు ప్రభుత్వం 80 వేల మంది సైనికుల్ని నష్టపడింది. అదేసమయంలో హోనాన్, షాంటుంగ్ రాష్ట్రాలు కమ్యూనిస్టు సేనలు ఎదురుదాడులుచేసి అనేక నగరాలను వశపరచుకున్నాయి. కాల్గాన్ విషయం మరొక నిదర్శనం.

ఇదంతా చూసి నాన్‌కింగులోని ఒక విదేశ పత్రికా విలేఖరి, చైనా అంతర్యుద్ధాన్ని చైనా-జపాను యుద్ధంతో పోల్చారు. అప్పటి జపానుస్థానంలో ఇప్పుడు కొమింటాంగు ప్రభుత్వం ఉందన్నారు. అప్పుడు జపాను సేనల్లోలాగానే, ఉత్తరచైనాలో కొమింటాంగు సేనలిప్పుడు కొన్ని ముఖ్యపట్టణాలను రైలుమార్గాలను మాత్రమే ఆక్రమించుకొని ఉందన్నాడు. మిగిలిన విశాల పల్లె ప్రదేశమంతా కమ్యూనిస్టులక్రింద ఉంది. ఎడతెగని గెరిల్లా పోరాటం సాగిస్తున్నదన్నాడు.

యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగింపచేసి, శత్రువు అలసిపోయేలా చేయడంలో కమ్యూనిస్టుల నైపుణ్యం కొమింటాంగుకు తెలియనిదికాదు. అందుకనే వారు కొన్ని ముఖ్యపట్టణాలను పట్టుకోగానే, శాంతి సంప్రదింపులకోసం పది, పదిహేను రోజులు యుద్ధవిరమణ అంటూ, [illegible] తమ బలాలను తిరిగి కూడదీసుకోడానికి వ్యవధి సంపాదించ జూస్తుంటారు.

కమ్యూనిస్టులు ఈ ఎత్తును సాగనివ్వడం లేదు. భవిష్యత్తులో కమ్యూనిస్టులకు అంతులేని విశ్వాసం వుంది. జపాను ఫాసిస్టు సైన్యంలో అత్యధిక భాగాన్ని ఎన్నో సంవత్సరాలు ఎదిరించి నిలవగలిగిన తాము, కొమింటాంగు సేనలను ప్రతిఘటించి జయించగలమనే ధైర్యం వారికుంది.

### చరిత్రలో ఎన్నడూలేని అంతర్యుద్ధం

కమ్యూనిస్టు నాయకుడు చౌ-ఎన్-లై ఇటీవల పత్రికావిలేఖరుల సభలో ఈ దిగువ వివరాలు బయటపెట్టాడు:

కొమింటాంగు ప్రభుత్వం తన 20 లక్షల సైన్యంలో 17 లక్షలను అంతర్యుద్ధంలో ఉపయోగిస్తుంది. గత 3 మాసాల్లో కమ్యూనిస్టు ప్రదేశాలపై ఆరువేల దండయాత్రలు సాగించింది. మూడువందల విమానదాడులు జరిపింది.

జూన్, జులై, ఆగస్టు మాసాల్లో కొమింటాంగు సైన్యం మొత్తం రెండు లక్షల సైనికులను నష్టపోయింది.

### అమెరికా సహాయం వివరాలు

అమెరికన్ల సహాయంలేనిదే కొమింటాంగు ఇంత పెద్ద అంతర్యుద్ధాన్ని తలపెట్టి ఉండజాలదు. అమెరికా వారు 6 కోట్ల 60 లక్షల డాలర్ల అప్పు, అరువుకవులు ఒడంబడిక క్రింద 90కోట్ల డాలర్ల ఆయుధాలు, కానుకక్రింద 80 కోట్ల డాలర్ల ఆయుధాలు, 271 యుద్ధనావలు, చైనాలోని అమెరికన్ విమానాశ్రయాలు కొమింటాంగు ప్రభుత్వానికిచ్చారు. ఇంతేకాకుండా రైల్వేల కాపలా, నదీమార్గాల కాపలా అంటూ అమెరికన్ సైనికులు యుద్ధనావలు అంతర్యుద్ధంలో ప్రత్యక్షంగాపాల్గొంటున్నాయని చౌ-ఎన్-లై అన్నాడు.

ఈనాడు చైనావ్యాపారంలో మొత్తం దిగుమతుల్లో మూరింట 53 వంతులు అమెరికా సరకులే. వెనుక జపాను సాగించిన వ్యాపారమంతా అమెరికా చేతుల్లోకి పోయింది. దీనిని కాపాడుకోడానికి, ఇంకా విస్తరించుకోడానికి అమెరికా బాహాటంగా చైనా అంతర్యుద్ధంలో జోక్యం కలిగించుకుంటోంది.



# శాంతిసమావేశ సింహావలోకనం

పదకొండువారాల రెండు రోజులపాటు జరిగినశాంతిసమావేశం అక్టోబరు 15వ తేదీన ముగిసింది.

ఈ సమావేశం ఏ తీరుగా సాగుతుందో మొదటిరోజుల్లోనే బయటపడింది. శాంతి సమావేశ తీర్మానాలకు మూడింట రెండువంతుల మెజారిటీ ఉండాలి అని విదేశాంగ మంత్రులసభ నిర్ణయించింది. ఈ నిబంధన ఉండడం బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాదులకు, వారి నమ్మిన బంటులయిన హాలెండు, గ్రీసు మొదలయిన ప్రభుత్వాలకు కంటకమనిపించింది. సమావేశం ప్రారంభమైనతోనే ఈనిబంధనపై దాడి ప్రారంభించారు. చిన్నరాజ్యాల హక్కులకై పోరాటం అంటూ ఈ శాంతి విచ్ఛిన్నకుట్రకు ముసుగు తొడిగారు. బ్రిటన్, అమెరికాలు వెనుక ఉండి, ఆస్ట్రేలియా, ఫాసిస్టు గ్రీసు, హాలెండు ప్రభుత్వాల ప్రతినిధులచేత ఈ దాడి నడిపించారు. అగ్రరాజ్య సంయుక్త నిర్ణయాలను కొన్ని అగ్రరాజ్యాలే భంగపరుస్తూ, శాంతి స్థాపనకు ప్రమాదకరమైన పంథాలో నడుస్తున్నాయని సోవియటు ప్రతినిధులు ఈ కుట్రను తూర్పార బట్టారు. సోవియటూ, జకోస్లోవేకియా యుగోస్లావియా, పోలెండు, యుక్రైన్, వైట్ రష్యా ప్రతినిధులు యీ కుట్రను వ్యతిరేకించారు. చివరకు బ్రిటన్, అమెరికాలు తమ కీలుబొమ్మల సంఖ్యా బలంతో, అగ్రరాజ్య సంయుక్త నిర్ణయానికి పూర్తి వ్యతిరేకమయిన వోటింగు పద్ధతిని ఆమోదింపచేశారు. మూడింట రెండువంతుల మెజారిటీ వచ్చిన వాటినేకాకుండా, సామాన్య మెజారిటీ వచ్చినవాటినికూడా తుది నిర్ణయంకోసం విదేశాంగమంత్రుల యెదుట పెట్టవచ్చునన్న తీర్మానంగెలిచేలా చేశారు. ఈవిధంగా ప్రస్తుతము అల్పసంఖ్యాకంగావున్న నూతన ప్రజాస్వామిక యూరప్‌దేశాలకు నష్టదాయకమైన తీర్మానాలను, తమకున్న మెజారిటీతోనే ప్యాసు చేయించుకోగల అవకాశాన్ని సామ్రాజ్యవాద ప్రభుత్వాలు సంపాదించాయి.

ఈసమస్య వట్టి వోట్ల సంఖ్యకు సంబంధించిన సమస్యమాత్రమేకాదు. ఇది రాజకీయ ప్రాముఖ్యతగల సమస్య అని మొలొటావ్ దానిపై సాగిన చర్చకు జవాబిస్తూ అన్నాడు. శాంతి సమావేశంలో ప్రజాతంత్ర వ్యతిరేక సూచనలు నెగ్గడానికి సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టిన ఈ వోటింగుపద్ధతే కారణం.

ఫిన్లండు శాంతిఒడంబడికపై మాట్లాడుతూ మొలొటావ్ ఈవిషయాన్నే స్పష్టంచేశాడు.

"ఆయాదేశాలకు అతిప్రధానమైన సమస్యలపై, వాటితో సంబంధంలేని దేశాలు నిర్ణయంతేల్చగల అవకాశం ఈసమావేశంలోనివోటింగుపద్ధతి కలిగించింది." అన్నాడు.

"మరొక ముఖ్యవిషయం ఏమంటే ప్రతి అంశంమీద అమెరికా ప్రతినిధి, పనిగట్టుకొని, మొట్టమొదట వోటుచేయడం; అతనిని అనుసరిస్తూ 12లేక 13మంది వోటుచేయడం జరిగింది. బ్రిటన్ అమెరికాల సూచనను గెలిపించడమే ఈ కూటమికి ప్రధానమయింది. న్యాయాన్యాయాలతో వారికి పనిలేకపోయింది." అని మొలొటావ్ తూర్పారబట్టాడు.

ప్రజాస్వామికవాదులకీ సమావేశం కొంత ఆశాభంగం కలిగించింది. అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు పరమసంతోషం కలిగించింది. అందువల్లనే అమెరికా విదేశాంగ మంత్రి బైరన్సు, తన తుది ఉపన్యాసం ఇస్తూ "చిన్నదేశాల ప్రతినిధులు ఈ సమావేశానికి మహోపకారంచేశారు" అని తమ తాబేదారులయిన ఫాసిస్టు గ్రీసు, ఆస్ట్రేలియా, హాలెండు మొదలైన ప్రభుత్వాల ప్రతినిధులను స్తుతించాడు.

కాని సోవియటు, ప్రజాస్వామికయూరప్ వీరిపన్నాగాలను తప్పకుండా ప్రతిఘటిస్తాయి.

"ప్రజాశ్రేయస్కర శాంతిని స్థాపించడానికి సోవియటు కృషి చేస్తుంది" అని మొలొటావ్ తన అంత్యోపన్యాసంలో అన్నాడు.

★

ఇటలీ సరిహద్దులలో ఈదిగువ మార్పులు జరిగాయి.

ట్రీస్టీ, దాని చుట్టుప్రక్కలనున్న ప్రదేశం ఇటలీనుంచి విడిపోయి, స్వతంత్ర భూభాగంగా ఏర్పడుతుంది. ఇన్నాళ్ళు ఇటలీ క్రింద ఉండిన వెనీషియా గ్యూలా రాష్ట్రం ఇప్పుడు చాలవరకు యుగోస్లావియాకు చెందుతుంది. క్రొత్త సరిహద్దు గోరిజియా, మాన్‌ఫాల్కోన్ నగరాల పక్కగుండా పోతుంది. ఈ రెండు నగరాలూ ఇటలీ క్రిందనే ఉంటాయి. ఇస్ట్రియా ద్వీపకల్పం పూర్తిగా యుగోస్లావియాకు వస్తుంది. డొడికానిస్ దీవులను, మిలిటరీ రహితం చేసి గ్రీసుకు ఇచ్చివేస్తారు. ఫ్రెంచి సరిహద్దులో కొద్ది మార్పులు జరిగాయి. మాంట్‌సెనిస్ కొండవద్ద, బ్రిగావద్ద కొంత మిలిటరీ ప్రాముఖ్యతగల ప్రదేశం ఫ్రాన్సుకు చెందుతుంది.

తన వెనుకటి వలసదేశాలయిన ఇటాలియన్ సోమాలిలాండు, లిబియా, ఎరిట్రియాలను ఇటలీ పూర్తిగా వదులుకుంటుంది. వీటి భవిష్యత్తు మరొక సంవత్సరంలో అగ్రరాజ్యాలునిర్ణయిస్తాయి. చైనాలో తనప్రత్యేక హక్కులను కూడా ఇటలీ వదులుకుంటుంది.

సోవియటు, యుగోస్లావియా, గ్రీసు దేశాలకు ఇటలీ ఒకొక్క 2½ కోట్ల పౌన్లు యుద్ధనష్టపరిహారం ఇచ్చుకుంటుంది. అబిసీనియాకు 62½ లక్షల పౌన్లు ఇస్తుంది.

### రుమేనియా

రుమేనియా, బెస్సరేబియా రాష్ట్రాన్ని సోవియటుకు, దక్షిణ దోబ్రుజా రాష్ట్రాన్ని బల్గేరియాకు ఇచ్చివేస్తుంది. రుమేనియాకు చెందిన ఉత్తర ట్రాన్సిల్వేనియాను 1940 లో హిట్లరు హంగరీకి దానంచేశాడు. ఈరాష్ట్రం తిరిగి రుమేనియాకు చెందుతుంది. ఒక్క సోవియటుకే 7½ కోట్ల పౌన్లు యుద్ధనష్టపరిహారం యిస్తుంది.

రుమేనియాలోని మిత్రరాజ్యాల పెట్రోలు కంపెనీలకు ఇబ్బంది కలిగిస్తూ రుమేనియా ఫాసిస్టు ప్రభుత్వం 1942 లో కొన్ని చట్టాలు చేసింది. వీటినిప్పుడు రద్దుచేయాలన్నారు. ఈకంపెనీలనుండి రుమేనియా ప్రభుత్వం కొనేచమురుకు ప్రపంచమార్కెటు పరిస్థితులనుబట్టి ధర ఇవ్వాలన్నారు.

### బల్గేరియా

బల్గేరియా-గ్రీసు సరిహద్దు నిర్ణయం కాలేదు. విదేశాంగ మంత్రుల సభలో దీనిని నిర్ణయిస్తారు. ఈసరిహద్దు మిలిటరీరహితం చేయబడుతుంది.

బల్గేరియా, ఆరుసంవత్సరాల్లో గ్రీసు, యుగోస్లావియాలకు మొత్తం 3 కోట్ల 12½ లక్షల పౌనుల యుద్ధనష్టపరిహారం వస్తురూపేణా చెల్లిస్తుంది.

### హంగరీ

హిట్లరు తనకిచ్చిన ఉత్తర ట్రాన్సిల్వేనియాను హంగరీ రుమేనియాకు ఇచ్చివేస్తుంది. స్లోవాక్‌రాష్ట్ర రాజధాని అయిన బ్రాటిస్లావాకు ఎదురుగుండా డాన్యూబ్‌నది దక్షిణతీరంపై కొంత ప్రదేశాన్ని జకోస్లోవేకియాకు ఇచ్చుకుంటుంది.

జకోస్లోవేకియాలోఉన్న రెండు లక్షల హంగరీ ప్రజలను తిరిగి హంగరీలోకి తీసుకోవడం గురించి జకోస్లోవేకియాతో ప్రత్యేకంగా రాయబారాలు జరుపుకోవాలన్నారు.

రష్యాకు [illegible] కోట్ల పౌనులు, యుగోస్లావియా, జకోస్లోవేకియాలకు కలిసి 3½ కోట్ల పౌనులు యుద్ధ నష్టపరిహారాలు చెల్లించుకొంటుంది. (ఈ అంశం సాధారణ మెజారిటీతో నెగ్గిందికాబట్టి దీనిపై అంత్యనిర్ణయం విదేశాంగ మంత్రులసభ తేల్చుతుంది)

### ఫిన్లండు

ఫిన్లండు పెట్సామో రాష్ట్రాన్ని సోవియటుకు ఇస్తుంది. 1940 లో సోవియటుతో చేసుకున్న ఒడంబడికను, యుద్ధంలో ఫిన్లండు భంగపరిచింది. ఆ ఒడంబడిక షరతులను ఫిన్లండు తిరిగి అమలులో పెడుతుంది.

1940 లో హాంగో ద్వీపకల్పాన్ని రష్యా కవులుకు తీసుకొంది. ఆకవులును సోవియటు వదులుకుంటుంది. పోర్కాలాఉడ్ అనే ప్రదేశాన్ని సోవియటు ఇప్పుడు 50 సంవత్సరాలు కవులుకు తీసుకుంటుంది.

బాల్టిక్ సముద్రంలోని అలాండ్ దీవులు మిలిటరీ రహితంగా ఉండాలి.

ఫిన్లండు ఎనిమిదేళ్ళలో 7½ కోట్ల పౌనులు యుద్ధనష్ట పరిహారం సోవియటుకు ఇచ్చుకుంటుంది.

పై అయిదుదేశాల సైనిక విమాన, నౌకా బలాలను చాలవరకు తగ్గించారు.

### దోపిడీ తత్వంతో సామ్రాజ్యవాదులు విధించిన షరతులు

సోవియటు, యుగోస్లావియా జకోస్లోవేకియా మొదలైన ప్రజాస్వామిక దేశాలతో పై అయిదు దేశాలూ పరస్పర అభివృద్ధి దాయకమైన వర్తక సంబంధాలు పెట్టుకోగల అవకాశాలున్నాయి. రుమేనియా, బల్గేరియా మొదలైన దేశాలు ఇలాంటి సంబంధాలు పెట్టుకున్నాయి కూడా. అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు ఇలాంటి సంబంధాలను అరికట్ట నిశ్చయించాయి. వర్తకసుంకాలు మొదలైన విషయాల్లో ఇవి ఏ దేశానికైనా ఎక్కువ సౌకర్యాలు కలిగిస్తే, అలాంటివి అమెరికా బ్రిటన్ మొదలైన మిత్రరాజ్యాలన్నింటికీ కూడా కలిగించాలని పట్టుబట్టాయి.

ఈ షరతులు ఇటలీ విషయంలో మూడు సంవత్సరాలు, మిగిలిన నాలుగుదేశాల విషయంలో 18 మాసాలే వర్తించాలట.

ఈషరతులే ఆదేశాల్లో పెట్టుబడిదారీ దేశాల దోపిడీకి అవకాశం కల్గిస్తుంది. వాటి పోటీకి తట్టుకోలేక ఇప్పుడిప్పుడే కాలూ, చేయీ కూర్చుకుంటూన్న చిన్న ప్రజాస్వామిక దేశాలు దెబ్బతింటాయని సోవియటు వ్యతిరేకించింది. కాని, విదేశాంగసభలోనూ, తర్వాత శాంతిసమావేశంలోనూ బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాద ప్రభుత్వాలు, తమ సంఖ్యాబలంతో పైషరతు నెగ్గేలాచేశారు.

ఈషరతులో సోవియటు ఒక చిన్న అంశం చేర్పించింది. మిత్రరాజ్యాల ప్రభుత్వాలకు చెందిన గుత్త వ్యాపార సంస్థలకు పై సౌకర్యాలు వర్తించవని ఈ అంశం. దీనిని శాంతి ఒడంబడికలో చేర్చక తప్పింది కాదు. ఈ విధంగా సోవియటు ఇటలీ మొదలైన అయిదు రాజ్యాలను పెట్టుబడిదారీ ప్రభుత్వాల దోపిడీనుండి కొంతవరకయినా కాపాడ గలిగింది.

డాన్యూబ్ నది విషయంలో కూడా బ్రిటన్, అమెరికాలు తమ సామ్రాజ్యవాద దోపిడీ తత్వాన్ని బాగా ప్రదర్శించారు. డాన్యూబ్‌నదిపై స్వేచ్ఛా వ్యాపారహక్కులు మిత్రరాజ్యాలన్నింటికీ కావాలన్నారు. "డాన్యూబ్ దేశాలకు ఆ నది జీవనాడిలాంటిది, స్వేచ్ఛావ్యాపారం పేరిట ఆ దేశాల్లో దోపిడీ సాగించి, చివరకు వాటిని తమ వలసలుగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే బ్రిటన్ అమెరికాలు ఈ సూచన చేస్తున్నాయి. లేకపోతే సూయజ్, పనామా కాలువల్లో ఇతరుల కివ్వని హక్కులు ఇది డాన్యూబ్ నదిలోనే అడగడం దేనికి" అని సోవియట్ వ్యతిరేకించింది. ఈవిషయంలో కూడా బ్రిటన్, అమెరికాలు, గ్రీసు, హాలెండు, ఆస్ట్రేలియా, ఇండియా ప్రతినిధుల్లాంటి తమ కీలుబొమ్మల సంఖ్యాబలంతో తమ సూచనను ఆమోదింపచేసుకున్నాయి.

### ఫాసిస్టు వ్యతిరేక సూచనకు ఓటమి

ఫాసిజాన్ని నిర్మూలించడానికి ఆయా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలనీ, యుద్ధ నేరస్థులను, దేశద్రోహులను అరెస్టుచేసి శిక్షించాలనీ బల్గేరియా, రుమేనియా, హంగరీ, ఫిన్లండు దేశాలతో శాంతి ఒడంబడికల్లో స్పష్టపరిచారు.

కాని, ఇటలీ ఒడంబడిక విషయంలో ఒక చిత్రం జరిగింది. బ్రిటన్ పెత్తనంక్రిందవున్న ఇటలీలో ఫాసిజం పూర్తిగా చావలేదని అందరకూ తెలుసు. ట్రీస్ట్‌లో స్లావ్ ప్రజల జాతీయ ప్రదర్శనలను భగ్నం చేయడానికి బ్రిటిష్ అధికారులు ఇటలీనుండి ఫాసిస్టు గూండాలను పంపిన వార్తలను ఇటీవలనే విన్నాం. అందువల్ల, "ఇటలీ ప్రభుత్వం ఫాసిస్టు సంస్థలను పూర్తిగా నిషేధించాలి" అని పోలెండు ప్రతినిధి ఒక తీర్మానం పెట్టాడు. సామ్రాజ్యవాద ప్రభుత్వాల దయవల్ల ఈ తీర్మానం వోడిపోయింది.

బ్రిటన్, అమెరికాలు గ్రీసు, హాలెండ్ మొదలయిన తమ కీలుబొమ్మలచేత ఆడించిన ఆట ఎంత దూరంపోయిందో తెలుపడానికిది ప్రబల నిదర్శనం.


ఈశాంతి ఒడంబడికలపై సంతకాలు జరిగిన 3 నెల్లలో ఆయాదేశాల్లో వున్న మిత్రరాజ్య సేనలు తొలగించబడతాయి. రుమేనియా-హంగరీల్లోమాత్రం సోవియటు-ఆస్ట్రియాతో తన రాకపోకలను కాపాడుకోడానికి కొన్ని సేనలను ఉంచుకోవచ్చునని శాంతి సమావేశం అంగీకరించింది.

శాంతి ఒడంబడిక విషయమై తుది నిర్ణయాలను తేల్చడానికి బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, సోవియటు విదేశాంగ మంత్రులు న్యూయార్కులో నవంబరు నాలుగున సమావేశమవుతారు.

### శాంతికాముకులెవరో విచ్ఛిన్నకులెవరో బయటపడింది

సుప్రసిద్ధ సోవియటుపత్రిక 'న్యూటైమ్సు' శాంతి సమావేశాన్ని సింహావలోకనంచేస్తూ ఇలా అంది: "కొన్ని ముఖ్యసమస్యలపై ప్రజాశ్రేయస్సుకోరేవారికి సంతృప్తికరమైన నిర్ణయాలు జరుగలేదు. అయినప్పటికీ ఈ సమావేశం ఒక గొప్ప నిర్మాణాత్మకమైన ఫలితాన్ని సాధించింది. లోకకళ్యాణం కూర్చగల శాంతికోసం ఏయేదేశాలు కృషి చేస్తున్నాయో, దానిని అరికట్టడానికి ఎవరు ప్రయత్నిస్తున్నారో ప్రపంచ ప్రజలకు సుస్పష్టం చేసింది.

"నిజమైన శాంతికుదరకుండా చేయడానికి అభివృద్ధి నిరోధక వర్గాలు చాలా ప్రయత్నించాయి. నాజీ విషబీజాలను కాపాడడానికి ఈవర్గాలు తమశక్తి నంతటినీ ఉపయోగిస్తున్నాయి. యూరపులో అనేక దేశాల్లో ప్రజాస్వామికశక్తులు దిగ్విజయం సాధించాయి. ఈ విజయం ఈవర్గాలలో అంతులేని ద్వేషాన్ని రగిల్చింది. ఆ ప్రజాస్వామిక శక్తులను అణచడానికి ఈ వర్గాలు కుట్రలు సాగిస్తున్నారు."



రైతులు కష్టించి పండించుకొంటున్న పొలాలపై జమీందార్ల తిష్ఠ—ప్రధాని పరధ్యానం

# 'డిటెన్షన్' వ్యతిరేక దినోత్సవం

## పలుచోట్ల జయప్రదంగా జరిగింది

బెజవాడ, అక్టోబరు 19

'డిటెన్షన్'ను వ్యతిరేకంగా సమ్మెలూ, ప్రదర్శనలూ, సభలూ 18 వ తేదీని జరప మని రాష్ట్రంలో విద్యార్థి ఫెడరేషన్, విద్యార్థి కాంగ్రెస్, ముస్లిం విద్యార్థి ఫెడరేషన్‌లు పిలు పిచ్చాయి. దీనిననుసరించి బెజవాడలో అన్ని హైస్కూళ్ళల్లోను, కాలేజీలోను 100 కి 90 మంది సమ్మె చేశారు. ముస్లిం విద్యార్థి ఫెడ రేషను, విద్యార్థి ఫెడరేషను కలిసి బహిరంగ సభ పెట్టాయి. విద్యార్థి కాంగ్రెసు కలిసి రాకుండా, వేరే సభ పెట్టుకుంది. 'డిటెన్షన్ విధానం, అనే బొమ్మ తగులబెట్టబడింది.

### గురజాలలో ఐక్యప్రదర్శనం

గురజాల, అక్టోబరు 18

గురజాలలో మూడు విద్యార్థి సంస్థలు కలిసి డిటెన్షన్ వ్యతిరేకదినం జరిపాయి. 80% విద్యార్థులు సమ్మె చేశారు. ఊరేగింపు, బహిరంగసభ జరిగాయి. శిక్షిస్తామనీ, విద్యార్థి ఉచిత వేతనాలు రద్దుచేస్తామనీ బెదరిస్తూ, హెడ్‌మాస్టరు నోటీసుకట్టారు.

### వినుకొండ హెడ్‌మాస్టరు పోలీసులకు కబురు

వినుకొండ, అక్టోబరు 18

వినుకొండ హైస్కూలు విద్యార్థుల సమ్మెలో యించుమించు అందరూ పాల్గొ న్నారు. అనవసరంగా బెదరిపోయి హెడ్ మాస్టరు పోలీసులకు, పేటస్త్రేటుకు కబురు పంపారు.

### సత్తెనపల్లిలో

సత్తెనపల్లి, అక్టోబరు 18

డిటెన్షనును వ్యతిరేకంగా సత్తెనపల్లి హిందూ హైస్కూలు విద్యార్థులు సమ్మె చేశారు. 500 మంది విద్యార్థుల్లో ఒక్కరు కూడా స్కూలుకు పోలేదు. హిందూ, ముస్లిం, క్రిష్టియన్ విద్యార్థులంతా సమ్మెలో పాల్గొన్నారు. ఉదయం 300 మందితో ఊరే గింపు జరిగింది.

### గుంటూరు విద్యార్థులపట్ల సానుభూతిగా బందరులో సమ్మె

బందరు, అక్టోబరు 18

ఆంధ్ర క్రిష్టియన్ కాలేజీ విద్యార్థులపై ప్రిన్సిపాలు దమననీతికి అసమ్మతిగా, హిందూ కాలేజీ, హైస్కూలు విద్యార్థులు చాలమంది సమ్మె చేశారు.

### నందిగామలో సమ్మె

నందిగామ, అక్టోబరు 18

నూటికి 95 మంది, పికెటింగు అవసరం లేకుండానే సమ్మె చేశారు. విద్యార్థి ఫెడ రేషను, విద్యార్థి కాంగ్రెసు విడిగా పాల్గొ న్నాయి.

### కైకలూరులో

కైకలూరు హైస్కూల్లో సమ్మె జయ ప్రదంగా జరిగింది.

# బర్మా కమ్యూనిస్టు పార్టీపై నిషేధం రద్దుఅయింది

రంగూన్, అక్టోబరు 18

బర్మా తాత్కాలిక ప్రభుత్వం థాకిన్ సో నాయకత్వం క్రిందవున్న కమ్యూనిస్టు పార్టీ మీదనూ, కమ్యూనిస్టు వర్కర్సుయూనియను మీదనూగల నిషేధాజ్ఞలను రద్దుచేసింది.

# ఏలూరు విద్యార్థుల సమ్మె

ఏలూరు, అక్టోబరు, 18

ఈ రోజు ఏలూరు కాలేజీ, హైస్కూళ్ళల్లో సమ్మె జరిగింది. సమ్మెలో దాదాపు నూటికి నూరుమంది విద్యార్థులు పాల్గొన్నారు. ముస్లిం విద్యార్థి ఫెడరేషన్ కూడా పాల్గొన్నది.

సమ్మె కార్యక్రమాన్ని జయప్రదంగా కొనసాగించడానికి మొదట విద్యార్థి ఫెడ రేషన్, విద్యార్థి కాంగ్రెస్‌లు కలిసి పనిచేయా లని నిశ్చయించుకున్నాయి. రెండుసంఘాల విద్యార్థులు కలిసి ఐక్యంగా ఒక కరపత్రాన్ని రాసినంతకాలుబెట్టి ప్రెస్సుకుకూడా ఇచ్చారు. కాని ఇంతలో తమ రాష్ట్ర సంఘాన్నుంచి ఫెడరేషన్‌తో కలిసి పని చేయగూడదని ఒక సర్క్యులరు వచ్చిందనీ, కాబట్టి ఫెడరేష నుతో కలిసి పనిచేయం అనీ విద్యార్థికాంగ్రెస్ నాయకులు చెప్పారు. ప్రెస్సుకిచ్చిన కర పత్రాన్ని మళ్ళీ వాపసు తీసుకున్నారు. విద్యార్థి కాంగ్రెసువారి ఈ విచ్ఛిన్న పోకడలు విద్యా ర్థుల్లో చాలా అసంతృప్తిని కలిగించాయి.

3 నెలలక్రితం బర్మా గవర్నరు థాకిన్ సో నాయకత్వాన పనిచేస్తూన్న కమ్యూనిస్టులపై నిషేధాన్ని ప్రకటించాడు.

*

# కమ్యూనిస్టులను తొలగించరాదు

## బర్మా యువజనుల హెచ్చరిక

రంగూన్, అక్టోబరు 18

"కమ్యూనిస్టులను పాసిస్టు వ్యతిరేక సమి తిలో వుండకూడదనడం సామ్రాజ్య వ్యతిరేక శక్తులను విచ్ఛిన్నం చేయడమే," అని నేడు బర్మా యువజన కార్యవర్గం తీర్మానిం చింది.

బర్మాలో సమ్మెపరిస్థితులలో ఏమాత్రమూ మార్పులేదు. నూనె డిపోలవద్ద పికెటింగు తీవ్రంగా సాగుతూంది.

# తుంగభద్ర-పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం

## మద్రాస్-నైజాం ప్రభుత్వాల నిర్ణయం

హైదరాబాదు, అక్టోబరు 17

తుంగభద్ర - రామపాదసాగర ప్రాజెక్టుల నిర్మాణం విషయమై మద్రాస్ - నైజాం ప్రభుత్వాల నడుమ అంగీకారం కుదిరినట్లు ప్రకటించబడింది.

Edited, Printed & Published by Katragadda Rajagopalarao at the Prajasakti Press, Moghalarajapuram, Bezwada.
Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE